ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. పీటి దెయ్యాలు—శ్రీధర్

19. వాళ్లు ముగ్గురు—కొవ్వలగడ్డ రామలక్ష్మి

32. మృత్యుతార (సీరియల్)—గిరిజ శ్రీ భగవాన్

57. పొంచివున్న శత్రువు—ప్రతాప రవిశంకర్

67. దొరగా వచ్చాడు మర్యాద చేయండి—బి. రాజేశ్వరి

84. గంజాయి స్మగ్లర్లు—ఎమ్.వి.వి. సత్యనారాయణ

107. కళాపోషకులు—వసుంధర

121. అమానుషం—బొమ్మిడి అచ్చారావు

144. కొత్తవాళ్ళను నమ్మకు—బసొప్ప బాలచందర్

157. పిస్టల్ పట్టిన శవం—విశ్వమోహిని

167. విదేశీ విద్రోహులు—ఎమ్.వి.వి. సత్యనారాయణ

188. కాంచన గ్రహం (సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

8. డర్టీగేమ్—సికిందర్

55. దొడ్డిదారి—వసుంధర

93. గంగులుగాడి పగ—ఎమ్.వి.వి. సత్యనారాయణ

123. చిదంబర రహస్యం—టెంపోరావు

157. రక్తం త్రాగే పిశాచం (సీరియల్)—వసుంధర

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, జోక్స్, మరెన్నో ఆకర్షణలు!!

నేటి దెయ్యాలు

శ్రీధర్

ఆఫీసులో టేబిల్‌కి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుని సర్ ఆర్థర్ కానన్ డాయల్ వ్రాసిన "ది హౌండ్ ఆఫ్ బాస్కర్ విల్లాస్" చదువుతున్నాడు హోమ్స్.

మరో ప్రక్క మరో కుర్చీలో కూర్చుని ఇయాన్ ఫ్లెమింగ్ వ్రాసిన 'డాక్టర్ నో' చదువుతున్నాడు జేమ్స్.

ప్రక్కన డిక్షనరీ పెట్టుకున్నాడు. మధ్య మధ్యలో దాని పేజీలు కూడా తిప్పుతున్నాడు.

"ఏం మనిషో! చక్కగా కానన్ డాయల్ కధలు చదువుకోకుండా, ఆ వెధవ జేమ్స్‌బాండ్ నవల్స్ చదువు తాడీ జేమ్స్" అనుకున్నాడు హోమ్స్ మనసులో.

సరిగ్గా అదే సమయంలో జేమ్స్ కూడా హోమ్స్ గురించి అనుకుంటున్నాడు, "ఆ కానన్ డాయల్ కధలు అలా మళ్ళీ మళ్ళీ చదవకపోతే ఏం పోయె! జేమ్స్‌బాండ్ కధల్లోవున్న ఎంజాయ్‌మెంటు ఆ క...."

ఆఫీసు మెట్లదగ్గర టకటకా చెప్పుల చప్పుడైంది. జేమ్స్ ఆలోచనలకు అంతరాయం కలిగింది.

మరునిమిషంలో ఓ నడివయస్కురాలు ఆఫీసు గదిలోకి అడుగుపెట్టింది. కంచిపట్టుచీర కట్టుకుంది. మెడలో కాసుల పేరు. హోమ్స్, జేమ్స్‌ల వంక చూస్తూ, "పత్తేదారులు మీ రిద్దరే అనుకుంటాను" అన్నదామె.

అప్పటివరకు ఆమెను నఖశిఖపర్యంతం పరిశీలనగా చూస్తున్న పార్ట్‌నర్స్ ఇద్దరూ లేచి నుంచున్నారు.

హోమ్స్ అన్నాడు, "రండి, రండి. ఇలా కుర్చీలో కూర్చోండి. మే మిద్దరమే పత్తేదారులం. నా పేరు హోమ్స్ నా పార్ట్‌నర్ పేరు జేమ్స్."

"మీ పేర్లేవిఁటీ చాలా వింతగా వున్నాయి. మీ తండ్రి గారి పేరేవిఁటీ!" ప్రశ్నించిందామె హోమ్స్‌ని.

అందుకున్నాడు జేమ్స్ "మా తండ్రిగారి పేరు ఇయాన్ ఫ్లెమింగ్. ఆయన తండ్రిగారి పేరు సర్ కానన్ డాయల్."

"ఈ పేర్లు మరీ విచిత్రంగా వున్నాయి! మీ యిద్దరూ క్రిష్టియన్లా? మిమ్మల్ని చూస్తూంటే అలా కనిపించడం లేదే. మీకీ పేర్లు ఎలా వచ్చాయయ్యా?" హాశ్చర్యం మిళిత

మైంది ఆమె ప్రశ్నలో.

చిన్నగా స్టయిల్‌గా నవ్వాడు జేమ్స్. గీతోపదేశం చేస్తున్నవాడిలా చెప్పడం మొదలుపెట్టాడు.

"పేరులో ఏముంది పెన్నిధి అని కొంతమంది కొట్టి పారేస్తారుగానీ, అసలు పేరులోనే ఉన్నదండీ తమాషా అంతా. అడుక్కునే అమ్మాయికి లక్ష్మి అనో, అన్నిరకాల అవకరాలతో పుట్టిన వాడికి మనోహర్ అనో పేరు పెడితే ఏం బావుంటుంది చెప్పండి. అందుకే మనిషికి తగ్గ పేరుండా లంటాను. అదిగో, సరిగ్గా ఆ కారణంగానే నేను మా అమ్మా, అయ్యా పెట్టిన పేరు మార్చేసి జేమ్స్‌బాండ్ అని పేరు మార్చుకున్నాను. అన్నట్టు, మీరు ప్రఖ్యాత డిటెక్టివ్ జేమ్స్‌బాండ్ పేరు వినేవుంటారు. ఆయనలాగానే నేనూ సాహసకృత్యాలు చేస్తూవుంటాను. అంచేతనే ఆ పేరు పెట్టుకున్నాను.

"ఇక, ఈయన షెర్లాక్ హోమ్స్ అనే మరో ప్రఖ్యాత డిటెక్టివ్‌లాగా మహామేధావి. అంచేత యీయన ఆ పేరు పెట్టుకున్నాడు.

"ఇకపోతే మా తండ్రుల పేర్లంటారా, చెపుతా వినండి. జేమ్స్‌బాండ్ కథలు రాసే రచయితగారి పేరు ఇయాన్ ఫ్లెమింగ్. అలాగే షెర్లాక్ హోమ్స్ పాత్రని సృష్టించిన రచయిత పేరు సర్ కానన్‌డాయల్. వీళ్ళిద్దరే మాకు, అంటే మా పేర్లుగల పాత్రలకు, జన్మనిచ్చినవాళ్ళు మా తండ్రులు."

"అబ్బో, మీరిద్దరూ అసాధ్యుల్లాగా వున్నారే!" ఆ వివరణకామె విస్తుబోయింది.

జేమ్స్ ఆమెకు పేర్ల గురించి ఉపన్యాసం ఇస్తుండగా, ఆమెను పరిశీలనగా చూశాడు హోమ్స్. ఆమె యెవరో,

ఎందుకు వచ్చిందో ఊహించడానికి ప్రయత్నించాడు. చక చకా ఓ కాగితంమీద తన ఊహల్ని నింపాడు.

"ఆమె చాలా ధనవంతురాలు. భర్త చనిపోయాడు. పిల్లలు కూడా లేరు. ఆమె నిన్నరాత్రి సరిగా నిద్రపోలేదు. ఆమెకు కొన్ని సమస్యలున్నాయి. దూరపు బంధువులంతా ఆమెచుట్టూ ఈగల్లా చేరారు. ఆస్థిలో కొంతభాగం తమకు వ్రాయమని కొందరు బంధువులు ఆమెను వేధిస్తున్నారు. లేదా కొందరు వారసులు ఆమెపై హత్యాప్రయత్నం చేస్తున్నారు."

జేమ్స్ ఉపన్యాసం చెప్పడం, హోమ్స్ కాగితంమీద వ్రాయడం ఒకేసారి పూర్తయ్యాయి. జేమ్స్ వివరణకామె విస్తుబోతున్న సమయంలో కాగితాన్ని మెల్లగా జేమ్స్‌కు అందించాడు హోమ్స్. "చూసా్క నా ప్రజ్ఞ" అన్నట్లుగా కనుబొమ్మ లెగరేశాడు.

"ఇంతకూ మీరొచ్చిన పని చెప్పారుకాదు" బిజినెస్ లోకి దిగిపోతున్నాడు జేమ్స్.

"అవునవును. నా పేరు స్వరాజ్యలక్ష్మి. మీలాగా నేను పేరు మార్చుకోలేదు. అది మా అమ్మా నాన్నలు పెట్టిన పేరే. మా వారు సుబ్బరామయ్యగారు. మీరు పేరు వినే వుండొచ్చు. ఆరునెలల క్రితం స్వర్గస్థులయ్యారు (ఆమె కంఠంలో తడి.) మాకు పిల్లలులేరు. ఆయన పోయిన రోజునుండీ నా కష్టాలన్నీ మొదలయ్యాయి. నా ఆస్థికోసం బంధువులు-వాళ్ళు బంధువులు కాదు, నా పాలిటి శత్రువులు-నా యింట్లో చేరారు. (హోమ్స్ కళ్ళలో మెరుపు, జేమ్స్ కళ్ళల్లో ఆశ్చర్యం). ఇప్పుడు నా ముఖ్యమైన శత్రువు మా మరిది వెంకట్రావు. మా వారి చిన్నమ్మ కొడుకు. వాళ్ళ అబ్బాయి రమణను పెంచుకోమని నా మీదకు ఒత్తిడి

తెస్తున్నాడు. మీరే యెలాగైనా నన్నీ కష్టం నుండి గట్టె క్కించాలి.''

"కానీ స్వరాజ్యలక్ష్మిగారూ, మేము పత్తేదారులం. ఎవరైనా నేరం చేస్తేనో, చేయబోతూంటేనో పట్టుకో గలం. మీ కేసు విషయంలో ఎటువంటి నేరస్థులూ మాకు కనిపించడంలేదు. మాబోటి ప్రఖ్యాత డిటెక్టివ్‌లు ఈ కేసు విషయంలో ఏం చేస్తారు చెప్పండి. మీరే ఎలాగో మీ కష్టా లకు జవాబు కనుక్కోవాలి''—

కేసు చెయ్యిజారిపోతుందేమోనని లోపల బెరుగ్గానే వున్నా, బింకంగా అనేశాడు జేమ్స్. హోమ్స్ కళ్ళలో పందలింపులాంటిదేదో కనిపించింది జేమ్స్‌కు.

"నేరస్థులు లేకపోవటవేమిటయ్యా? నాకిష్టం లేక పోయినా సరే, వాళ్ళ అబ్బాయిని నాకు పెంపకం ఇవ్వాలని చూస్తున్నాడు. ఇది నేరం కాదా? నే నొప్పుకోకపోతే నన్ను చంపినా చంపేస్తాడా దుర్మార్గుడు. మీకు చేతగాకపోతే చెప్పండి వేరే ఎవరిదగ్గిరికైనా వెళ్తాను'' ఆవేశం గంగ, యమున, కావేరి, తుంగభద్రలాగా పరవళ్ళు తొక్కుతోంది ఆమె గొంతులో.

"మరీ అంతగా ఆవేశపడకండి సరోజాదేవిగారూ! ఆన కట్ట కట్టడానికి మా దగ్గర డబ్బుల్లేవు. మీకేసు మేం టేకప్ చేస్తాం'' అన్నాడు హోమ్స్.

"నువ్వన్నదేమిటో నా కర్థం కాలేదు. నా పేరు సరోజా దేవి కాదు, స్వరాజ్యలక్ష్మి.''

"క్షమించండి స్వరాజ్యలక్ష్మిగారూ. పొరపాటైంది. ఇక పోతే మీరు కొన్ని వివరాలు చెప్పాలి. మీ బంధువుల పేర్లు, రూపురేఖలు, వయసు మొదలైనవి.''

వివరించింది స్వరాజ్యలక్ష్మి.

"మీరు మరో ముఖ్యమైన విషయం చెప్పాలి. మీ మరిదిగారికి కానీ, వాళ్ళ అబ్బాయికి గానీ ఏమైనా బల హీనతలున్నాయా? వాటిని ఆధారంగా చేసుకుని వాళ్ళను మీ యింటి దగ్గర నుండి తరిమేయడానికి ప్రయత్నిస్తాం" అన్నాడు హోమ్స్.

"మా మరిది వెంకట్రావుకు ఉండవలసిన చెడ్డ అలవాట్లన్నీ వున్నాయి. ఇకపోతే ఆయనకు జాతకాలంటే మహా పిచ్చి. వాళ్ళబ్బాయి రమణకు జలగండం వున్నదని అప్పుడప్పుడూ బాధపడుతూంటాడు."

హోమ్స్ మెదడులో ఓ మెరుపు మెరిసింది. ఆమె నడిగాడు "చూడండీ, వెంకటయ్యకు దయ్యాలంటే భయం ఉందా?"

"దయ్యాలంటే భయంలేని దెవడికయ్యా."

"చాల్చాలు. ఆ మాత్రం చాలు. మీకేసు సెటిలైనట్లే."

మరికొన్ని వివరాలడిగాడు హోమ్స్. ఆమెను మరుసటి రోజు తన ఆఫీసుకు రమ్మన్నాడు. ఈలోగా తనో ప్లాన్ సిద్ధంచేసి ఉంచుతానన్నాడు హోమ్స్.

ఆమె అలాగేనంటూ వెళ్ళిపోయింది. ఆమె అటు మెట్లు దిగగానే హోమ్స్ చొక్కా పుచ్చుకున్నాడు జేమ్స్. "చెప్పు. ఆ స్వరాజ్యలక్ష్మి తన వివరాలన్నీ చెప్పకముందే యెలా ఊహించావో చెప్పు" గదమాయించాడు.

హోమ్స్ తలమీద హ్యాట్ పెట్టుకుంటూ, తన పేటెంట్ స్టయిల్లో మెల్లగా నవ్వాడు. "ఎలిమెంటరీ, మైడియర్ వాట్సన్!" అన్నాడు షెర్లాక్ హోమ్స్ పదజాలాన్ని అరువు తెచ్చుకుంటూ "నువ్వో ఊహించడానికి ప్రయత్నించు. ఇట్టే తెలిసిపోతుంది" అన్నాడు.

జేమ్స్ ఓ నిమిషం హోమ్స్ అంతకుముందు తనకందిం

చిన కాగితంవంక చూశాడు. ఆ తరువాత అన్నాడు.

"ఆమె కట్టుకున్న ఖరీదైన చీర చూసి ఆమె ధనవంతు రాలని ఊహించావు. ముఖాన బొట్టు లేకపోవడం వలన భర్తలేదని గ్రహించావు. కళ్ళు కొద్దిగా ఎర్రగా ఉండటం వల్ల ఆమెకు నిన్నరాత్రి నిద్రలేదని అనుకుని వుండొచ్చు. అందుకే ఆమె కేవో సమస్య లున్నాయని ఊహించి వుంటావు. ఇంతవరకు నేనూ ఊహించగలను. కానీ కొంతమంది బంధువులు ఆమె ఆస్థికోసం వలపన్నారని ఎలా ఊహించావో చెప్పు. ఈ ప్రశ్నకు తెలిసీ సమాధానం చెప్పకపోతే నీ తల ఎన్ని వ్రక్కలవుతుందో తెలుసుగా" బెదిరించాడు జేమ్స్.

"ఉష్. మరీ అలా బెదిరించకు. ఒంటరిగా వున్న ధన వంతురాలైన ఆడదానికి ఎటువంటి సమస్యలుంటాయి, ఇటువంటివి కాక" ఇది మరీ అంద పెద్ద పాయింట్ కాద న్నట్లు తీసిపారేశాడు హోమ్స్.

"మరి, ఆమెకు పిల్లలు లేరన్న సంగతి?"

"అమ్మమ్మ. అన్నీ చెప్పేస్తే ఇక నా గొప్పేముంది. ఓపింతేనా అనిపిస్తుంది. అంచేత ఈ విషయం మాత్రం చెప్పను."

"చెప్పవా?"

"చెప్పను."

"చెప్పవు. అంతేనా."

"చెప్పనుగాక చెప్పనంతే."

మరుసటిరోజు ఉదయం స్వరాజ్యలక్ష్మి "హోమ్స్ అండ్ జేమ్స్ ఇన్‌కార్పొరేషన్" ఆఫీసుకు వచ్చింది. అప్పటికి పార్టనర్స్ యిద్దరూ ప్లాన్ సిద్ధంచేసి వుంచారు.

ఆ పథకం ప్రకారం—

2

హోమ్స్, జేమ్స్ మరుసటిరోజు ఉదయం స్వరాజ్య లక్ష్మి ఇంట్లో అడుగు(లు) పెట్టారు. ఇంట్లోకి వెళ్ళగానే స్వరాజ్యలక్ష్మి వారిద్దరినీ సాదరంగా ఆహ్వానించింది. ఇంట్లో వాళ్ళందరినీ పిలిచి పరిచయం చేసింది.

"వీరిద్దరూ మావారి స్నేహితులు. ఆయన బతికుండగా మేమిద్దరం ఓ సారి హైదరాబాదు చూడ్డానికి వెళ్ళాం. అక్కడ పరిచయమయ్యారు. వీళ్ళింట్లో మేము రెండు రోజులున్నాం అప్పుడు. ఇక్కడ మనింటికి వీళ్ళు రావడం ఇదే మొదటిసారి. ఇన్నాళ్ళూ ఇక్కడకు రమ్మని ఎన్ని ఉత్తరాలు రాసినా రానేలేదు" నిష్ఠూరం గొంతులో ధ్వనిస్తుండగా అన్నది స్వరాజ్యలక్ష్మి.

"అమ్మా. ఈవిడ గొప్ప యాక్టరేనే" అని మనసులోనే అభినందించాడు హోమ్స్.

జేమ్స్ ఆమెకు సమాధానం చెపుతున్నాడు. "ఏం జెయ్యమంటారు. ఇక్కడకు యెప్పుడు రావాలనుకున్నా కుదిరేది కాదు. చివరకు మీవారు శ్రీ సుబ్బరామయ్యగారు స్వర్గస్థులైనప్పుడు వారిని కడసారిగా చూడటానికి కూడా రాలేక పోయాము" జేమ్స్ కంఠంలో హ్యూమిడిటీ యెక్కువగా ఉంది.

"ఓరి వీడి దుంపతెగ. ఓవర్ యాక్టింగ్ చేసి పారేస్తున్నాడు. వీడుగాని కాలేజీలో చదివే రోజుల్లో నాటకాల్లో ఫస్ట్‌ప్రైజు కొట్టెయ్యలేదు కదా" బోల్డు ఆశ్చర్యపోయాడు హోమ్స్ మనసులోనే.

పరిచయాలు పూర్తయ్యాయి.

ఆ ఇంట్లో స్వరాజ్యలక్ష్మి, ఆమె మరిది వెంకట్రావు, అతని కొడుకు రమణ, ఓ వంటమనిషి, ఓ పనివాడు కాక

మరో ముగ్గురు బంధువులు కూడా వున్నారు.

స్వరాజ్యలక్ష్మి అభిప్రాయంలో మిగతా ముగ్గురు బంధువులు అంతగా ప్రమాదకరమైన వ్యక్తులు కాదు. అందినంత వరకూ తిని వెళ్ళిపోయేవాళ్ళేగానీ, ఆస్థికోసం పిల్లల్ని పెంపకానికిచ్చేవాళ్ళూ, హత్యలు చేసేవాళ్ళూ కాదు.

స్వరాజ్యలక్ష్మి చెప్పిన ప్రకారం ముగ్గురు బంధువుల వివరాలూ ఇవి: ఒకాయన పేరు పరంధామయ్య. వయస్సు 50 సంవత్సరాలు. కొన్నాళ్ళు వ్యవసాయం చేశాడు. ఇప్పుడేదో కృష్ణా రామా అనుకునే స్టేజిలో వున్నాడు.

రెండవ మనిషి పేరు శ్రీకాంత్. వయస్సు 29 సంవత్సరాలు. ప్రస్తుతం ఉద్యోగాల వేటలో వున్నానని చెపుతాడు. అసలు ప్రయత్నాలేమైనా చేస్తున్నాడో లేదో యెవరికీ తెలీదు.

మూడవ బంధువు పేరు కృష్ణారావు. వయస్సు 30 సంవత్సరాలు. భార్య ఆయన్ని వదిలి వెళ్ళిపోయింది. భార్యతోపాటే ఆస్థి కూడా పోయింది. ఏం చెయ్యాలో తెలీని స్థితిలో వున్నాడు.

3

రాత్రి భోజనాల దగ్గర అంతా కలిశారు.

హోమ్స్, జేమ్స్ పరస్పర భజన మొదలుపెట్టారు. ఇద్దరూ కలిసి మిగతా ఎవ్వరినీ మాట్లాడనియ్యడంలేదు. వెంకట్రావు కొద్దిగా విసుగుపడ్డట్లు అగుపించాడు. మిగిలిన వాళ్ళు మాత్రం, ఈ పరస్పర భజన నిజమే కాబోలునని నమ్మకంగా వింటున్నారు.

అకస్మాత్తుగా హోమ్స్ సంభాషణ మార్చాడు. "మీలో ఎవరికయినా నీటిదెయ్యాల గురించి తెలుసా?" అడిగాడు.

"కామినీ పిశాచాల గురించీ, కొరివిదెయ్యాల గురించీ విన్నాం కానీ నీటిదెయ్యాల గురించి మేం ఎప్పుడూ విన లేదు" కృష్ణారావన్నాడు. మిగతా వాళ్ళందరూ ఆసక్తిగా హోమ్స్‌వంక చూస్తోన్నారు, ఏం చెబుతాడా అని.

"మీలో ఎవరూ నీటిదెయ్యాల గురించి వినకపోవడం చాలా వింతగావుంది. అమెరికాలో సైంటిస్టులు ఈ నీటి దెయ్యాలమీద విపరీతమైన రీసెర్చ్‌చేసి ఇంతింతలావు పుస్తకాలు రాశారు" అన్నాడు హోమ్స్.

జేమ్స్ అందుకున్నాడు. "అవును. హోమ్స్ చెప్పింది అక్షరాలా నిజం. మనుషులు పడుకుని నిద్రపోతున్నపుడు ఆ నీటిదెయ్యాలు కుండలతోనో, కూజాలతోనో నీళ్ళు తెచ్చి మనుషులమీద పోస్తాయి. వెంటనే వాళ్ళకు ఎవరూ సహాయ పడకుండా, వాళ్ళు పడుకున్న గది తలుపులు బయటనుండి గడియ పెడతాయి. ఎవరి జాతకంలోనయినా జలగండం వున్నదంటే, ఈ నీటిదెయ్యాలతో చాలా ప్రమాదం. ప్రాణాలకే ముప్పు రావచ్చు."

నీటిదెయ్యాల గురించి రకరకాల కథలు వివరించి చెప్పాడు జేమ్స్. అందరూ భోజనం చెయ్యటం మాని విన సాగారు. అందరి గుండెల్లోనూ గుబులు మొదలయింది. వెంకట్రావు కూడా కొద్దిగా చలించినట్లు కనిపించింది. ఎలాగో భోజనం అయిందనిపించారంతా.

ఆ యిల్లు చాలా పెద్దది. ఆ యింట్లో ముందర ఓహాలు. ఆ హాలుకు అటూయిటూ ఒక్కోగది వున్నాయి. హాలు దాటి ముందుకు వెళితే కుడిప్రక్క మూడుగదులు, ఎడమ ప్రక్క మూడుగదులు. ఆ తరువాత వంటిల్లు.

హాల్లో కుడివేపున వున్న గదిలో జేమ్స్, హోమ్స్‌లకు పడకలు ఏర్పాటు చేశారు. ఎడమవైపు వున్న పెద్దగదిలో

స్వరాజ్యలక్ష్మి పడక. హాలుదాటిన తరువాత అటూ యిటూ వున్న ఆరు గదుల్లో బంధువులు, పనివాడు పడుకున్నారు.

4

అర్ధరాత్రి. హోమ్స్ మేలుకునే వున్నాడు. ప్రక్కకు తిరిగి చూశాడు. జేమ్స్ సుఖంగా నిద్రపోతున్నాడు.

"ఛీఛీ! పని వున్నప్పుడుకూడా ఇలా నిద్రపోతే ఎలా? ఇప్పుడు వీడిని లేపటం ఆ బ్రహ్మతరం కూడా కాదు. అందుకే అసలు నిద్రపోవద్దని హెచ్చరించినా, ఏం ఫర్వా లేదంటూ పడుకొన్నాడు. నేనే ఎలాగో పని పూర్తి చెయ్యాలి" అనుకున్నాడు హోమ్స్.

శబ్దం కాకుండా మంచం మీదనుండి క్రిందకు దిగాడు. మెల్లిగా గదిమూలకు నడిచాడు. నేలమీదనుండి సిద్ధంగా వుంచిన మంచినీళ్ళ కూజా అందుకున్నాడు. తలుపు తెరిచి హాల్లోకి వెళ్ళాడు. అడుగులో అడుగు వేసుకుంటూ హాలు దాటాడు.

తన క్లయింట్ మొదట చెప్పిన ప్రకారం వెంకట్రావు కొడుకు రమణ కుడివైపున రెండవ గదిలో వుండాలి. మెల్లిగా ఆ గదిముందుకు నడిచాడు.

మంచంమీద ఓ ఆకారం ముసుగు పెట్టుకుని పడుకుని వుంది. మనసులోనే చిన్నగా నవ్వుకున్నాడు హోమ్స్. హ్హ హ్హ హ్హ. ఈ దెబ్బతో ఈ రమణగాడు బేజారెత్తి పోతాడు. వీడికసలే నీటిగండం వుందని వీడి బాబు తెగ భయపడుతున్నాడు. ఈ దెబ్బతో ఠారెత్తిపోవాలి. యీ యింట్లో ఒక్క క్షణంకూడా ఉండడు. హ్హ హ్హ హ్హ.

చీకట్లో అటూ యిటూ ఓసారి తలతిప్పి చూశాడు. కూజా మొత్తం అమాంతంగా ఎత్తి, నీళ్ళన్నీ ముసుగు ఆకారంమీద వంచేశాడు హోమ్స్. చటుక్కున గదిలో

నుండీ బయటకు గెంతి, బయట గడియపెట్టాడు. హాల్లోకి పరిగెత్తి తన గది చేరుకొన్నాడు.

గడియ పెడుతుండగానే ముసుగు ఆకారం "అయ్యబాబోయ్" అని ఒక్కసారిగా అరవడం వినిపించింది హోమ్స్‌కు. "అమ్మోయ్, నాయనోయ్, తలుపు తెరవండర్రోయ్. ఈ యింట్లో సీటిదెయ్యాలున్నాయిరోయ్, దేవుడోయ్" గగ్గోలు పెడుతున్నాడు పరంధామయ్య.

అన్ని గదుల్లోనుండి మనుషులు హడావిడిగా బయటకు వచ్చారు. అలజడికి జేమ్స్‌కు కూడా మెలకువ వచ్చింది.

"ఏం జరిగింది?" విస్మయంగా అడిగాడు జేమ్స్.

హోమ్స్ ముసిముసిగా నవ్వాడు. "నువ్వు చేయాల్సిన పని నేను చేసేశాను" అన్నాడు.

"ఆ!" నోరు తెరిచాడు జేమ్స్. "ఏ గదిలోకి వెళ్ళావోయేమో. వెళ్ళి చూద్దాం పద."

ఇద్దరూ అప్పుడే మెలకువ వచ్చిన మనుషుల్లా హాలు దాటి లోపలి గదుల దగ్గరకు చేరుకున్నారు. అక్కడ చిందులు తొక్కుతున్నాడు పరంధామయ్య. వణికిపోతున్నాడు. మిగతావాళ్ళ ముఖంలో కూడా బెదురు కనిపిస్తోంది.

అంతకుముందే అక్కడకు చేరుకున్న స్వరాజ్యలక్ష్మి జేమ్స్‌వైపు తిరిగి, "ఇదేం పని. సీళ్ళువేసి బెదరగొట్టవలసింది పరంధామయ్యనికాదు, రమణని" అన్నట్లుగా చూపింది.

"ఛ ఛ. ఈపని నేనుకాదు చేసింది. ఈ హోమ్స్" అన్నట్లు సైగలభాషలో వర్తమానం పంపాడు జేమ్స్ స్వరాజ్యలక్ష్మికి.

సీటి దెయ్యాలగురించి అందరూ కాసేపు తర్జన భర్గ

నలు పడ్డారు. వెంకట్రావు ముఖంలో అనుమానంతో కూడిన బెదురు కనిపించింది. హోమ్స్, జేమ్స్‌ల కళ్ళలోకి గుచ్చిగుచ్చి చూడటానికి ప్రయత్నించాడు. పడనివ్వలేదు పార్టనర్స్ ఇద్దరూ.

కొంతసేపటికి ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. అందరికంటే ముందుగా హోమ్స్, జేమ్స్ బయలుదేరి తమ రూము చేరారు.

జేమ్స్ దులపడం మొదలుపెట్టాడు హోమ్స్‌ని. "యాక్షన్ కింగ్ జేమ్స్‌బాండ్‌ని నేనుండగా, తగుదునమ్మా అని బయలుదేరి నువ్వెందుకు వెళ్ళావు? భోజనాలు పూర్తయాక నేను చెయ్యి కడుక్కుంటున్న సమయంలో స్వరాజ్యలక్ష్మి నన్ను ప్రక్కకు పిలిచి, కుడివైపు మూడోగదిలోకి రమణ ప్రక్క అనుకోకుండా మార్చవలసి వచ్చిందని చెప్పింది. పని పూర్తి చెయ్యవలసిన వాడిని నేను కనక యీ మార్పు గురించి నీతో చెప్పలేదు. ఏమైతేనేం, ముందు జాగ్రత్త కోసం మనం రెండు కూజాలతో సిద్ధంగా వుండడం మంచిదే అయింది. కాస్సేపాగి నేనువెళ్ళి పని పూర్తి చేస్తాను" అన్నాడు జేమ్స్

వాదన పెంచలేదు హోమ్స్.

అరగంట గడిచింది భారంగా.

మెల్లగా పక్కమీదనుండి లేచాడు జేమ్స్. గదిమూలగా వున్న రెండవకూజా తీసుకున్నాడు. హాలు దాటాడు.

అకస్మాత్తుగా అనుమానం వచ్చింది జేమ్స్‌కి. స్వరాజ్య లక్ష్మి చెప్పింది సరిగా గుర్తుకు రావడంలేదు. రమణ గది కుడివైపునుండి మూడోదా, ఎడమవైపునుండి మూడోదా? అవును. ఎడమవైపునుండే మూడోది. నాకు బాగా గుర్తు. అని తనని తానే సవరించుకున్నాడు జేమ్స్.

మెల్లగా మొదటి రెండుగదులు దాటి, ఎడమవైపు నున్న మూడో గదిలోకి అడుగుపెట్టాడు. చీకటి. సరిగ్గా ఏమీ కనిపించడం లేదు. మంచంమీద ఓ ఆకారం వున్నట్లుగా అనిపిస్తోంది. ఈ దెబ్బతో పని పూర్తయినట్లే అనుకున్నాడు జేమ్స్.

మంచాన్ని మెల్లగా సమీపించి కూజాలోని నీళ్ళు ఒక్కసారిగా వంపేసి, కూజా మంచంమీదకే జారవిడిచి, గది బయటకు గెంతాడు. తలుపు గడియ బిగించాడు. జేమ్స్‌తో బాటే గది బయటికొచ్చిందో కేక "నాయనోయ్" అని.

జేమ్స్ హాల్లోకి ఉరికాడు. తన గదిలోకి చేరి ఆయాసపడసాగాడు. మళ్ళీ అన్ని గదుల్లో చప్పుళ్ళు, కేకలు.

కళ్ళు నులుముకుంటూ హోమ్స్, జేమ్స్ తమ గదిలో నుండి బయటకొచ్చారు. ఈసారి భరతనాట్యం చేస్తున్నది కృష్ణారావు. కళ్ళవెంట నీళ్ళొకటే తక్కువ. అందరూ ఇదివరకటి కంటే ఎక్కువగా వణికిపోతున్నారు. ఈసారి మళ్ళీ గదుల్లోకి వెళ్ళి పడుకుంటే, ఎవరి వంతో?

స్వరాజ్యలక్ష్మి హోమ్స్, జేమ్స్‌లవంక క్రీగంట చూస్తూ గొణుక్కుంటోంది. రానున్న రెండేళ్ళలో భారతదేశంలో నిరుద్యోగ సమస్య పూర్తిగా నిర్మూలించబడుతుందన్న విషయంలో ప్రజలకు ఎంత నమ్మకముందో, ప్రస్తుతం హోమ్స్, జేమ్స్‌ల శక్తి సామర్థ్యాలమీద అంతే నమ్మకముందామెకు. ఈ పత్తేదారు లిద్దరిమీదా తను ఆధారపడవలసి వచ్చినందుకు ఆమె విధిని దూషించుకొంటోంది మనసులోనే.

సీటి దెయ్యాలు మొత్తానికి మంచి సంచలనమే కలిగించాయి. బంధువులంతా విడివిడిగా గదుల్లో పడుకోవడానికి

నిరాకరించారు. అందరూ హాల్లోకి వచ్చి పడుకున్నారు.

కానీ ఎవరికీ నిద్రపట్టిన సూచనలేదు. అట్నుంచి ఇటూ ఇట్నుంచి అటూ పొర్లుతున్నారు. నిద్రపోతున్నట్లు నటించ డానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

చివరకు తెల్లవారింది. నాటకం ముగిసింది.

* * *

ఆరోజు ప్రొద్దున్నే ఏదో పని వుందని పార్టనర్స్ ఇద్దరూ బయటకు వెళ్ళిపోయారు. తమ పథకం ఫెయిలయినందు వల్ల స్వరాజ్యలక్ష్మికి ముఖం చూపించలేక ఏదో వంక పెట్టి బయటకు వెళ్ళిపోయారు.

సాయంత్రం తిరిగి వచ్చారు, కొత్త ప్లాన్‌తో. కానీ....

ఇల్లంతా నిశ్శబ్దం. స్వరాజ్యలక్ష్మి ఒక్కతే వున్నదింట్లో. ఆమె బంధువులుగానీ, వారి సామాన్లుగానీ ఆ యింట్లో ఎక్కడా వున్నజాడ లేదు.

"మీకెంతో ఋణపడి వున్నాను" సాదరంగా పార్ట్‌నర్స్ ఇద్దరినీ ఆహ్వానించింది స్వరాజ్యలక్ష్మి. ఓ తెల్ల కవరు హోమ్స్ చేతికి అందించింది, "మీ ఫీజు" అంటూ. □

తలక్రిందులైన నగరం ?

"మీకు తెలుసా? ఓసారి గొప్ప తుఫాను వచ్చింది. ఆ తుఫానుకు మొత్తం పట్నమే ఉల్టా ఐపోలుంది!"

"ఇది అబద్ధం! అలా కావడానికి వేల్లేదు."

"నిజం. నిజం. తుఫాను వచ్చినపుడు వాడు త్రాగడం వల్ల వాడు తలక్రిందులయాడు" అన్నాడు మూడోవాడు.

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

వాళ్ళు ముగ్గురు.....

జొన్నలగడ్డ రామలక్ష్మి



సినిమా చూస్తోంది శిరీష.

సినిమా చాలా ఆసక్తికరంగా వుంది. హీరోయిన్‌కి హీరోమీద అనుమానం వచ్చి రహస్యంగా అతడి గదిలో ప్రవేశించింది. గదిలో ఎవ్వరూ లేరు. ఆమె అడుగులో

అడుగు వేసుకుంటూ నెమ్మదిగా నడుస్తోంది. ఉన్నట్లుండి వెనుకనుంచి యెవరిదో చెయ్యి భుజంమీద పడింది. హీరోయిన్ ఉలిక్కిపడింది.

శిరీష నిజంగానే ఉలిక్కిపడింది. తన భుజంమీద యెవరిదో చేయిపడింది. ఆమె పక్కకు తిరిగింది. పక్కన యెవరో యువకుడున్నాడు. అత నామె భుజంమీద చేయి అలాగేవుంచి తన్మయత్వంతో సినిమా చూస్తున్నాడు.

శిరీషకు సినిమా ఎక్కలేదు. ఆమె విసురుగా అతడి చేయి విసిరికొట్టింది. అతను చటుక్కున ఆమెవైపు వంగి "ఏయ్ రాధా—ఏమిటిది?" అన్నాడు.

"నాపేరు రాధకాదు. శిరీష" అందామె.

"అరే! మరి రాధ ఏమయింది?"

"ఏమో, నాకు తెలియదు...."

"ప్లీజ్ - ఒక్కసారి బయటకు వస్తారా?"

"ఎవరు మీరు? యూస్‌లెస్ బగ్గర్!" జోరుగా అంది శిరీష.

"ఇష్!" వెనుకనుంచి ఎవరో విసుక్కున్నారు.

అతను ఓ జేబురుమాల్ని చటుక్కున ఆమె ముక్కుకు గట్టిగా అదిమాడు. ఏం జరిగిందో తెలిసేలోగానే శిరీషకు స్పృహ తప్పింది. ఆమె కుర్చీలో తల పక్కకు వాల్చేసింది. అతను లేచాడు. ఆమెను కుర్చీలోంచి లేపి నిలబెట్టి, ఎలాగో హాలు బయటకు వచ్చాడు. అక్కడ థియేటరు కాపలావాడితో "ఈమె నా మరదలు. ఉన్నట్లుండి కళ్ళు తిరిగి పడిపోయింది. టాక్సీని పిలుస్తావా?" అని అడిగాడు.

వాడు పరుగున వెళ్ళి టాక్సీని పిలుచుకుని వచ్చాడు.

అతను టాక్సీలో శిరీషను ఎక్కించి తనూ యెక్కి—

"లతాసదనం" అన్నాడు. టాక్సీ లతాసదనం చేరుకొనే సరికి పదినిమిషాలు పట్టింది. టాక్సీ దిగి అతను యింటి తలుపు తాళం తనే తీశాడు. టాక్సీవాడికి డబ్బిచ్చి శిరీషను ఇంట్లోకి తీసుకొనిపోయాడు. టాక్సీవాడు వెళ్ళిపోతూ, "డాక్టరుగారి కెవరికయినా చెప్పాలాండీ?" అన్నాడు.

"అక్కరలేదు నువ్వెళ్ళు" అన్నాడతను. వాడు వెళ్ళిపోయాడు.

అతను లోపలకు వెళ్ళి తలుపులు వేసి శిరీషను పడుకోబెట్టిన చోటుకి వెళ్ళాడు. ఆమెకు శీతలోపచారాలు చేశాడు. కొద్దిసేపట్లో ఆమెకు స్పృహవచ్చి కళ్ళువిప్పి, "నేనెక్కడున్నాను?" అనడిగింది.

"ఇది సినిమాహాలు మాత్రంకాదు" అన్నాడతను.

అప్పటి కామె మెదడు పనిచేయడం మొదలు పెట్టింది. అతడివంక కంగారుగా చూసి "ఎవర్నువ్వు?" అంది.

"నాపేరు కుమార్!" అన్నాడతను.

"ఎవర్నువ్వు?" అందామె మళ్ళీ.

"సినిమా హాలునించి నిన్నెత్తుకొచ్చాను" అన్నాడతను.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? నువ్వు అందంగా వున్నావు. వయసులో వున్నావు. నిన్నెందుకు తీసుకొస్తాను?"

"అందుకా?" అందామె అప్రయత్నంగా.

"అందుకే!" అన్నాడతను.

"ప్లీజ్ నన్నొదిలిపెట్టు" అందామె.

"వదులుతాను. రేపుదయం" అన్నాడతను.

ఆమె భయంగా అతడివంక చూసింది. అతడు తనున్న చోటునించి లేచి బట్టలు మార్చుకుంటున్నాడు.

"ప్లీజ్! నన్నొదిలిపెట్టు" అందామె మళ్ళీ.

"వెళ్ళి స్నానం చేసిరా!" అన్నాడతను ఆజ్ఞాపిస్తున్నట్లు.

"ప్లీజ్! నన్ను వదిలిపెట్టు" ఆమె మళ్ళీ అంది.

"చెప్పినమాట వినకపోతే కత్తి తీయాల్సొంటుంది" అంటూనే అతడామెకు కత్తిని చూపించాడు.

"స్నానాలగది ఎక్కడ?" అందామె.

గది నానుకునే వుంది స్నానాలగది. ఆమె గదిలోకి గడియ పెట్టుకుని తేలికగా నిట్టూర్చింది.

బయట్నించి అతను అరిచాడు. "నీకోసం వేరే బట్ట లుంచాను. స్నానంచేసి బట్టలు మార్చుకోవా?"

ఆమె బదులివ్వలేదు. స్నానాల గదిలోంచి యెలా తప్పించుకోవడమా అని చూస్తోంది. వెంటిలేటరు వుంది కానీ చాలా ఎత్తులో వుంది. అక్కడికి వెళ్ళడానికి వేరే సాధనమూలేదు. ఇప్పుడేం చేయాలి?

పది నిముషాల తర్వాత అతను బయటనుంచి అరిచాడు "ఇంకా ఎంతసేపు స్నానం?" అంటూ.

ఆమె మాట్లాడలేదు. ఇక్కడ తనకు తాత్కాలికంగా నయినా రక్షణ లభించగలదని ఆమె ఆశ.

అయితే ఆమె చూస్తూండగా స్నానాలగది గడియ విడి పోయి తలుపు తెరుచుకుంది. అతనామెవంక కోపంగా చూసి, "నువ్వింకా స్నానం ప్రారంభించనే లేదు— ఆయుధం ప్రయోగించాలా?" అన్నాడు.

"తలుపెలా తీశావు?" అందామె ఆశ్చర్యంగా.

"ఎలాగయినా తీయగలను. లోపల గడియవేసినా వేయకపోయినా బయటనుంచి తలుపు తీయవచ్చు. లేక పోతే నిన్నెలా లోపలకు పంపాననుకున్నావు?"

ఆమె అసహాయంగా అతడివంక చూసింది.

అతనొక లుంగీ, బుష్షర్టు అక్కడపెట్టి, "స్నానం

చేసి ఇవి కట్టుకుని రా. పదినిముషాలకంటె పట్టకూడదు. వళ్ళు ఘుమఘుమ లాడిపోవాలి. ఏమాత్రం తేడావచ్చినా నే నూరుకోను" అన్నాడు.

"ఏం చేస్తావ్—చంపేస్తావా?" నిర్లక్ష్యంగా అడిగింది శిరీష.

"లేదు. దగ్గరుండి స్నానం చేయిస్తాను."

శిరీష తలుపు వేసుకుంది. అక్కడున్న ఖరీదైన సబ్బు ఉపయోగించుకుని స్నానం చేసింది. అతనక్కడ పెట్టిన లుంగీపంచ, షర్టు వేసుకుంది. తలుపు తీసుకుని గదిలోకి వచ్చింది. ఇవన్నీ తొందరగా చేయకపోతే మధ్యలో అతను వచ్చేస్తాడేమోనని ఆమె భయం.

ఆమె గదిలోకి రాగానే అతనామెను చూశాడు. భుజం దగ్గరకు వంగి—"గుడ్ - ఘుమఘుమలాడి పోతున్నావు. కాదూ ఇది చాలదు. వెళ్ళి పౌడరు, సెంటూ రాసుకురా" అంటూ డ్రెస్సింగ్ టేబుల్ చూపించాడు.

శిరీషకు తప్పదని తెలిసిపోయింది. ఆమె అతడు చెప్పి నట్లే చేసింది.

"వెరీగుడ్!" అని మెచ్చుకున్నాడతను.

ఆమెను మంచంమీద కూర్చోమన్నాడు. తను ఎదురుగా కుర్చీలో కూర్చుని "ఇలా నువ్వెంత బాగున్నావు?" అన్నాడు.

శిరీష ముడుచుకుపోయింది.

"అలా సిగ్గుపడకు — మనం కాసేపు మాట్లాడు కోవాలి...."

"ఎంతసేపు?" అందామె.

"అతను వచ్చేదాకా?" అన్నాడు కుమార్.

"అతనెవరు?"

"మేము ఇద్దరం" అన్నాడుకుమార్.

శిరీష మళ్ళీ భమపడింది. మానసికంగా ఆమె కొంతకు సిద్ధపడ్డట్లేవుంది. అప్రయత్నంగా "ఇద్దరా?" అంది.

కుమార్ నవ్వి "ఒక్కరైతే ఫరవాలేదనుకున్నావా?" అన్నాడు.

ఏం జవాబివ్వాలో తెలియ లేదామెకు. తనే మనుకుం టోందో కూడా ఆలోచించ దల్చుకోలేదామె. ఆలోచించా లంటేనే ఎబ్బెట్టుగా వుంది.

"ఎవర్నువ్వు? నన్నెందుకు బాధించా లనుకుంటు న్నావు?"

"నాపగ నీమీద కాదు. నీ తండ్రిమీద!" అన్నాడు కుమార్.

"నా తండ్రిమీదా?"

"అవును-" అని ఆగాడతను -"నీ తండ్రికి డబ్బుంది. ఆ డబ్బుతో తన భార్యని సుఖపెట్టుకుంటే నాకు బాధలేదు. తన పిల్లల్ని సుఖపెడితే నాకు బాధలేదు. కానీ ఆయన సుఖాన్ని ఎదుటివాళ్ళ దగ్గర వెతుక్కుంటున్నాడు. అదీ నా బాధ!"

."అందులో తప్పేముంది?" అమాయకంగా అడిగింది శిరీష.

"నేను నా సుఖాన్ని నీ దగ్గర వెతుక్కుంటున్నాను. తప్పులేదు కదూ?"

"అంటే?" అని ఆగిందామె. తన తండ్రి ఇలా ప్రవ ర్తిస్తున్నాడంటే ఆమెకు ఏదోలాగుంది.

"నేకున్న స్థానంలో తనుండి—నువ్వున్న స్థానంలోకి చాలామందిని పంపాడు నీ తండ్రి మాణిక్యాలరావు" అన్నాడు కుమార్.

మాణిక్యాలరావు. అదే తన తండ్రిపేరు....అంటే అతను పొరబడలేదు. సరిగ్గానే చెప్పాడనుకోవాలి!

"నీకేదైనా అన్యాయం జరిగిందా?" అందామె.

"చాలా పెద్ద అన్యాయమే జరిగింది" అన్నాడు కుమార్ "నా చెల్లెలు నీకంటే ఏడాది చిన్నది. ఆమెను నీ తండ్రి ఇలాగే రప్పించుకున్నాడు."

"నేను నమ్మను" అరిచింది శిరీష.

"నీ నమ్మకంతో నాకు పనిలేదు" అన్నాడు కుమార్.

శిరీష క్షణం ఆలోచించి "తండ్రి చేసిన తప్పుకు కూతుర్ని శిక్షిస్తావా? నీకు జరిగిన అన్యాయానికి నేనేం చేయగలనో చెప్పు...." అంది.

"నాతో కాసేపు మధురక్షణాలు పంచుకోవడమే" అన్నాడు కుమార్.

శిరీష కుమార్‌వంక చూసింది. మనిషి సినిమా హీరోలా వున్నాడు. చూడగానే మంచివాడనిపిస్తుంది. అలాంటి వాడిలాంటి వాడని నమ్మడం కష్టం—అనుభవం అయితే తప్ప....

"వేరే దారి లేదా నాకు?" అంది శిరీష.

కుమార్ టైం చూసుకుని "అతను రావడానికింకా గంటన్నర టైముంది...." అని "ఈలోగా మనం కాసేపు కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు.

ఆమె భయంగా, బెంగగా అతడివంక చూసింది.

"నా చెల్లెలు నీ తండ్రి చేతిలో పడిందని తెలియగానే పరుగు పరుగున వెళ్ళాను. అప్పటికది గదిలో వుంది. నా కేకలు విని ఆయన బయటకువచ్చాడు. ఎందుకలా అరుస్తావని తిట్టాడు. నా చెల్లెలు డబ్బుకోసం తన దగ్గరకు వచ్చిందని చెప్పాడు. సాక్ష్యం కావాలంటే ఓ గంటపోయాక

రమ్మన్నాడు. ఆమె వంటిమీద ప్రతిఘటించిన లక్షణా లుండవుట. నేనింకా అరుస్తూంటే నన్నక్కణ్ణించి గెంటించి వేశాడు. తర్వాత నా చెల్లెలు ఇల్లు చేరింది. ఏం జరిగిందో నాకు చెప్పకుంది'' ఆగాడు కుమార్.

"ఏం జరిగింది?'' కుతూహలంగా అడిగింది శిరీష.

"నా చెల్లెకి తల్లిలేదు. అందువల్ల అది నాకు చెప్పు కుంది. ఏం జరిగిందో నువ్వు యింటికి వెళ్ళి నీ తల్లికి చెప్పుకుంటువుగాని....''

శిరీష ఇంకేమీ అడగలేదు. తను బైటపడడం ఆమెకు యిష్టంలేదు. "పూర్ కుమార్!'' అనుకుందామె మన సులో "నువు నాకు నచ్చావు. నువ్వు నన్ను తెచ్చిన పద్ధతి కూడా నాకు నచ్చింది. నన్ను బాధపెడుతున్నానని నువ్వను కుంటున్నావు. కానీ నాకిదొక థ్రిల్ అని నీకు తెలియదు'' అనుకుంటూనే తన భావాలు ముఖంలోకి కనబడకుండా జాగ్రత్తపడిందామె.

శిరీష అనాఘ్రాత పుష్పం కాదు. విచ్చలవిడిగా తిర గడం ఆమెకు అలవాటే! శీలం ప్రాముఖ్యతనామె నటి స్తుంది తప్పితే ఫీలవదు. పెళ్ళి గురించి కూడా ఆమెకు బెంగలేదు. డబ్బుతో తండ్రి వరుణ్ణి కొనగలడని ఆమెకు తెలుసును.

కుమార్ లేని "అతను రావడానికింకా గంట టయి ముంది'' అని "ఈ గంటా మనది!'' అన్నాడు.

"అతను....అతను....అని నన్ను భయపెట్టవద్దు-ప్లీజ్!'' అందామె సన్నగా వణుకుతున్న కంఠంతో.

"నీ భయం నాకు సరదా'' అతను అదొకలా నవ్వేడు. అ నవ్వు శిరీషకు నచ్చింది. కానీ పైకి చెప్పలేదు.

అతడామెను సమీపించాడు. ఆమె అభ్యంతరాన్ని నటిం

చింది.

అతడామెను హింపిస్తున్నాననుకుంటున్నాడు. ఆమె సంతోషిస్తోంది.

2

శిరీష ఏడుపు నటిస్తూ "నన్నన్యాయం చేశావు. పెళ్ళి చేసుకో" అంది. కప్పుకున్న చేతివ్రేళ్ళ సందుల నుండి ఆమె అతడి ముఖాన్ని చూస్తోంది.

సరిగ్గా అప్పుడే కాలింగ్ బెల్ మ్రోగింది "అతను వచ్చాడు" అంటూ లేచాడు కుమార్.

శిరీష గుండె దడదడలాడింది. అతను నిజంగా వస్తాడా?

"ప్లీజ్—అతన్ని పంపేయ్."

కుమార్ క్రూరంగా నవ్వి "నిన్ను శారీరకంగా, మానసికంగా హింసించడమే నా ఆనందం" అన్నాడు.

కుమార్ తలుపు తీశాడు. అతను వచ్చాడు.

శిరీష అతడి వంక ఆశ్చర్యంగా చూసింది.

"ఇదీ నీకాబోయే భార్య అసలు స్వరూపం. బరితెగించిన ఆడది. ఆమెలో ఎక్కడా ప్రతిఘటించిన లక్షణాలు లేవు. కావాలంటే పరీక్షించుకో."

"అక్కర్లేదు. ఆమె అసలు స్వరూపం తెలిసింది. ఇంక నేనీమెను శాశ్వతంగా నా దాన్ని చేసుకోలేను. తాత్కాలికంగా ఈ పూటకు నాదాన్ని చేసుకుని తర్వాత నా హృదయం లోంచీ శాశ్వతంగా చెరిపేస్తాను...."

"కుమార్ ఎంతపని చేశాడు?" అనుకుందామె. ఇతడిపైన తన తండ్రి ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. ఇంటల్లుడిగా చేసుకుని అన్ని బాధ్యతలూ అప్పగించాలనుకుంటున్నాడు. ఇంటి ఆయువుపట్టు మీద దెబ్బతీశాడు.

అతను ఆమెను సమీపించాడు.

"రమేష్—ప్లీజ్ నా జోలికిరాకు" అంది శిరీష.

"నన్ను నువ్వు ఆపలేవు" అన్నాడు రమేష్.

"ఇది హత్యకన్నా ఘోరం రమేష్!" అందామె.

"నీ విషయంలో నేను హంతకుడికన్నా ఘోరమయిన వాడిననుకో!"

"ప్లీజ్ రమేష్!" అందామె.

రమేష్ అక్కడ బీరువా తెరిచి ఓ లుంగీపంచ, షర్టు తీసి ఆమె చేతికిచ్చి—"వెళ్ళి స్నానం చేసి—ఇవి కట్టుకుని రా!" అన్నాడు.

కాసేపు అవీ యివీ చెప్పినా ఆమెకు తప్పలేదు.

స్నానాల గదిలోకి వెళ్ళింది.

బయటనుంచి కుమార్, రమేష్‌ల మాట లామెకు వినిపిస్తున్నాయి. కుమార్ అంటున్నాడు. "ఆమె నిజంగా భయపడుతున్నట్లుంది. ప్రమాదముండదు గదా!"

"ప్రమాద మెందుకుంటుంది? వేశ్య ఒకరాత్రిలో ఒకోసారి పదిమంది మగాళ్ళను భరిస్తుంది...." అన్నాడు రమేష్.

తన కిక్కడనుంచి మోక్షంలేదని గ్రహించింది శిరీష. ఆమె స్నానంచేస్తూ మానసికంగా ఉల్లాసంగా వుండడానికి ప్రయత్నించింది. స్నానం కాగానే రమేష్ ఇచ్చిన బట్టలు వేసుకుంది.

గిది తలుపులు తీసింది. జరుగబోయేది తల్చుకుంటుంటే ఆమె శరీరం వణుకుతోంది.

"గుడ్! వెళ్ళి పౌడరు, సెంటు రాసుకుని రా—" అన్నాడు రమేష్ ఆమెవంక కాంక్ష నిండిన చూపులు ప్రసరిస్తూ.

శిరీష ఏమీ మాట్లాడలేదు. గదిలో కుమార్ లేడు.

ఇదే అనుభవం కుమార్ చెల్లెలికి జరిగిందా? జరిగితే అంత కంటే ఘోరం వుండదు. అయితే ఒక ఆడదానికి జరిగిన అన్యాయం తీర్చుకునే మార్గం ఇదేనా? మరో ఆడదానికి అన్యాయం చేయడమే తప్ప పురుషుడికి మరో విధంగా బుద్ధిరాదా?

ఇది పురుష ప్రపంచం....తానీ అన్యాయాన్ని సహించక తప్పదు....

శిరీష భగవంతుణ్ణి ప్రార్థించుకుంది. తన ప్రాణాలు రక్షించమంది.

ఆమె పౌడరు రాసుకుంది. సెంటు జల్లుకుంది. రమేష్ బాహువుల్లో ఇమిడిపోయింది. రమేష్ అంటే ఆమెకిప్పుడు నరనరాలా ద్వేషం....

కానీ తప్పలేదు....

నిస్సత్తువగా మంచంమీద పడివుంది శిరీష. ఆమెవంటి మీద బట్టలు సరిగ్గాలేవు. సర్దుకునే ఓపికకూడా లేదు.

"రమేష్ వెళ్ళిపోయాడు" అది కుమార్ కంఠం.

"ఊఁ" నీరసంగా మూలిగిందామె. ఆమె తల గోడ పక్కకు తిరిగివుంది. ఇటు తిప్పే ఓపిక కూడా వున్నట్లు లేదు.

"అలా నీరసపడిపోతే ఎలా?" అన్నాడు కుమార్ వెటకారంగా—"ఇప్పుడే తెలిసింది. ఇంకా మూడో మనిషి వున్నాడని!"

శిరీష గుండె ఆగిపోయినట్లయింది.

"నేను చచ్చిపోతాను" అని ఆమె అరవాలనుకుంది. అయితే పెదవిదాటి మాట బయటకు రాలేదు.

"అయిదు నిమిషాలే టయిం...." అన్నాడు కుమార్ "అవసరమయితే నువ్వు మళ్ళీ స్నానంచేయాలి. మనసు

నుల్లాస పరుచుకో—"

అతణ్ణి వేడుకుని ప్రయోజన ముండదని ఆమెకు తెలుసు. వేశ్య ఒక్కరాత్రికి పదిమందిని భరిస్తుందని తెలుసు. అదెలా సాధ్యమో? అందులో ఇంత బాధ ఉన్నదా?

ఆమెలో ఓపిక కలగలేదు.

అయిదు నిముషాలు గడిచినట్లున్నాయి. ఎవరో గదిలో ప్రవేశించారు. అడుగుల చప్పుడు ఆమెను సమీపించింది.

"ఇటు తిరుగు....నిన్నేమీ చేయను. ఇలా నిస్త్రాణగా వున్న ఆడదాన్ని వళ్ళంతా తడిమి ఆనందించడం నాకు సరదా—ఈ మనుషుల్ని నేనే నియమించాను....ఒక్కసారి ఇటు తిరిగు."

ఆమెకు మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. కానీ కదిలే ఓపిక కూడా లేదు. అతడి చేతులు తన వంటిమీద అస్తవ్యస్తంగా వున్న బట్టల్ని మరింత అస్తవ్యస్తంగా చేశాయి. ఆ తర్వాత....అతడి చేతులు ఆమెను తనవైపు తిప్పుకున్నాయి.

తెరిచీ....తెరవని........కన్నులతో ఆమె అతికష్టం మీద అతణ్ణి చూసింది. అంతే—ఆ కన్నులు పెద్దవయ్యాయి.

"అమ్మా—శిరీషా!" అన్నాడు మాణిక్యాలరావు.

"సార్!" అంది వెనుకనుంచి కుమార్ కంఠం-"పరీక్షగా చూడండి. ఆమెవంటిమీద ప్రతిఘటించిన లక్షణాలు కనబడవు. పైగా మనిషి ఘుమఘుమ లాడిపోతోంది కూడా!"

"కుమార్—దుర్మార్గుడా—ఎంత పనిచేశావు?"

"సార్! ఎప్పుడూ మీవల్ల ఇదేపని జరుగుతోంది. ఇంతకాలం మీరు ఆ యువతుల ముఖాలను పరిశీలనగా

చూడలేదు. చూస్తే వాళ్ళలోనూ మీకు కూతురు కనబడి వుండేది" అన్నాడు కుమార్.

మాణిక్యాలరావు కుమార్‌ను దుమ్మెత్తి పోస్తున్నాడు. కుమార్ అవేమీ పట్టించుకోకుండా శిరీషవంక తిరిగి—

"మిస్ శిరీషా! నీ తండ్రి లతాసదనంలో యేం చేస్తాడో తెలుసుకున్నావు గదా—ఈయన నా చెల్లిని వేశ్యావాటికకు అమ్మేశాడు. ఆయన్నడిగి ఆమెను నాకు తిరిగి యిప్పించు. ఎక్కడుందో కూడా నాకు తెలియదు. ఆడదానిగా వేశ్య పడే బాధను అర్థం చేసుకునే వుంటావు. నాకీ సాయంచేయి" అన్నాడు.

శిరీష నీరసంగా మూలిగి, కళ్ళుతిరిగి పక్కమీద అచేతనంగా పడిపోయింది. □

అప్పివ్వాలి-?

రంకు : నాన్నా! నాకు కొంత డబ్బు కావాలి.

తండ్రి : ఎందుకు?

రంకు : అప్పులివ్వడానికి!!

తండ్రి : ఏమిటీ, అప్పులిస్తావా?

రంకు : అవును నాన్నా! మా మాష్టారు అప్పిచ్చువాడు వైద్యుడు అని చెప్పారు....మరి నేను డాక్టరును కావాలనుకుంటున్నాను.

—వాయిల పార్వతీదేవి, పార్వతీపురం.

గిరిజశ్రీ భగవాన్

మృత్యుద్వారం సీరియల్

(గత సంచిక తరువాయి)

6

"రండి. ఇలా కూర్చుని రిలాక్స్ అవండి మిస్టర్ నర్సన్। నే చెప్పేది శ్రద్ధగా, జాగ్రత్తగా వినండి. దాదాపు

1982వ సంవత్సరం నించీ మీరు ఒంటరిగా, ఏకాకిగా యీ లెనిన్‌గ్రాడ్ నగరంలో జీవిస్తున్నారని ఆధారాలతో నిరూపించగలను. రెండేళ్ళనించీ కోమాలో జీవచ్ఛవంలా పడున్నారని ఎన్నో రుజువులూ, సాక్ష్యాలూ చూపించగలను. అంతెందుకు? మూరెడు బారున చిక్కిరి బిక్కిరిగా పెరిగిన మీ గెడ్డమూ, మీసాలూ నా వాదానికి తిరుగులేని ప్రత్యక్ష సాక్ష్యాలు.

మీకు, రెండేళ్ళ కోమాస్టేజి తర్వాత యీ 1994 లో తిరిగి యధాస్థితి కలుగుతుందని మీ మానసిక, మస్తిష్క పరిస్థితి అప్పట్నించీ యధాప్రకారం పనిచేస్తుందనీ మాకు ముందే తెలుసు! అందుకే యీ శుభతరుణం కోసం రెండేళ్ళనించీ ఎదురుచూస్తూ మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాం.

మామూలు స్థితికి వచ్చిన తర్వాత మీ మేధ ఏవిధంగా పనిచేస్తోందో నిశ్చయించుకోడానికి నిన్ననే మీకు సంకెళ్ళు వేశాం. యీ పూట మీకు తెలివి రాగానే ఆ సంకెళ్ల రెండేళ్ళ క్రితం వెయ్యబడినవి కావని మీరు గ్రహించడం వల్ల మీరు యధాస్థితి పొందారని, అనూహ్యమైన నరక బాధనించి విముక్తులయ్యారని నిర్ధారణ చేసుకోగలుగుతున్నాం."

"రెండేళ్ళ తర్వాత నేను కోమానించి బయటపడి యధాస్థితి పొందుతానని మీకు ముందే ఎలా తెల్సు? అసలు మీరెవరు?" వెండిలా మెరిసిపోతున్న పొడుగాటి గెడ్డాన్ని అరచేత్తో దువ్వుకుంటూ అనుమానంగా ప్రశ్నించాడు నరసన్.

"చెబుతాను. నేను డాక్టర్ మైకా! మన తత్వ శాస్త్రంలో

నోబెల్ బహుమతి గ్రహీతని! సరిగ్గా రెండేళ్ళక్రితం 1992 ఏప్రిల్ 27వ తేది సోమవారం పొద్దుట, మీ స్నేహితుడు, మాజీ ఇండియన్ స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ రావ్, కోమా స్టేజిలో స్పృహలేని స్థితిలో వున్న మిమ్మల్ని యిక్కడికి తీసుకొచ్చి ఎడ్మిట్ చేశాడు. ప్రొఫెసర్ డోగ్రే అనే అతను శత్రువులెవరో యిచ్చిన డబ్బుకి ఆశపడి మీకు యావజ్జీవితం మతిపోయేలా ఏదో ఇంజెక్షన్ యిచ్చాడట! అది జరిగిన కొద్దిసేపటికే రావ్ ఆ సంగతి తెల్సుకుని ఆగ్రహం పట్టలేక డోగ్రేని చిత్రవధ చేసి చంపేశాడు. ప్రాణం పోయేముందు ఆ డోగ్రే చెప్పాడట—సరిగ్గా రెండు సంవత్సరాల తర్వాత మీకు యధాస్థితి సంక్రమిస్తుందని!

యీలోగా, హత్యానేరానికిగాను లెనిన్‌గ్రాడ్ పోలీసులు రావ్ వెంట పడ్డారు. దిక్కుతోచని స్థితిలో అతను మిమ్మల్నిక్కడ అడ్మిట్ చేసి హత్యానేరాన్నించి తప్పించుకోడానికి అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోయాడు. నావల్ల మీకు యే హానీ జరక్కుండా నిరోధించడానికని అతను నా భార్యాబిడ్డల్ని ఎత్తుకుపోయి ఎక్కడో దాచిపెట్టాడు. యీ రెండేళ్ళనించీ నావాళ్ళు అతని చెరలోనే వున్నారు. వాళ్ళు ఎక్కడున్నారో, అసలు ప్రాణాలతో వున్నారో లేదో తెలియదు" అని డాక్టర్ మైకా నిట్టూర్చి—

"ఆరు నెలల క్రితం ఫోన్లో ఆఖరిసారిగా నా భార్యా పిల్లల్తో మాట్లాడాను. పోలీసులు రెండేళ్ళనించీ రావ్ జాడలు తెల్సుకోడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఎప్పటికైనా అతను మిమ్మల్ని చూడటానికి వస్తాడనీ. అప్పుడు అతన్ని పట్టుకోవచ్చుననీ కోమాలోవున్న మీ బెడ్ దగ్గిర పోలీసు కాపలా ఏర్పాటు చేశారు. అందుకే కాబోలు ప్రతిసారీ ఏదో మారుమూలనించి రావ్ ఫోన్‌చేసి మీ

ఆరోగ్యపు వివరాలు అడిగి తెల్సుకునేవాడు. పోలీసులు ఆ స్పాట్‌కి చేరుకునే లోగానే అదృశ్యమైపోయేవాడు.

డో[గ్రే లెక్క ప్రకారం యీ రోజు మీకు యధాపూర్వ స్థితి లభిస్తుందని అందరికీ తెల్సు! కనుక, యీ శుభతరుణంలో ఆరాటం అణచుకోలేక మిమ్మల్ని చూట్టానికి రావ్ తప్పకుండా యిక్కడికి వచ్చి తీర్తాడని పోలీసులు విశ్వశిస్తున్నారు. అందుకే ఘటికుడని పేరుగాంచిన ఇనస్‌స్పెక్టర్ బాండ్ ఆధ్వర్యంలో పటిష్టమైన కాపలా ఏర్పాటుచేశారు. రావ్ యిక్కడికి రావడం అనివార్యమైతే అతను తప్పనిసరిగా పోలీసులకి దొరికిపోతాడు. అతను ప్రాణాలకి తెగించి మిమ్మల్ని చూడ్డానికి వస్తాడనే నమ్మకంతో ఇన్‌స్పెక్టర్ బాండ్ యిక్కడ కాచుకుని వున్నాడు. కానీ.... రావ్ ఏ స్థితిలోనూ యిక్కడికి రాడు!" అన్నాడు డాక్టర్ మైకా.

"ఏం? ఎందుకని? భయంవల్లనా?"

డాక్టర్ మైకా తల అడ్డంగా తిప్పి "ప్రొఫెసర్ డో[గ్రే హత్య జరిగి రెండేళ్ళు దాటిపోయినా మిమ్మల్ని నా హాస్పిటల్లో అడ్మిట్ చేసినట్లు పోలీసులకి షుమారు పదినెలల క్రితమే తెల్సింది. అప్పట్నుంచే వాళ్ళు రావ్‌ని పట్టుకోడానికి యిక్కడ నిఘా ఏర్పాటు చేశారు. ఎప్పుడైనా మగతలో మీరు కలవరిస్తే ఆ మాటల్లో అతని జాడలు తెలిపే ఆధారాలేవైనా లభిస్తాయేమోనని చర్చలతో తలలు బద్దలు కొట్టుకునేవారు. అయితే వాళ్ళ అంచనాలు తారుమారయ్యాయి.

చివరికి ఓసారి రావ్ నాకు ఫోన్‌చేసినప్పుడు మీకు చాలా సీరియస్‌గా వుందని నాచేత అబద్ధం చెప్పించారు. వెంటనే మిమ్మల్ని చూడ్డానికి రావ్ పరిగెత్తుకొచ్చాడు.

వీధిలోనే పోలీసులు అతన్ని కమ్మేశారు. పరిస్థితినీ, జరిగిన మోసాన్నీ అర్థం చేసుకున్న రావ్ ప్రాణాలకి తెగించి పోలీసు వలయాన్ని ఛేదించుకుని తప్పించుకు పారి పోయాడు.

ఆ సందర్భంలో అతని దెబ్బకి ఓ పోలీసు అధికారి మెడ విరిగిపోయింది. పది రోజుల చికిత్స తర్వాత అతను మరణించాడు. మరో పోలీసు వెన్నెముక విరిగిపోయింది. ఇప్పుడతను జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాడు. అందుచేత డ్యూటీలో వున్న పోలీసు ఉద్యోగులమీద తిరుగుబాటు చేసినందుకు రావ్‌కి ఎగైనెస్ట్‌గా షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్ జారీ చేశారు. ఇప్పుడతను కనిపిస్తే చాలు! వెనకాముందూ ఆలోచించకుండా కాల్చి పారేస్తారు. ఆ సంగతి నేనే అతనికి చెప్పాను. అందుకే మిమ్మల్ని చూడాలని మనస్సు ఎంతగా ఆరాటపడినా ధైర్యంచేసి యిక్కడికి రాడు!

ఒక్క విషయానికి మాత్రం అతన్ని నేనెంతగానో మెచ్చుకుంటాను. మిమ్మల్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో, మీరు యధాస్థితికి వచ్చారన్న శుభవార్త వినాలన్న ధ్యేయంతో తన ప్రాణాలని కూడా లెక్కచెయ్యకుండా ఆ వయస్సులో పోలీసుల కళ్ళుగప్పి అజ్ఞాతవాసం చేస్తున్నాడతను? మరొకడయితే ఎందుకొచ్చిన తద్దినమని తనదారిన తాను రహస్యంగా దేశం వదిలి పారిపోయి ప్రాణాలు దక్కించుకునేవాడు! రావ్‌లాంటి ప్రాణమిచ్చే స్నేహితుడు లభించడం నిజంగా మీ అదృష్టం! మీ పూర్వజన్మ సుకృతం" అని చెప్పాడు.

తన కోసం రావ్ యింత సాహసం చేశాడా? స్నేహ ధర్మం కోసం దేశంకాని దేశంలో ప్రాణాలకే తెగించాడా? నర్సన్ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. కన్నీరు చెక్కిళ్ళ

మీదకి ధారగా జాలు వారింది.

"ఓహ్....మీరు కన్నీరు కారుస్తున్నారా? మీకెందుకూ? నా భార్యాబిడ్డలు ఎలా వున్నారోనని రెండేళ్ళనించీ నే నేడుస్తున్నాను" అంటూ డాక్టర్ మైకా ముందుకు వంగి నర్సన్ చేతులు పట్టుకుని "నా భార్యాబిడ్డల్ని రక్షించుకోవడంకోసమే పోలీసుల హెచ్చరికలను కూడా లక్ష్యపెట్టకుండా రెండేళ్ళపాటు మిమ్మల్నిక్కడ వుంచి కాపాడాను నర్సన్! ఇహనైనా మీరు నావాళ్ళని రక్షించండి. రావ్ బందిఖానానించి వాళ్ళని విడిపించండి. మీరు చెబితే అతను వాళ్ళని వదిలేస్తాడు. దయతో నాకీ ఉపకారం చేసిపెట్టండి" అన్నాడు ఉద్వేగంతో.

నర్సన్ అతని చేతులు నిమురుతూ "డోంట్‌వర్రీ డాక్టర్! మీ భార్యాబిడ్డలు క్షేమంగా మీ దగ్గరికి చేరుకుంటారు. రావ్ వాళ్ళని విడుదల చేస్తాడు. అతను నన్ను కల్సుకోగానే ముందుగా మీ విషయమే చూస్తాను" అని చెప్పాడు గంభీరంగా.

"థాంక్‌యూ! థాంక్‌యూ వెరీమచ్ నర్సన్" అన్నాడు డాక్టర్ మైకా ఉత్సాహంగా. మరుక్షణమే నిరుత్సాహంతో శూన్యంలోకి చూస్తూ "ఏమో? అతనిక్కడికి వస్తాడన్న నమ్మకం నాకు లేదు. బహుశా ఫోన్‌చేసి మీ ఆరోగ్యం గురించి అడుగుతాడు. మీరు స్వయంగా ఫోన్‌లో మాట్లాడినా అదేదో పోలీసు కుట్ర అనే భయంతో మీ మాటల్ని కేర్ చెయ్యకపోవచ్చు! అతను కళ్ళారా మిమ్మల్ని చూస్తేనేగానీ ఒక నిశ్చయానికి రాడు. కానీ మీరిద్దరూ కల్సుకునే అవకాశం కనుచూపుమేరలో ఎక్కడా కనిపించడం లేదు. ఇహ నావాళ్ళని ఎలా విడుదల చేస్తాడు? ఎందుకు విడిచి పెడ్తాడు?" అన్నాడు దిగులుగా.

"ఆ సందేహం మీ కనవసరం డాక్టర్! ఒక్కసారి రావ్ ఫోన్‌లో మాట్లాడితే అతన్ని నేను ఒప్పించగలను. మా ఇద్దరికీ మాత్రమే పరిమితమైన కోడ్‌లో అతన్ని నేను హెచ్చరించగలను. మీవాళ్ళ విషయంలో మీరిహ నిశ్చింతగా వుండండి. ఇప్పుడు నన్ను బాధిస్తున్న సమస్య వేరు! నాకోసం యింత చేసిన అతన్ని నేనేవిధంగా రక్షించాలి! పోలీసుల బారినుండి అతన్ని ఎలా కాపాడాలి? జవసత్వాలు వుడిగిపోయిన నేను యీ వయస్సులో. ఈ పరిస్థితిలో అతని కోసం ఏం చెయ్యగలను? ఇంతమంది పోలీసుల్ని దేశంకాని దేశంలో యీ నిస్సహాయ స్థితిలో ఎలా ఎదిరించ గలను?" అన్నాడు నర్సన్ ఆవేదనగా.

అదే సమయంలో ఛళ్ళున తలుపులు తెరుచుకున్నాయి. ఇన్‌స్పెక్టర్ బాండ్ విసురుగా లోపలికి వచ్చాడు. ఆ ఇద్దరి వైపూ సీరియస్‌గా చూస్తూ "పేషెంట్‌ని చెకప్‌చేస్తానని ఇంతసేపూ లోపల ఏం చేస్తున్నారు డాక్టర్! మీ భార్యాబిడ్డలకి ఏదైనా ప్రమాదం జరుగుతుందేమో నన్న భయంతో ఏదో విధంగా యితన్ని యిక్కడినించి అవతలకి తప్పించాలని ఆలోచిస్తున్నారా?" అని అడిగాడు తీవ్రస్వరంతో.

"లేదు. లేదు. అలాంటి దురుద్దేశం నాకు లేదు. మీ పోలీసువాళ్ళు ఏనాడైతే యీ హాస్పిటల్లో అడుగుపెట్టారో ఆనాడే నావాళ్ళ గురించి ఆశ వదిలేసుకున్నాను" గాభరాగా జవాబిచ్చాడు డాక్టర్ మైకా, కొంత నిష్ఠూరాన్ని కూడా జోడించి.

"మీ ఉద్దేశ్యాలు మా కనవసరం డాక్టర్! మేము వెతుకుతున్న హంతకుడు అడ్మిట్ చేసిన యీ పేషెంట్ గురించి రిపోర్టు యివ్వనందుగ్గాను అసలానాడే మిమ్మల్ని ప్రాసిక్యూట్ చేద్దామనుకున్నాం. నేనే పై అధికారులకి మనవి

చేసి మీమీద చర్యతీసుకోకుండా నిరోధించాను. అది నా పొరపాటు కాకూడదు. ఆ హంతకుడు ఇతన్ని చూడ్డానికే కాదు, వీలైతే యిక్కడ్నించి తప్పించి తీసుకుపోడానికి ఏ నిమిషంలోనైనా ఇక్కడికి వచ్చి తీర్తాడు.

అంచేత ముందు జాగ్రత్తకోసం యీ పేషెంటుని మా కస్టడీలోకి తీసుకోమంటూ ఇప్పుడే పైనించి ఆర్డర్స్ వచ్చాయి. అంతేకాదు! అయాం వెరీవెరీ సారీ మిస్టర్ నర్సన్! ఆ రావ్ పట్టుపడేంతవరకూ మీకు మళ్ళీ సంకెళ్ళు వెయ్యక తప్పడంలేదు. నౌ యూ ఆర్ అండర్ అవర్ కస్టడీ" అని చెబుతూ సంకెళ్ళ గొలుసుల్ని ఎత్తి పట్టుకుని ముందుకు నడిచాడు ఇన్‌స్పెక్టర్ బాండ్.

నిర్ఘాంతపోయాడు నర్సన్! సంకెళ్ళా! యీవయస్సులో, యీ క్లిష్ట సమయంలో తనకి సంకెళ్ళా! ఆ గొలుసులని తగిలించుకుంటే తాను రావ్‌ని ఎలా కాపాడగలడు? తన కోసం ప్రాణాలకి సైతం తెగించిన ఆ ప్రాణమిత్రుడి ప్రాణాలను ఎలా కాపాడగలడు? ఇన్‌స్పెక్టర్ బాండ్, అతని పరివారాన్ని ఎలా ఎదిరించగలడు? ఇప్పుడేం చెయ్యాలి? తన కర్తవ్యం ఏమిటి? తనుకూడా ప్రాణాలకి తెగిస్తే.... తెగిస్తే....?

నర్సన్ గుండె టకటక కొట్టుకుంటోంది. వార్ధక్యంతో పాలిపోయిన అతని నుదుటిమీద ముడుతలు మెలికలు తిరుగుతున్నాయి. తాచుపాము బుసకొడుతున్నట్లు గొంతు లోంచి బరువుగా ఆయాసం బయటికి వస్తోంది. సంకెళ్ళ గొలుసుల్తో ఇన్‌స్పెక్టర్ బాండ్ దగ్గరికి వచ్చేశాడు! తీక్షణమైన చూపులతో ఎదురుగ్గా నిలిచాడు.

"సారీ మిస్టర్ నర్సన్! అయాం హెల్ప్‌లెస్! నా డ్యూటీ నే చెయ్యాలి! గొడవ చెయ్యకుండా చేతులు

చాచండి. సంకెళ్ళు తగిలిస్తాను" అంటున్నాడు బాండ్.

"యూ కాంట్...." పిడుగులా గర్జించింది నర్సన్ కంఠస్వరం. మెరుపువేగంతో పిడికిలిబిగించి బాండ్ దవడ క్రింద ఫెడీలున గుద్దాడు. కెవ్వున అరుస్తూ కట్టె విరిగినట్లు వెనక్కి విరుచుకుపడ్డాడు. అతని పైనించి అవతలకి ఒక్క జంప్‌చేసి వేటకుక్కలా గుమ్మంవైపు పరిగెత్తాడు నర్సన్.

"ఒద్దు నర్సన్....పోలీసుల్ని ఎదిరించి ప్రాణాలు పోగొట్టుకోవద్దు...." అంటూ డాక్టర్ మైకా, "తప్పించుకో లేవు నర్సన్....స్టాప్‌దేర్...." అంటూ ఇనస్పెక్టర్ బాండ్ చేస్తున్న హెచ్చరికలను లక్ష్యపెట్టకుండా గుమ్మందాటి బయటకు పరిగెత్తాడు నర్సన్.

తాను ఇక్కడినించి తప్పించుకు పోయినట్లు తెలిస్తే రావ్ యిక్కడికి రాడు! అతన్ని నిరోధించడానికీ, అతని ప్రాణం కాపాడ్డానికీ యింతకుమించి గత్యంతరం లేదు? రేసు హార్స్‌లా నురగలు కక్కుతూ బాల్కనీ వరండాలో పరుగులు తీస్తున్నాడు నర్సన్. వృద్ధాప్యంవల్ల బాగా ఆయా సంతో పాటు రొప్పువస్తోంది. నీరసంతో శరీరం తూలి పోతోంది.

అయినా నర్సన్ పట్టుదలగా పరిగెడుతున్నాడు. వరం డాలో అతని బూట్ల చప్పుడు టకటకమని ప్రతిధ్వనిస్తోంది. వరండాకి రెండోవైపు నున్న గదుల్లోంచి చాలా మంది ఆ అడుగుల చప్పుడుకి బైటికి వస్తున్నారు. ఎవరికీ ఏమీ అర్థం కావడం లేదు. అంతలో—

"అతన్ని పారిపోనివ్వకండి. ఆపండి....పట్టుకోండి.." వెనకనించి బాండ్ స్వరం భీకరంగా గర్జించింది. మరు క్షణం పోలీసు విజిల్స్ ఆ ప్రాంతమంతటా ప్రతిధ్వనిం చాయి. మిడతల దండుల్లా పోలీసులు కమ్ముకు వస్తున్నారు.

అయినా ఆగలేదు నర్సన్. ఆగదల్చుకోలేదు. అవసరమైతే తన ప్రాణం బలి యివ్వడానికైనా అతను సంసిద్ధుడయ్యాడు. తన ప్రాణం పోతే తన మరణవార్త వెల్లడయితే రావ్ యిక్కడికి రావాల్సిన పనిలేదు. ఆ విధంగానైనా తాను అతన్ని కాపాడగలడు! అసలు తను మరణించిన తర్వాత ఏం జరిగినా తను చూడలేడు! తాను బ్రతికి వుండగా మాత్రం తన కళ్ళెదుట తనకోసం రావ్ బలి కాకూడదు! అంతే!

చాలా పొడుగాటి వరండా అది! వెనకనించే కాక ముందునించి కూడా పోలీసులు కమ్ముకువస్తున్నారు. పక్కగదిలోంచి ఇద్దరు ఒక్కసారిగా మీదపడ్డారు. ఒక్క విదిలింపుతో వాళ్ళని నెట్టేసి ముందుకు దూకాడు నర్సన్. మరోపోలీసు వెనకనించి మీదపడి అతని కుడిచెయ్యి అందుకుని వెనక్కి మెలితిప్పుతున్నాడు. కరకరమని నరాలు విరిగిపోతున్నంత బాధతో విలవిల్లాడిపోతూ బూటుకాలు మడిచి ఆ మనిషి పొత్తికడుపులోకి వెనక్కి ఒక్కతాపు తన్నాడు. ఫుట్‌బాల్లా వెనక్కి ఎగిరిపడ్డాడా పోలీసు.

చెయ్యి జాడించుకుంటూ ఉపిగొల్పిన వేటజాగిలంలా ముందుకు వురికాడు నర్సన్. ఎడమచెయ్యి పిడికిలి బిగించి తనని పట్టుకోబోయిన యిద్దరు పోలీసుల్ని ఫెడీల్ ఫెడీలుమని గుద్దుతూ, బూటుకాలెత్తి మరొకడి పొత్తికడుపులో ఫెడేల్మని తన్ని, తలవంచి యింకొకడి డొక్కలో ఆంబోతులా కుమ్ముతూ మరో రెండంగల్లో బాల్కనీ పిట్టగోడ దగ్గరకి చేరుకున్నాడు. రెండు చేతులూ గోడమీద ఆనించాడు. పైకెగరబోతున్నాడు....

"ఆగండి నర్సన్....లేదా కాల్చిపారేస్తాను" వెనకనించి బాండ్ హెచ్చరిక కటువుగా వినిపించింది. దాన్ని

ఖాతరు చెయ్యకుండా పైకెగరబోయాడు నర్సన్. అంతలో

"నర్సన్...." బాల్కనీ క్రింద హాస్పిటల్ ఆవరణ లోంచి రావ్ స్వరం బిగ్గరగా వినిపించింది. నర్సన్ ఉలిక్కిపడుతూ క్రిందికి చూశాడు. రావ్ వస్తున్నాడు. ఉత్సాహంతో ఉద్విగ్నతతో హాస్పిటల్‌వైపు పరిగెత్తుకొస్తు న్నాడు. గెడ్డమూ, మీసాలూ నెరసిపోయిన తల పైకెత్తి బాల్కనీ వైపు చూస్తూ రొప్పుతూ పరిగెత్తుకొస్తున్నాడు.

"నర్సన్....హౌడూయూడూ...." బిగ్గరగా అరిచాడు రావ్ ఆశ్చర్యంతో.

"ముందుకు రావద్దు రావ్....పారిపో....పోలీసులు కాచుకున్నారు పారిపో" గొంతు చించుకుంటూ పొలికేక పెట్టాడు నర్సన్. సరిగ్గా అదే సమయంలో బాల్కనీ క్రింద ఏ మూలనించో ధనధన మంటూ తుపాకులు పేలసాగాయి.

మెలికలు తిరిగిపోయాడు రావ్. జివ్వు జివ్వున రక్తం చింది చిమ్మసాగింది. గిలగిలలాడిపోతూ, విలవిల తన్ను కుంటూ నిట్టనిలువునా కుప్పకూలిపోయాడు. క్షణంలో రక్తపు మడుగులో అతని శరీరచలనం స్థంభించిపోయింది.

"రావ్...." పేగులు తెగిపోయేలా ఒక్క పొలికేక పెట్టాడు నర్సన్. తలమీద వెయ్యి మెగాటన్నుల బాంబు బద్దలైనట్లు నిలువునా కంపించిపోయాడు. కళ్ళముందు చీకట్లు కమ్ముకువచ్చాయి. ఎవరిని రక్షించడానికి ప్రాణాలకి తెగించి ఆ వయస్సులో అంత సాహసం చేశాడో, ఆ మనిషే తన కళ్ళముందే, తనకోసమే నిలువునా బలైపోయే సరికి నర్సన్ మస్తిష్కం, నవనాడులూ ఎక్కడివక్కడ స్థంభించిపోయాయి. అంతే!

అనూహ్యమైన మైకంతో క్షణంలో ఒళ్ళంతా చలవ కమ్మేసింది. స్పృహపోతోందో ప్రాణమే పోతోందో తెలి

యని అచేతనావస్థతో తూలి కుప్పకూలిపోయాడు. ఎవరో తన దగ్గరగా పరిగెత్తుకొచ్చిన బూట్లచప్పుడూ, బలంగా తనని కావిటేసి పట్టుకుంటున్నట్లూ మాత్రమే అతను గ్రహించగలిగాడు. ఆ మరుక్షణమే అతనికి పూర్తిగా స్పృహపోయింది.

7

"స్పృహవస్తోంది.పల్స్, బి.పి. నార్మల్‌గానే వున్నాయి. హార్ట్ రన్నింగ్ కండిషన్లో వుంది. ఇహ భయంలేదు" అన్నమాటలు నెమ్మదిగా వినిపించాయి.

అప్పటికి అరనిమిషం క్రితమే స్పృహలోకి వచ్చాడు నర్సన్. అయినా కళ్ళు తెరవలేదు. ఎవరైనా కావాలనే తనని పజిల్ చేస్తున్నారో, తానే మానసిక బలహీనతవల్ల పజిల్ అవుతున్నాడో నిర్ధారణ చేసుకునేంతవరకూ కళ్ళు తెరవదల్చుకోలేదు. అందుకే శ్రద్ధగా ఆ సంభాషణ ఆలకించసాగాడు.

"ఇంతకీ మెంటల్ ప్రాబ్లమ్స్ రావని నిశ్చయంగా చెప్పగలరా డాక్టర్" అని వినిపించింది. ఆ స్వరాన్ని స్పష్టంగా గుర్తుపట్టాడు నర్సన్! అది రావ్ కంఠస్వరం! అంటే అతను పోలీసు కాల్పులకి గురై మరణించడం అబద్ధమో, అభూతకల్పనో అయివుండాలన్నమాట! డాక్టర్ అన్న మాటల్నిబట్టి తను పూర్తి కండిషన్లో వున్నట్లు నిర్ధారణ అవుతోంది. మరి ఆ పజిల్ ఏమిటో యిప్పుడు తెల్సుకోవాలి!

"నర్సన్‌మీద నేనెన్నో ఆశలు పెట్టుకున్నాను డాక్టర్! అనుకున్నదానికి విరుద్ధంగా అతనికి ఏదైనా జరిగితే నా శ్రమ, దీక్ష బూడిదలో పోసిన పన్నీరవుతుంది...."

"నా మీద ఏం ఆశలు పెట్టుకున్నావు రావ్! నువ్వు

అనుకుంటున్నదేమిటి?" కళ్ళు తెరవకుండానే గంభీరంగా ప్రశ్నించాడు నర్సన్. రావ్ అదిరిపడి అతనివైపు ఆశ్చ రంగా చూస్తూ "మీరు మెలుకువగానే వున్నారా నర్సన్" అని అడిగాడు విస్మయంతో.

నర్సన్ చటుక్కున కళ్ళు తెరిచి "ఇది 1981 వ సంవత్సరం ఏప్రిల్ నెల అనీ, యీ రోజు తారీకు 19 దో 20 ననీ నాకు తెల్సు! కానీ నన్ను 1992లోకీ 1994లోకి తీసుకువెళ్ళారనీ నా మస్తిష్కాన్ని తీవ్రంగా సంక్షోభ ప్రకంపనలకి గురిచేశారనీ అర్థం చేసుకున్నాను. 1981 లోనే ఏప్రిల్ 18 న నన్ను ఢిల్లీకి పిలిపించి ఏదో కేసు వివరాలు చెప్పే మిషమీద ఒక ఇరానీ రెస్టారెంట్ కి తీసుకు వెళ్ళి అక్కడ ముందుగా చేసిన ఏర్పాటు ప్రకారం టీలో మత్తుమందు కలిపి నన్ను స్పృహ తప్పించి అక్కడినించి నామీద మీ నాటకాన్ని అంచెలంచెలుగా కొనసాగించారని గ్రహించాను" అంటూ బెడ్ మీద లేచికూర్చుని "ఇప్పుడు చెప్పండి. కాసేపు నన్ను మామూలుగానూ, మరికాసేపు జవసత్వాలు వుడిగిన వృద్ధుడిగానూ మార్పిడిచేస్తూ నా మనస్సును చిత్రవధ చెయ్యడంలో మీ ఉద్దేశం ఏమిటి?" అనడిగాడు!

"మిమ్మల్ని వృద్ధుడిగా మార్చడం ఏమిటి? అదెలా సంభవం? కలగంటున్నారా? హిప్నాటిక్ ట్రాన్స్ కి గురయ్యారా?" రెట్టించాడు యస్. బి. డైరెక్టర్ ఆశ్చర్యంతో.

"కలకాదు మిస్టర్ రావ్! ఊహాతీతమైన నాటక ప్రదర్శనకి నాంది! ఇంతకు ముందువరకూ నేనూ అలాంటి భ్రమలోనే వున్నాను. కానీ ఆఖరిసారిగా డాక్టర్ మైకా హాస్పిటల్లోంచి పారిపోతున్నప్పుడు, పోలీసులు మిమ్మల్ని

నిలువునా కాల్చిపారెయ్యడాన్ని కళ్ళారా చూసింతర్వాత, ఆ ఉద్విగ్నతతో నాకు మళ్ళీ స్పృహపోతున్న క్షణంలో మరణించినట్లు రక్తపుమడుగులో పడివున్న మీరు, బాల్కనీలోంచి నే నెక్కడ క్రిందికి రాలిపోతానోనన్న భయంతో చివాల్న లేచినించోడాన్ని స్పష్టంగా గమనించాను. అంతేకాదు. మీరొక పెద్ద డ్రామా ఆడారని నిరూపించడానికి ఇప్పుడు నా దగ్గర ఖచ్చితమైన ఆధారా లున్నాయి" అన్నాడు నర్సన్ గంభీరంగా.

"ఆధారాలా?" తెల్లబోయి ప్రశ్నించాడు యస్. బి. డైరెక్టర్.

"యస్. నేను కలకత్తానించి వచ్చినట్లు నమ్మించడానికి మీరు ప్రయత్నించినప్పుడు నా పాదాలకి వున్న బూట్స్ 1994 లో డాక్టర్ మైకా హాస్పటల్లో కళ్ళు తెరిచినప్పుడు కూడా నా కాళ్ళని అంటిపెట్టుకునే వున్నాయి. రెండేళ్ళ పాటు అపస్మారకపు స్థితిలో బెడ్ మీద వున్న పేషెంట్ పాదాలకి బూట్స్ వుండటం అసంభవమనే సత్యాన్ని మీరూ, ఆ డాక్టరూ, మీతో చేతులు కలిపిన పోలీసు సిబ్బందీ విస్మరించారు. ఆ బూట్లే తిరిగి ఇప్పుడు నా కాళ్ళకి వున్నాయి. అంటే ఇది 1981వ సంవత్సరమే అయినప్పటికీ 1994లో చికిత్స పొందినట్లు నా మస్తిష్కాన్ని వాష్ చెయ్యడానికి మీరంతా కుట్ర పన్నారన్నమాట! అంతేకాదు! పోలీసుల వేటనించి తప్పించుకునే ప్రయత్నంలో ఓ పోలీసు నా కుడిచేతిని మెలితిప్పాడు. ఆ నెప్పి, ఆ బాధ యింకా నాకు తెలుస్తూనే వుంది. మణికట్టు వాపు యింకా తగ్గలేదు."

"ఇంతేనా? ఇంకా ఏమైనా ఉన్నాయా?" వెటకారంగా రెట్టించాడు యస్.బి. డైరెక్టర్.

"ఓహో! నా మాటలు తేలిగ్గా నమ్మనట్లు నటిస్తూ మళ్ళీ నన్ను ట్రాప్‌లో తొయ్యాలని ఆలోచిస్తున్నారన్నమాట! ఆల్‌రైట్! నీ కళ్ళు తిరిగే ఆధారాన్ని ప్రొడ్యూస్ చేస్తాను రావ్! ఇలాంటిదేదో జరుగుతోందో లేదో నిశ్చయించుకో డానికే నేనో ఆధారాన్ని సంపాదించాను" అంటూ నర్సన్ చకచక ఎడమకాలి బూటు లేసు విప్పుతూ—

"నేను 1994 జూన్ 16 న తన హాస్పిటల్లో కళ్ళు విప్పి నట్లు రుజువు చెయ్యడానికి డాక్టర్ మైకా ఆ తేదీని ప్రద ర్శించి పాకెట్ వాచిని నాకు చూపించి తిరిగి కోటుజేబులో పడేసుకున్నాడు. ఎందుకైనా అవసరం రావచ్చునని ఆ స్టాప్ వాచిని అతనికి తెలియకుండా నేను సంగ్రహించి ఆ స్వల్ప వ్యవధిలోనే నేర్పుగా నా బూటులోకి నెట్టేశాను. అదింకా నా దగ్గరేవుంది" అంటూ బూటు విప్పి లోపల్నించి వాచిని తీసి రావ్‌మీదకి విసుర్తూ—

"నౌ సీ దట్ వాచ్ మిస్టర్ రావ్! అది స్టాప్ ఎడ్జస్టు మెంట్ వున్న వాచి. దాని బటన్ నొక్కివుంచాను. అంచేత ఇప్పుడు కూడా దాన్లో 1994 జూన్ 16 తారీకు కన్పి స్తుంది! మీరు నన్ను ట్రాప్ చేశారని నిరూపించడానికి యీ ఆధారం చాలా?" అడిగాడు నర్సన్ సీరియస్‌గా.

"చాలు. ఆ వాచీ సంగ్రహిస్తారని నాకు తెల్సు! ఆ విషయం మీకు జ్ఞాపకం వుంటుందా లేదా అనేది కూడా నా పరిశీలనలో ఒక భాగం! యూ ఆర్ స్మార్ట్ నర్సన్! మీ మేధాసంపత్తి అనన్య సామాన్యం!రసాధారణం! ఇంతటి చురుకైన మస్తిష్కం, పదునైన మేధస్సు కోటికొక్కరికి వుంటుందేమో! ఇప్పుడు అంగీకరిస్తున్నాను నర్సన్! మీ అనుమానమే యదార్థం! నేను మిమ్మల్ని ట్రాప్ చేశాను! అనూహ్యమైన రీతిలో మీ మనస్సుకీ, మస్తిష్కా

నికీ తీవ్రమైన సంక్షోభాన్ని కల్పించాను! మీకు బ్రెయిన్ వాష్ చెయ్యడానికి ఎవరూ అనుసరించని, క్షంతవ్యంకాని అసాధారణ పద్ధతుల నుపయోగించాను. సారీ...."

"సారీ....సారీ....సారీ...." ఆగ్రహంతో గర్జిస్తూ చివాల్న ముందుకురికి రావ్ కోటుకాలర్స్ పుచ్చుకుని చెళ్లు చెళ్లు చెళ్లుమని అతని దవడలమీద ఎడాపెడా బలంగా వాయించసాగాడు నర్సన్. రావ్ చెంపలు అదిరి పోతున్నాయి. చెంపదెబ్బలతో ఆ గది మార్మోగిపోతోంది. రావ్ కిక్కురుమనడంలేదు. ఓర్పుగా, మౌనంగా ఆ చెంప దెబ్బలు భరిస్తున్నాడు.

డాక్టర్ నిశ్చేష్టుడై చూస్తున్నాడు.

రావ్ పెదవి చిట్లి రక్తం స్రవించసాగింది. ఆ రక్తాన్ని చూపి నర్సన్ తమాయించుకుంటూ "టెల్‌మీ....వై దిస్ నాన్సెన్స్ వాజ్ ప్లేయ్‌డ్...." అని అరిచాడు పళ్ళు బిగబట్టి.

"చెప్తాను. ఒక నిమిషం" అంటూ రావ్ నర్సన్ని బెడ్‌మీదకి నెట్టి "డాక్టర్....ఇప్పుడింకోసారి నర్సన్ని చెకప్ చెయ్యండి" అని చెబుతూ "ప్రొఫెసర్ డోగ్రే.... డాక్టర్ మైకా....ప్లీజ్ కమిన్...." అంటూ బిగ్గరగా పిలిచాడు. మరుక్షణం వాళ్ళిద్దరూ ఒకేసారి ఆ గదిలోకి వచ్చారు. వాళ్ళని చూసి నర్సన్ నిర్ఘాంతపోతూ "ఓహ్.... ఎగైన్ యూ ఆర్ గోయింగ్ టు కండక్ట్ అనదర్ డ్రామా?" అని అరిచాడు కోపంగా.

"ప్లీజ్ కీప్‌క్వయిట్ నర్సన్! ఓన్లీ వన్ మినిట్ మోర్" అంటూ వాళ్ళవైపు తిరిగి "కమాన్....ఇప్పుడు మీరంతా నర్సన్ని చెకప్ చెయ్యండి. ఇతని బి.పి., ఇ.సి.జి, హార్ట్, లంగ్స్, పల్స్, ఎవ్వరిథింగ్ చెక్ చెయ్యండి. ఇంతకుముందు ' ట్రాప్‌ట్రాన్స్‌లో వున్నప్పుడూ, నిజం

తెల్సిన తర్వాత ఇప్పుడూ ఇతని మెంటల్ కండీషన్‌లో వున్న మార్పులని పరిశీలించండి. చెకప్ కేర్‌ఫుల్లీ ....” అని ఆదేశించాడు గంభీరంగా.

నర్సన్ నివ్వెరపోయాడు. అతని అంగీకారంతో నిమిత్తం లేదన్నట్లు ముగ్గురు డాక్టర్లూ అతని శరీరంమీదకి దాడిచేసి వైద్యపరికరాలను అతని శరీరభాగాలకు అమరుస్తూ చకచక అన్నిరకాల పరీక్షలూ జరుపసాగారు. ఆ హడా విడంతా ఎందుకో అర్థంకాక రావ్ వైపు చూశాడు నర్సన్. అతని మొహంలో ఆతృతగానీ, ఆరాటంగానీ ఉద్విగ్నత గానీ మరేవిధమైన భావమూ లేకుండా చాలా గంభీరంగా వుంది. నిమిత్తమాత్రుడైన సర్వసంగపరిత్యాగిలా నిశ్చ లంగా నిశ్శబ్దంగా వున్నాడతను.

మాటవరసకి ఒక్కనిమిషం అన్నప్పటికీ దాదాపు ఇరవై నిమిషాలపాటు ముగ్గురు డాక్టర్లూ నర్సన్ని చెకప్ చేస్తూ ఛార్ట్‌పేపర్సులో వివరాలు చకచకా రాసుకోసాగారు. ఇరవై నిమిషాల తర్వాత ప్రొఫెసర్ డోగ్రే మిగతా ఇద్దరి పేపర్సూ అందుకుని మూడింటినీ నిమిషంపాటు మార్చి మార్చి పరిశీలించి సంతృప్తిగా తలపంకిస్తూ “హి యీజ్ క్వయిట్ ఆల్‌రైట్ మిస్టర్ రావ్! పిడుగులు మీదపడినా ఎట్టి పరిస్థితుల్లోనూ నర్సన్ మానసిక మస్తిష్కస్థితి చలిం చదు. ఇట్లాంటి దృఢమైన వ్యక్తిత్వంగల వ్యక్తులు చాలా అరుదుగా కన్పిస్తారు. క్వయిట్ ఓకే” అని చెప్పాడు గంభీరంగా.

“థాంక్స్” అంటూ అప్పుడు భారంగా నిట్టూర్చాడు రావ్. తన చూపును మార్చుకుంటూ “యీ పరీక్షలన్నీ యెందుకో, మీమీద ఎందుకిన్ని ప్రయోగాలూ, కుట్రలూ జరిపామో వివరంగా విశదీకరిస్తాను నర్సన్! ముందు

బూట్ తొడుక్కోండి" అన్నాడు.

"మీరిన్ని పరీక్షలు జరపడంవల్ల ఆశించిన ప్రయోజనం ఏమిటో నాకు అర్ధంకావడంలేదు. ఎన్నివిధాల టెస్టులు చేసినా కల్లో కూడా వ్యక్తిత్వంలో మార్పు సంభవించదని మీరు గ్రహించకపోవడం నిజంగా మీ అవివేకం! ఇంకా ఏం చెయ్యదల్చుతున్నారు?" అన్నాడు నర్సన్ నిష్ఠూరంగా, బూటు కాలికి తొడుక్కుంటూ.

"ఆ సంగతి నాకూ తెల్సు! అయినా మరోసారి నిర్ధారణ చేసుకోడానికీ యీ ప్రయత్నం చేశాను. రండి. మనం అవతలి గదిలోకి వెళ్ళి మాట్లాడుకుందాం" అని చెబుతూ వెనక్కి తిరిగాడు రావ్. అతన్ని అనుసరించాడు నర్సన్. ముగ్గురు డాక్టర్లూ వాళ్ళవెనక కదిలారు.

ప్రక్కగది చాలా విశాలంగా వుంది. ఒక రౌండ్ టేబిలు చుట్టూ అరడజను చైర్స్ వేసివున్నాయి. కిటికీలని అందమైన పిల్కు మఖమల్ కర్టెన్స్ మూసేస్తున్నాయి. ఆ వాతావరణాన్నిబట్టి అది హాస్పిటల్లో గది కాదని అర్థం చేసుకున్నాడు నర్సన్.

గదికి రెండో చివరవున్న గోడవరగా ఓ పొడుగాటి బల్ల ఆనించినట్లు తెలుస్తోంది. ఆ బల్లమీద పొడుగాటి చెక్కపెట్టో, అలాంటి మరో వస్తువో వివరం తెలియడం లేదుగానీ ఆ వస్తువు బయటికి కనిపించకుండా మఖమల్ క్లాత్ కప్పబడివుంది. ఆ వస్తువు ఆకారం మాత్రం తెలుస్తోంది. అదేమిటి? అనే అనుమానం కలిగినా ప్రశ్నించ లేదు నర్సన్.

అయిదుగురూ రౌండుటేబిలు చుట్టూవున్న కుర్చీల్లో కూర్చున్నారు.

రావ్ ఓసారి పొడిగా దగ్గి "మిస్టర్ నర్సన్! నేటికి సరిగ్గా మూడురోజుల క్రితం అంటే ఏప్రిల్ 18వ తేది పొద్దుట సుమారు పదిన్నరగంటల ప్రాంతంలో మీమీద మా ప్రయోగాలని ఆరంభించాము. ఇరానీ హోటల్లో మీరు తాగిన టీలో మత్తుమందు కలిపించాము. మర్నాటి పొద్దున వరకూ మీరు గాఢసుషుప్తిలోనే వళ్ళు తెలియకుండా నిద్ర పోయారు. కళ్ళు తెరిచేసరికి మన వయస్సుల్లో, జీవితాల్లో పదేళ్ళు గడిచిపోవడం, మీకు బ్రెయిన్‌వాష్ జరిగిందని చెప్పించడం తర్వాత శత్రుగూఢచారిలా మా మనిషిని రంగంలోకి రప్పించి మీరు అతన్ని ఆవేశంలో హత్యచేసి నట్లు ప్రకటించి డోగ్రేతో మరో ఇంజెక్షన్ యిప్పించాం. మళ్ళీ మీకు మైకం.

మర్నాటి పొద్దుట నాముందు మామూలుగా వున్నారు. కలకత్తా ప్రయాణంకథ వినిపించి టీద్వారా మళ్ళీ స్పృహ తప్పించాము. ఈసారి హాస్పిటల్లో డాక్టర్ మైకా, ఇన్‌స్పెక్టర్ బాండ్, నర్సు, పోలీసులు, సంకెళ్ళు—షాక్‌తో మీరు స్పృహ కోల్పోయేటట్లు ప్లాన్‌చేశాం. ఇప్పుడు నాల్గో రోజు అంటే 21వ తేదీ జరిగిన సంఘటనలని మళ్ళీ వివరించి బోర్ కొట్టనుగానీ, యీ రూపాల మార్పిడి ఎలా జరిగిందో కొద్దిగా వివరించి ఆ తర్వాత అసలు విషయానికి వస్తాను" అన్నాడు.

నర్సన్ మాట్లాడలేదు. రావ్ బల్లమీద పడేసిన పాకెట్లోంచి సిగరెట్‌తీసి వెలిగించుకుంటూ గుప్పున పొగ వదిలాడు. ముగ్గురు డాక్టర్లు మౌనంగా వున్నారు.

"అమెరికన్ జాతీయుడయిన డాక్టర్ జకిల్ పేరు మీకింకా గుర్తుండే వుంటుంది మిస్టర్ నర్సన్! అజరామరత్వాన్ని సాధించాలని ఎన్నెన్నో పరిశోధనలు చేసిన డాక్టర్

జకిల్ ఆ ప్రయత్నంలో విఫలుడయి వికృత రూపుడయిన దానవుడుగా మారిపోయే ఫార్ములా తయారుచేశాడు. అటు తర్వాత డాక్టర్ జకిల్ ఆ మందు ప్రభావంతో పగలు సౌమ్యుడయిన డాక్టరుగానూ, రాత్రుళ్లు వికృత రూపుడయిన కామ పిశాచిలానూ ప్రవర్తించి ఎన్నో ఘోరాలుచేసి ఆఖరికి ప్రాణాలనే కోల్పోయాడు. అతని జీవితచరిత్ర పుస్తక రూపంలోనే కాకుండా చలన చిత్రంగాకూడా రూపొందించబడి యావన్మందినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది.

డాక్టర్ జకిల్ రూపొందించిన ఫార్ములా అతనితోపాటే కాలగర్భంలో కల్సిపోయినా, ఆకథ, ఆగాధ అలాంటి పరిశోధనలకి ఎంతో వుత్సాహాన్ని, ప్రోత్సాహాన్నిచ్చింది. పర్యవసానంగా, యీాయన, డాక్టర్ స్వరూప్ ఒక ఇంజెక్షన్ రూపొందించారు. ఇప్పటిదాకా దాన్ని ఎలుకలమీదా, కోతులమీదా ప్రయోగించిన తర్వాత మొట్ట మొదటిసారిగా మనిద్దరి మీదా ప్రయోగించారు.

ఆ ఇంజెక్షన్ ప్రభావంవల్ల స్పృహలేని స్థితిలోపడున్న మీ శరీరంలో, చర్మంలో, జుట్టులో క్రమక్రమంగా మార్పు రావడం గమనించి నిజంగానే నేను దిగ్భ్రమ చెందాను. ఆ ఇంజెక్షన్ చేసిన గంటన్నర తర్వాత శరీరంలో మార్పు కలగడం ప్రారంభమై ఆరుగంటలయ్యేసరికి శరీరంలో పూర్తిగా వార్ధక్యపు మార్పులు సంభవిస్తాయి. ఆ ఇంజెక్షన్ వల్లనే మనం రెండుసార్లు కృత్రిమ వార్ధక్యాన్ని పొందాము.

ఇప్పటిదాకా యీ ప్రయోగాన్ని జంతువులమీదే చేస్తున్న డాక్టర్ స్వరూప్, భారత ప్రభుత్వపు అనుమతి లేకుండానా ప్రోద్బలంతో తెగించి మొట్ట మొదటిసారిగా మీమీద, వెన్వెంటనే నామీద ఆ ప్రయోగాన్ని చేశారు. దీనివల్ల

మీకో, నాకో ఏదయినా ఆపద సంభవిస్తే అందుకు పూర్తి బాధ్యత నాదేనని స్వరూప్‌కి ముందే బాండెడ్ లెటర్ రాసి చ్చాను. ఆ మందు ప్రభావం వల్లనే మీకు తెలియకుండా రెండుసార్లు మీరు వృద్ధులుగా మారిపోయారు''అని ఆగాడు రావ్.

"ఎందుకు? ఆ ఇంజెక్షన్ ఫలితాన్ని తెలుసుకోడానికి నామీద యీ ప్రయోగం చేశారా?" సిగరెట్ యాష్‌ట్రేలో పడేస్తూ కావాలనే ఆ ప్రశ్న వేశాడు నర్సన్.

రావ్ తల అడ్డంగా తిప్పుతూ "ఊహూ! మీరు వృద్ధ రూపంలోకి మారడానికిగల కారణం ఏమిటో తెలపడానికే ఆ ఇంజెక్షన్ ప్రస్తావన తెచ్చాను. అదింకా ప్రయోగదశ లోనే వుంది. అది వికటించి మీకేదయినా హాని జరిగి వుంటే....సారీ! ఒకవిధంగా నేను మూర్ఖుడిలానే ప్రవ ర్తించాను. ఆ ఇంజెక్షన్ విషయం ఇప్పుడు ప్రాముఖ్యం కాదు. అసలు విషయం ఏమిటంటే...." అని ఓ క్షణం ఊరుకుని—

"హటాత్తుగా మీకు బ్రెయిన్‌వాష్ జరిగిందనుకోండి! లేదా అలాంటి మానసిక, మస్తిష్క దుర్భర సంఘటన లేవయినా సంభవించా యనుకోండి—రాబోయే పదేళ్ళో లేదా వందేళ్ళ తర్వాత జరగబోయే పరిణామాలేవైనా ఇప్పుడే మీకు తారసపడితే అనూహ్యమైన, అసాధారణ మైన, వూహాతీతమైన సంఘటనలో, దృశ్యాలో, పరిస్థి తులో మీకు ఎదురయితే—ఆ షాక్ తగిలినప్పుడు మీ మస్తిష్కం తట్టుకోగలదా? మీ మేధస్సు యధావిధిగా పని చేస్తుందా? లేక ఆ కల్పనలో- ఆ భ్రమలో చిక్కి మీరు మానసికంగా నిర్వీర్యులయి పోతారా! అనుకోనివేవయినా జరిగితే మీ మెదడు, బి.పి: అరోగ్యం, మేధస్సు సక్ర

మంగా పనిచేస్తుందా? అలాంటి పరిస్థితుల మాయాజాలా నికి బలయిపోతుందా? ఈ విషయాలు తెలుసుకోడానికే మీ మీద యీ దారుణమయిన ప్రయోగాన్ని నిర్వహించాము.

ఎట్టి పరిస్థితుల్లోనూ శారీరకంగా గానీ మానసికంగా గానీ మీ ఆలోచనల్లో హావభావాల్లో - ఆరోగ్యంలో మేధస్సులో ఏ మార్పూ సంభవించ లేదని నిర్ధారణ చేసుకున్నాము. ఈ పరీక్షలో మీరు నెగ్గారు. ప్రొఫెసర్ డోగ్రే యిందాక చెప్పి నట్లు మిన్ను విరిగి మీమీద పడినా మీరు చలించరు. మీ దృఢ సంకల్పంలో, ఆత్మ విశ్వాసంలో మార్పు సంభ వించడం అసాధ్యం!" అని చెప్పాడు రావ్.

"ఈ విషయం నిర్ధారణ చేసుకోడానికి నన్ను నాలుగు రోజులపాటు మానసికంగా హింసించారా?" అసహనంతో రెట్టించాడు నర్సన్.

"కాదు. చెప్తాను. ముందో సిగరెట్ కాల్చండి. రిలాక్స్ అవండి ప్లీజ్!" అన్నాడు రావ్ గంభీరంగా. నర్సన్ బలవంతాన నవ్వుతూ "సిగరెట్ అవసరలేదు. అయామ్ ఆల్ రైట్! అసలు విషయం చెప్పండి" అని అడిగాడు.

రావ్ వెంటనే మాట్లాడలేదు. సిగరెట్ తీసి వెలిగించు కున్నాడు. గట్టిగా రెండు దమ్ములు లాగి గుప్పున పొగ వదులుతూ "మనం నివసిస్తున్న గ్రహం పేరు భూమి అని మనకి తెలుసు! భూగ్రహంలోనే యీ సువిశాల విశ్వంలో సూర్యుడు, చంద్రుడు అని మన కళ్ళకి కన్పించే గ్రహా లతో పాటు బుధుడు, గురుడు, శుక్రుడు, శని తదితర దూరగ్రహా లెన్నో వున్నాయి. ఇవికాక మనకు కన్పించే ఒక్కొక్క నక్షత్రం ఒక్కొక్క గ్రహమని సైన్సు చెబు తోంది. ఆయా సౌరగ్రహాల్లోకూడా జీవరాశులు, ప్రాణులూ లేదా మనలాంటి మానవులూ నివశించడానికి అవకాశా

బున్నాయా, మానవుల వంటివారు మరే సుదూర గ్రహంలో నయినా—మనం భూమ్మీద నివసిస్తున్నట్లే జీవిస్తున్నారా-అన్న వివరాలు తెలుసుకోడానికి యీనాడు ప్రపంచంలోని విజ్ఞానవేత్త లందరూ నిర్విరామంగా, అవిశ్రాంతంగా పరిశోధనలు సాగిస్తున్నారు. మనిషినిపోలిన మనుషులు మన భూమ్మీదే అక్కడక్కడా అరుదుగా కన్పించ వచ్చునని ఏనాడో తేలింది. మీలా, నాలా, యీ డాక్టరులా, మరొకరిలా ఎక్కడయినా, ఎవరయినా కన్పిస్తే మనం ఇప్పుడు ఆశ్చర్య పడం! అయితే ఎంత దగ్గరిపోలికలున్నా యే యిద్దరూ ఒక్కటి కాలేరనీ, కారనీ సైన్సు చెప్పింది! అందుకు భిన్నంగా జరిగితే ఎలా వుంటుంది?" అని అడిగాడు.

"అంటే? స్పష్టంగా చెప్పండి" అన్నాడు నర్సన్ చిరాకుతో.

"చెప్తాను. మనది భూగోళం. ఇక్కడ నివసించే మనం మానవులం! ఇలాంటిదే ఇంకెక్కడో మరో భూగోళం వుంది. దానిమీద మనలాంటి మనుషులు—అచ్చం ఒకే పోలికలతో మనల్నిపోలిన మరో మనుషులు జీవిస్తున్నారు. వాళ్ళ రూపాలూ ఆకారాలే కాకుండా పేర్లుకూడా మనవీ, వాళ్ళవీ ఒక్కటే! మీరు నమ్ముతారా?"

"అబ్సర్డ్....నాటెటాల్ పాసిబుల్" అరిచాడు నర్సన్.

"డోంట్ బీ నెర్వెస్....ప్లీజ్....ఇదేమాట మరెవరయినా చెబితే, ఆఖరికి మీరుచెప్పినా నేనూ నమ్మను. మీకంటే గట్టిగా గొంతు చించుకుని అరుస్తాను. ఆ వాదాన్ని చాలా సునాయాసంగా కొట్టి పారేస్తాను. కానీ....మరో గ్రహానికి చెందిన మనలాంటి మనిషిని నేను స్వయంగా నా కళ్ళారా చూశాను. ఎక్కడో ఇంకో భూగ్రహం వుంది.

అక్కడ మనలాంటి పోలికలున్న మనుషులు మన పేర్ల తోనే జీవిస్తున్నారు. ఇక్కడ నిత్యం మనం ఎలా సంచ రిస్తున్నామో అక్కడ వాళ్ళు అలా మసలుతున్నారు. ఇది నిజం! దిసీజ్ ట్రూ!" అన్నాడు రావ్.

నమ్మలేనట్లు చూశాడు నర్సన్. రావ్ తల పంకిస్తూ "ఇది పచ్చినిజం నర్సన్! నేను చెప్పినట్లు మరో గ్రహా నికి చెందిన మనలాంటి మనిషి ఆరురోజుల క్రితం మాకు దొరికాడు. దొరికిన కొద్దిసేపట్లోనే ఆ మనిషి ప్రాణం పోయింది. అతని శవాన్ని ఒక గాజు పేటికలో భద్రపరి చాము. ఆ మఖమల్ క్లాత్ చాటున ఆ గాజు శవపేటిక వుంది. వెళ్ళి చూడండి. చూసి మీ అభిప్రాయం చెప్పండి. మిగతా వివరాలు అప్పుడు చెప్తాను" అన్నాడు గంభీరంగా.

చివాల్న లేచాడు నర్సన్. చటుక్కున అతని చెయ్యి పట్టుకుని ఆపుతూ "ఆ మనిషి శవాన్ని చూడ్డానికి వెళ్ళే ముందు నాదో రిక్వెస్టు! దయచేసి ఒక్క సిగరెట్ వెలి గించుకుని అక్కడికి కెళ్ళండి. రెండు దమ్ములు లాగి, క్యూరియాసిటీ లేకుండా ఓపెన్ మైండ్‌తో ఆ క్లాత్‌ని తొల గించండి. ప్లీజ్" అన్నాడు గంభీరంగా.

నర్సన్ తల పంకించి, సిగరెట్ తీసి వెలిగించు కున్నాడు. గట్టిగా రెండు దమ్ములు పీల్చి గుప్పుగుప్పున పొగ వదులుతూ గోడకి ఆనించివున్న బల్లవైపు అడుగులు వేశాడు. అందరూ రెప్పవాల్చకుండా అతన్నే చూస్తున్నారు. అతను తాపీగా నడిచి ఆ బల్లముందు ఆగాడు. సూదికింద పడితే చప్పుడు వినిపించేంతటి భయంకరమైన నిశ్శబ్దం అక్కడ అలుముకుంది. ఎవ్వరికీ కంటిమీద రెప్ప వాలడం లేదు.

మరో రెండు సిగరెట్ దమ్ములులాగి శవపేటికమీద

కప్పి వుంచిన మఖమల్ క్లాత్ పైన చెయ్యివేశాడు నర్సన్. మరుక్షణం ఆ ఆచ్ఛాదన జర్రున క్రిందికి జారిపోయింది! అంతే అనూహ్యమైన విభ్రాంతితో ఓ వెర్రికేక పెట్టాడు నర్సన్! ఒక్కసారిగా అతనిగుండె ఆగినంత పనయింది. కరెంట్ షాక్ తగిలినట్లు నిలువునా స్థంభించిపోయాడు! వేళ్ళమధ్యనించి సిగరెట్ పీక అప్రయత్నంగా జారిపోయింది!

"మీరు చూస్తున్న ఆ శవం మరో మానవ లోకానికి చెందిన ఇంకో మనిషిది నర్సన్! ఆకారంలో, రూపంలోనే కాకుండా, ముమ్మూర్తులా మిమ్మల్నే పోలివున్న, మీకు ప్రతిరూపంలా, ప్రతిబింబంలా అనిపిస్తున్న ఆ మరో లోకపు మనిషి పేరుకూడా మీ పేరే! అతని పేరుకూడా నర్సన్!!"

వెనకనించి రావ్ అన్న మాటలు వింటూ అదిరిపడ్డాడు నర్సన్. (ఇంకావుంది)

ఫ్రిజ్ లో చెడిపోవు....?

కొడుకు: నాన్నా! ఫ్రిజ్ లో పెడితే వస్తువులు చెడిపోకుండా ఉంటాయా?

తండ్రి: అవును ఏం?

కొడుకు: మన రేడియోను ఫ్రిజ్ లో పెట్టాను. మరి ఇప్పుడు పాటలు రావడం లేదే?

—కె. రాంమోహన్, అనంతపురం.

పొంచివున్న శత్రువు

ప్రతాప రవిశంకర్

రాత్రి పదకొండు గంటలు కావస్తోంది. పాతపైళ్ళను తిర
గేస్తున్న నన్ను ఫోన్ డిస్టర్బ్ చేసింది.
కుర్చీలోనించి లేచివెళ్ళి రిసీవర్ ఎత్తాను.

"డిటెక్టివ్ జగదీష్ స్పీకింగ్!"

"నాపేరు జనార్దన్. నెంబర్ పన్నెండు స్టాట్యూ రోడ్‌లోవున్న ఇంట్లోనించి మాట్లాడుతున్నాను. మీరు వెంటనే ఇక్కడకు రండి" ఆత్రంగా చెప్పాడు అతను. అతని గొంతులో భయాన్ని ఎవరయినా సులభంగా గ్రహించ గలరు.

"చెప్పండి....ఎందుకు? ఏం మాట్లాడాలి?" గబగబా అడిగాను.

"ప్లీజ్ మీరు వెంటనే బయల్దేరండి. నేనో ప్రమాదంలో వున్నాను. శత్రువు పొంచివున్నాడు" అంతే, ఫోన్ కట్ అయింది.

ఇక నేనేమీ ఆలోచించలేదు. రిసీవర్ పెట్టేసి గబగబా డ్రెస్ మార్చుకున్నాను.

లైటార్పి రూమ్ లాక్‌చేసి స్కూటర్‌మీద బయలు దేరాను.

స్టాట్యూరోడ్ నాకు బాగానే తెలుసు.

రోడ్లు అప్పటికే నిర్మానుష్యంగా వున్నాయి. ప్రస్తుతం హైద్రాబాద్ నగరంలో శాంతిభద్రతలకు లోటువున్నది. ఎప్పుడు అల్లర్లు జరుగుతాయో ఎవరికీ తెలియని కారణంగా కొన్ని వీధుల్లో జనం పొద్దుపోయిన తర్వాత తిరగడం మానేశారు.

రివ్వున దూసుకుపోతోంది స్కూటరు.

'శత్రువు పొంచివున్నాడు' జనార్దనం మాటలు నాకు పదేపదే గుర్తుకు వస్తున్నాయి.

స్టాట్యూ రోడ్‌లోకి తిరిగాను.

ఒక్కో ఇంటినెంబర్‌ని చూసుకుంటూ వెళుతున్నాను స్కూటర్ని స్లోచేసి.

నెంబర్ పన్నెండు.

స్కూటర్ ఆగిపోయింది.

దిగి లాక్ చేశాను వేగంగా....గేటు తెరిచేవుంది.

కిటికీ తలుపులు మూసివున్నాయి. లోపల్నించి సన్నని దీపం వెలుతురు బయటకు పడుతోంది. జనార్దనాన్ని పిలిచాను. కాని బదులులేదు.

తలుపు నెట్టాను. తెరుచుకున్నది.

ఒక్క క్షణం సందేహించి లోపలకు వెళ్ళాను. ముందు గది ఖాళీగా వున్నది. మధ్యగదిలోకి వెళ్ళాను.

ఆశ్చర్యం!

ఫోన్‌కు దగ్గరలో ఓ మనిషి బోర్లాపడి వున్నాడు. నా చూపు పక్కకు మరలింది. గుండె పక్కనించి గచ్చుమీద నెత్తురు కారుతోంది మెల్లగా.

కొన్ని నిమిషాల క్రితం నాకు ఫోన్‌చేసి తనని రక్షించమని అడిగిన వ్యక్తి ఇప్పుడు ప్రాణాలతో లేడు.

అతనే జనార్దనం అయుండాలి.

నలభయ్యేళ్ళలోపు వయసు. సన్నగా పొడుగ్గావున్నాడు.

ఆ గదిలో వస్తువులన్నీ చిందర వందరగా వున్నాయి.

ఎవరో ఏదో విలువయిన వస్తువుకోసం ఆ గదిని వెతికారు. ఇంతకీ ఆ వస్తువు వాళ్ళకు దొరికిందో లేదో?

చకచకా తెరచివున్న బీరువా దగ్గరకు నడిచాను. అందులో బట్టలు వున్నాయి. అన్నీ మగవాళ్ళ దుస్తులే. కింది అరలో ఏవో కాయితాలు కనిపించాయి. వాటిని పరిశీలించాను. అవన్నీ బట్టలుకొన్న బిల్లులు. వాటన్నిటి మీద జనార్దనం పేరే వున్నది.

వాటిమధ్యనే కనిపించింది చిన్న కార్డు.

చూశాను.

'హోటల్ మయూర'

దాన్ని జేబులో పెట్టుకున్నాను. మరో పావుగంటసేపు వెతికినా ఆ గదిలో నాకు హత్యకు సంబంధించిన ఎటువంటి ఆధారామూ దొరకలేదు.

ఆ విలువయిన వస్తువుకూడా దొరకలేదు.

ఇక నాపని ఒక్కటి పూర్తయినట్లే. అక్కడ పని మిగిలింది.

ఫోన్ దగ్గరకు నడిచాను. రిసీవర్ ఎత్తి పోలీస్ యిన్స్పెక్టర్ ప్రదీప్‌కు ఫోన్‌చేశాను.

2

హోటల్ మయూర.

అందమైన హోటలేగాదు. అన్ని వసతులూ వున్న విలాస నిలయం. డబ్బును విరజిమ్మితే అక్కడ దొరకని సుఖంలేదు.

రద్దీగా వుంది.

రంగుల దీపాలు అక్కడక్కడ వెలుగుతున్నాయి.

ఓ టేబుల్ దగ్గర కూర్చున్నాను.

అక్కడ మరో చెయిర్ ఖాళీగా వుంది.

విస్కీని గ్లాసులోకి వంచి ఐస్ క్యూబ్స్ వేశాడు బేరర్. గ్లాసును పైకెత్తాను. సరిగ్గా అప్పుడే వచ్చి ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నది ఓ యువతి.

గ్లాసును కిందికి దించి ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాను.

ఆమె అందం నన్ను బాగా ఆకర్షించింది.

మెరుపుతీగలా వున్నది. గులాబిరంగు వళ్ళు. పలుచని ఎర్రని పెదవులు. సన్నని ముక్కు. విశాలమైన నల్లని కళ్ళు. ఎత్తయిన గుండెలు.

సన్నగా నవ్వింది.

నేనూ నవ్వాను.

"ఇఫ్ యూ డోంట్ మైండ్. కంపెనీ ఇస్తారా?" నవ్వుతూనే అడిగాను. ఆ హోటల్లో ఎవరో ఒకరితో పరిచయం చేసుకోవటమే నా ధ్యేయం. ఆ తర్వాత జనార్దనం హత్యకేసును సాల్వ్ చెయ్యవచ్చు.

"థాంక్ యూ.... నేను హాట్ డ్రింక్స్ తీసుకోను."

"సారీ...." అని బేరర్‌ని పిల్చి రెండు కూల్‌డ్రింక్స్ తీసుకురమ్మని చెప్పాను.

"మే ఐనో యువర్ స్వీట్ నేమ్" విస్కీ తాగుతూ అడిగాను.

"సునీత"

"నా పేరు...." ఓ మారు పేరు చెప్పాలని అనుకున్నాను.

కాని ఆమె, "మీ పేరు డిటెక్టివ్ జగదీష్" అన్నది.

నిజంగా షాక్.

"ఆశ్చర్యపోకండి.... నేను మీకు తెలియకపోవచ్చు.... కాని మీరు నాకు తెలుసు....ఇంతకు ముందు రెండుమూడు సార్లు మిమ్మల్ని చూశాను.ఇప్పుడు మిమ్మల్ని కలుసుకోవటం నాకెంతో సంతోషంగా వుంది" అన్నది.

"వెల్ .... మీరు తరచుగా ఈ హోటల్‌కి వస్తూ వుంటారా?" అడిగాను.

"ఎప్పుడైనా వస్తూ వుంటాను....మీరు ఎప్పుడూ వస్తూ వుంటారా?" అడిగింది మళ్ళీ.

"రాను. నేనుకూడా మీలాగే....ఎప్పుడైనా" నవ్వాను.

కూల్‌డ్రింక్ బాటిల్‌ని తీసుకున్నది.

ఒక్కసారిగా నా పరిశోధన ఆగిపోయినట్లనిపించింది. 'హోటల్ మయూర'కు జనార్దనంకి ఏమిటి సంబంధం? అతని హత్యకీ ఈ హోటల్‌కీ ఏదయినా లింక్ వున్నదా?

ఆలోచిస్తున్నాను.

ఆమె అన్నది "నేనో ప్రయివేటు కంపెనీలో స్టెనోగా పనిచేస్తున్నాను. మనసు బావుండనప్పుడు ఇలా వస్తూ వుంటాను .... ఈరోజుకూడా నా మనసు బాగాలేదు.... అందుకే నాదో రిక్వెస్ట్."

"ఏమిటి?" ఆమె కళ్ళలోకి చూశాను.

"ఈరాత్రి మీరు నాతో గడపగలరా?"

మళ్ళీ షాక్ ....

ఎదురుగా అందాల సుందరి....నన్ను ఆహ్వానిస్తోంది.... ఈ ఆహ్వానం వెనుక ఏదయినా??

ఏమైనా సరే.

"థాంక్ యూ ...." అన్నాను గ్లాసులో మిగిలిన విస్కీని తాగేసి సంతోషంగా—

"నేను మీకు థాంక్స్ చెప్పాలి....ఐయామ్ లక్కీ" అన్నది సిగ్గుతో తల వంచుకుని.

బేరర్ బిల్లు తీసుకువచ్చాడు.

బిల్లు చెల్లించి సునీతతో బయటకు వచ్చాను. ఆమె తన రూమ్ ఎడ్రసు చెప్పింది.

స్కూటర్ స్టార్టుచేశాను. నా వెనుక కూర్చుని తన చేతులను నా నడుముచుట్టూ తిప్పి పట్టుకున్నది.

ఆమె భుజం నా వీపుకు రాసుకుంటున్నది. గిలిగింతగా వున్నది.

ఆలోచిస్తూన్నాను.... కేవలం కొన్ని నిమిషాల పరిచయంలోనే సునీత నన్ను తన గదికి ఆహ్వానించిందంటే ఇందులో తప్పకుండా ఏదో మిరకిల్ వుండితీరాలి.

ఏమిటది?

నన్ను ఎందుకోసం తన గదికి తీసుకువెళుతోంది?

నిజంగా నాతో గడపటానికేనా?

సూ్కటరు ఆగింది.

ఆమె సూ్కటర్ మీద నించి కిందికి దూకి తాళంతెరిచింది.

ఆమెతో లోపలికి నడిచాను.

దీపం వెలిగింది.

రెండు గదులు. ముందు గదిలో సింగిల్ కాట్ పరచి వుంది. దానిమీద పరుపు.

కూర్చున్నాను.

తలుపులను మూసి నా పక్కనే కూర్చుని "ఏం తీసు కుంటారు?" అని అడిగింది నా కళ్ళలోకి చూసి నవ్వుతూ.

"నిన్ను" ఆమె బుగ్గమీద చిటికెవేశాను.

"అంత తొందరరెందుకు? హార్లిక్స్ కలుపుతాను.... ఎక్కువశక్తి ...ఎక్కువ ఉత్సాహం...." అని లేచి నిల్చుని పక్కనే వున్న మరో గదిలోకి నడిచింది.

ఐదు నిమిషాల తర్వాత ఆ గదిలోనించి బయటకువచ్చి నా పక్కనే కూర్చుంటూ "నేను అందంగా వున్నానా?" అని అడిగింది నా మెడచుట్టూ చేతులువేసి.

"నువ్వు అందానికి ప్రతిరూపం" అన్నాను ఆమె ప్లాను యేమిటో ఆలోచిస్తూ.

"అయితే మిమ్మల్ని కోరుకునే నాకు నిజం చెప్పండి జగదీష్ .... మీరు హోటల్ మయూరకు ఎందుకోసం వచ్చారు? ఓ వన్నెలాడికోసమా?" అని అడిగింది నవ్వుతూ.

ఉలిక్కిపడ్డాను. ఆ ప్రశ్నలో అంతరార్థం నాకు అర్థం కాలేదు.

సునీత నవ్వి "అంత బెదురెందుకు? నాలాంటి ఓ బ్యూటీ కోసమే కదూ వచ్చింది....నాకు తెలుసు.... ఒన్ మినిట్.... హార్లిక్స్ తీసుకువస్తాను" అని మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళింది.

ఇప్పుడు సునీత నాకు బాగా అర్థమయ్యింది. ఎలాగయినా నా దగ్గర్నించి ఇన్ఫర్మేషన్ బయటకు లాగాలని ప్రయత్నం చేస్తోంది. బహుశ సునీతకూ, జనార్దనం హత్యకీ సంబంధం వుండితీరాలి.

ఆలోచిస్తున్నవాడినల్లా ఉలిక్కిపడ్డాను. ఎదురుగా గోడకు తగిలించి వున్న అద్దంలో పిల్లిలా వస్తున్న సునీత కనిపించింది. ఆమె చేతిలో ఓ మడతపెట్టిన కర్చీఫ్.

ఆమె దగ్గరగా వచ్చేసింది.

వేగంగా లేచి నిల్చున్నాను. ఆమె చేతిలో కర్చీఫ్ని సునీత ముక్కుదగ్గర వుంచి గట్టిగా నొక్కాను. రెండు నిమిషాలలో ఆమెకు స్పృహ పోయింది.

3

సునీత ప్లాను అర్థమయ్యింది.

నన్ను స్పృహలేకుండా బంధించాలనుకున్నది. ఐతే ప్లాను ప్రకారం నన్ను ఇక్కడినించి తీసుకెళ్ళటానికి ఎవరో వస్తారు.

వెంటనే లైటార్పాను.

తలుపుకు వేసివున్న బోల్టును తీసేశాను.

చీకట్లో సునీత పక్కనే బెడ్మీద కూర్చున్నాను. ఇప్పుడు నాకు అంతా అర్థమవుతోంది. ఇంతకీ జనార్దనం ఇంట్లో వాళ్ళకు ఆ విలువయిన వస్తువు దొరకలేదు. అతను ఆ వస్తువు గురించి నాకు చెప్పి వుంటాడని నన్ను తీసుకెళ్ళి నాచేత చెప్పించటానికి వ్యూహం పన్నారు.

ఎవరిదో అడుగుల చప్పుడు వినిపించింది.

వెళ్ళి గోడదగ్గరగా తలుపుపక్కనే నిలబడ్డాను సిద్ధంగా.

"సునీతా....రావచ్చునా?" చిన్నగా గరగరలాడిందిగొంతు.

"ఊఁ" మూలిగాను.

వెంటనే చిన్నగా తలుపు తెరుకుంది. ఎవడో లోపలకు వచ్చాడు. అంతే, ఎగిరి వాడిమీదకు దూకాను. ఊహించని దెబ్బకు వాడు కింద పడిపోయాడు. చీకట్లో వాడి గుండెల మీద గట్టిగా తన్నాను. మెరుపులా వాడు నన్ను వెనక్కు తోసి రివ్వున గదిలోనించి బయటకు పరుగుదీశాడు.

వాడిని తరుముతూ వెళ్ళాను. వాడు దొరకలేదు. ఇక లాభంలేదని సునీతద్వారా అన్ని విషయాలూ తెలుసుకోవచ్చు నని సునీత గదిలోకి వచ్చాను.

ఆశ్చర్యం! గదిలో సునీత లేదు. అప్పటికే ఎవరో ఆమెను అక్కడినించి తీసుకెళ్ళి పోయారు. నిజంగా ఎదురు చూడని పరిణామం!

గబగబా ఆ గది నంతటినీ పరిశీలించాను. 'జేమ్స్ అండ్ జేమ్స్ ఎంటర్‌ప్రైజెస్...ఎక్స్‌పోర్టర్స్ అండ్ ఇంపోర్టర్స్' అని లెటర్‌హెడ్ వున్న కాయితాలు కొన్ని కనిపించాయి. అంతే వాటినివదిలి బయటకువచ్చి స్కూటరు స్టార్టుచేశాను.

గబగబా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాను. అప్పుడే ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ బయటకు వెళ్ళబోతున్నాడు.

"డియర్ ప్రదీప్....జనార్ధనాన్ని హత్యచేసిన గ్యాంగ్ ఎడ్రసు దొరికింది. న్యూబోయి గూడలో వున్న 'జేమ్స్ అండ్ జేమ్స్ ఎంటర్‌ప్రయిజెస్' ఆఫీసు వాళ్ళ స్థావరం... నువ్వు వెంటనే వెళ్ళి వాళ్ళ అంతుతేల్చుకో...."అన్నాను.

"గుడ్....నీకో ముఖ్యమైన విషయం....ఇప్పుడే తెలిసింది. జనార్ధనం ఎవరో కాదు. మన సి.బి.ఐ. మనిషి. ఓ స్మగ్లింగ్ రాకెట్‌ని పట్టుకోవటానికి ప్రభుత్వం అతన్ని నియమించింది" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"అయితే నా అంచనా నిజమే....అతను వాళ్ళకు

సంబంధించిన ఆధారాలు తెలియజేసే సమాచారాన్ని తన గదిలో ఎక్కడో దాచాడు. దానికోసమే శత్రువులు అతడ్ని చంపారు. నేను అతని గదికి వెళుతున్నాను. నువ్వు నీ బలగంతో న్యూబోయిగూడ వెళ్ళు" అని అక్కడినించి స్కూటర్ మీద స్టార్ట్ రోడ్ కి బయల్దేరాను.

పది నిముషాల తర్వాత పన్నెండో నెంబర్ ఇంటి ముందు. స్కూటర్ దిగాను. ఇంటి ముందుకు వెళ్ళి ఆలోచిస్తున్నాను. ఆ వస్తువేదో ఇంట్లో లేదు. వుంటే అది ఎప్పుడో శత్రువులకు దొరికి వుండేది.

నా దృష్టి అప్రయత్నంగా గోడపక్కనే వున్న ఓ పూల కుండీమీద పడింది. అది ఒక పక్కకు ఒరిగిపోయి వుంది. అంతే. గబుక్కున దాన్ని పైకెత్తాను. నా కళ్ళు సంతోషంతో మెరిశాయి. కుండీ కింద చిన్న ప్లాస్టిక్ సంచీ వుంది. అందులో రెండు ఫిల్ము చుట్టలు వున్నాయి.

జనార్దనం తెలివైనవాడు. అయితే యేం తన ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

స్టేషన్ కి వచ్చాను.

గంటతర్వాత ఇన్ స్పెక్టర్ ప్రదీప్ స్మగ్లింగ్ గ్యాంగుతో స్టేషన్ కు వచ్చాడు.

సునీత నన్ను చూసి తల దించుకున్నది.

"ఇవిగో ప్రదీప్....ఈ ఫిల్ములకోసమే జనార్దనం హత్య చెయ్యబడ్డాడు. వీళ్ళ చరిత్ర అంతా వీటిల్లో వుంది" అన్నాను ఆ కవర్ని అతనికి ఇస్తూ.

"థాంక్ యూ జగదీష్....నీవల్ల ఓ పెద్ద స్మగ్లింగ్ గ్యాంగ్ పట్టుబడింది" అన్నాడు ఇనస్పెక్టర్.

నేను మాట్లాడలేదు....విధి నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్న జనార్దనం నా మదిలో మెదలుతున్నాడు. □

దొంగాడొచ్చాడు మర్యాద చెయ్యండి!

బి. రాజేశ్వరి



చటుక్కున మెలకువ వచ్చింది సుబ్బారావుకి.

అది మామూలు మెలకువకాదు. ఏదో విశేషముంది; తనకిలా మధ్యరాత్రిలో మెలకువ రావటం అరుదు. మంచి నీళ్ళకోసం అయితే కాదు; మరి ఎందుకిలా అకస్మాత్తుగా మెలకువ వచ్చినట్టు?

టేబిల్‌మీది రేడియం డయల్ ఒంటి గంటన్నర చూపిస్తోంది.

ఎక్కడో చప్పుడయింది. చెవులు రిక్కించాడు.

ఎవరో నడుస్తున్న అడుగుల చప్పుడు. చాలా నెమ్మదిగా, అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్న సవ్వడి!

సుబ్బారావు గుండె ఓ క్షణం ఆగి మళ్ళీ కొట్టుకుంది.

అనుమానం లేదు, ఎవడో దొంగాడి పనే!

పక్కన భార్య అమాయకంగా నిద్రపోతోంది. పక్క మంచంమీద పిల్లలిద్దరూ గాఢ నిద్రలో వున్నారు.

భార్యని లేపి చెపితే....? ఉహూ, అసలే పిరికిది! భయపడి పోతుంది.

సుబ్బారావు ఆలోచిస్తున్నాడు. తనే ధైర్యంగా లేచి వెళ్ళి ఆ దొంగని అటకాయిస్తే....? అమ్మో, వాడిదగ్గర ఏదోక ఆయుధం వుండకపోదు; దానితో వాడు తనని ఏమైనా చేస్తే....ప్రాణానికే ప్రమాదం!

వాడు వంటగదిలో తచ్చాడుతున్నాడు. వంట గదిలో నిలువైనవేమున్నాయి? రెండుమూడు బిందెలు, కొంత స్టీలు సామగ్రి వున్నాయి. అయితే అవి చాలు దొంగకి—కొంత సొమ్ము చేసుకోడానికి.

అతను యింకా వంటగదిలో నించి బయటకు రాలేదు. ఆ గదిలోంచి పడగ్గదిలోకి మధ్య తలుపుంది.

సుబ్బారావు పడగ్గది పరిశీలించాడో సారి. గదికి ఓ పక్కగా స్టీలు బీరువా వుంది. తమ సర్వస్వం అందులోనే వుంది. తన అత్తింటివాళ్ళు కూతురుకి పెట్టిన నగలు, అప్పుడు అప్పుడు భార్య తనని పోరి చేయించుకున్న గాజులు, చెవుల దుద్దులు, ఒంటిపేట ఛెయిను—అన్నీ దాదాపు పదిహేనువేల విలువ చేస్తాయి. తమకున్న ఆస్తి

అదే! అది కాస్తా యీ దొంగ దోచుకుపోతే, యిక తను జన్మలో సంపాదించుకోలేడు.

దొంగ యిప్పుడో యింకాసేపటికో యీ గదిలోకి వస్తాడు. తియ్యగలిగితే మారు తాళాలతో బీరువా తెరుస్తాడు. లేకుంటే ఏ కత్తో చూపించి తననే తాళాలు అడిగి తీసుకుని, వున్నదంతా ఊడ్చుకుపోతాడు. తను అడ్డుపడితే చంపి పారేస్తాడు.

ఇప్పుడెలా? ఈ గండం గడిచేదెలా?

టార్చిలైటు ఫోకస్ చేసిన వెల్తురు గదిలో పడింది.

ఊ, దొంగ యీ గదిలోకి వచ్చేస్తున్నాడు. చేతిలో టార్చిలైటుకూడా వుందన్న మాట!

సుబ్బారావు ప్రాణాలుగ్గబట్టుకుని కళ్ళు చికిలించి చూస్తున్నాడు.

మధ్య తలుపు చిన్నగా చప్పుడయింది. ఆ వ్యక్తి లోనికొస్తున్నాడు. మళ్ళీ ఆ వెనకే తలుపుమూసిన చప్పుడు.

టార్చిలైటు వెల్తురుకి చెయ్యి అడ్డంపెట్టి వేళ్ళసందునించి గదిలోకి ఫోకస్ చేపి గది నలుమూలలా వెతుకుతున్నాడు. గదిలో బెడ్‌లైట్ డిమ్‌గా వెలుగుతోంది. ఈ దొంగాడికి రేచీకటా, మళ్ళీ ఆ టార్చి వెల్తురు దేనికి?—అనుకున్నాడు సుబ్బారావు.

దొంగ కదుల్తున్నాడు. బీరువావైపు అడుగులు వేస్తున్నాడు. అయిపోయింది, అంతా అయిపోయింది. బీరువా తలుపులు తీసి వస్తువులు పట్టుకుపోతాడు.

సుబ్బారావుకి అంత చలిలోను చెమట్లు పోస్తున్నాయి. అరిచి నలుగుర్నీ పిలిస్తేనో? ...ఉహూఁ, వాడిదగ్గిర కత్తో మరేదో ఆయుధం వుండే వుంటుంది. దాంతో తనని ఏం చేసినా చెయ్యొచ్చు. ప్రాణంపోయాక చేసేదేంలేదు.

సుబ్బారావు బుర్ర చురుగ్గా పనిచేస్తోంది.

భార్యని లేపటానికిది అనువైన సమయం కాదు. లేకుంటే తను వాడ్ని మాటల్లో పెట్టి, భార్యని బయటికి పంపి నలుగుర్నీ లేపి రమ్మని చెప్పేవాడు. ఇప్పుడా అవకాశం లేదు.

దొంగ మారు తాళాలతో బీరువాతో కుస్తీపడుతున్నాడు. పది నిమిషాలు — యిరవై ....ముప్పై నిమిషాలు.... ఊహుఁ. తాళం రాలేదు.

దొంగ యిటు తిరిగాడు. బొడ్లోనించి ఏదో తీశాడు. గుడ్డి వెల్తుర్లో తళుక్కుమంది పొడవాటి కత్తి.

సుబ్బారావు గుండె పీచుపీచుమంది. వాడు దానితో తనని పొడిచి చంపెయ్యడు కదా!

అడుగులు వేస్తూ తమ మంచాన్ని సమీపిస్తున్నాడు.

సుబ్బారావు కళ్ళు గట్టిగా మూసేసుకున్నాడు.

దొంగ సరాసరి తన మంచం దగ్గిరకొచ్చి ఆగాడు.

తనని తట్టి లేపుతున్నాడు.

కళ్ళు తెరవాలా, వద్దా? తెరవకపోతే మరీ ప్రమాదం!

రోట్లో తల దూర్చాక ఏమయినా భరించాలిక!

సుబ్బారావు ఉలిక్కిపడి లేచినట్టు లేచాడు.

ఎదురుగా వున్న మనిషిని అప్పుడే చూస్తున్నట్టు చూసి, ఆశ్చర్యం నటించాడు.

"ఎవరు నువు?" వణుకుతున్న గొంతుతో అడిగాడు.

"కనిపించడంలా, దొంగను!" కర్కశంగా వుంది గొంతు.

"ఎందుకొచ్చావు?"

"అదేం పిచ్చిప్రశ్న!? దొంగతనానికొచ్చాను. ఏం, నీతో సరసాలాడ్డానికొచ్చాననుకొన్నావా?"

వీడి ధాష్టీకం తగలెయ్య, వెధవ జబర్దస్తీ వీడూను!
"కోప్పడకండి దొంగగారూ? ఎవరో అనుకున్నాను."
"ఊ, బీరువా తాళాలెక్కడ?"
"ఇప్పుడు వాటితో ఏం పనొచ్చింది?"
"మర్యాదగా యిలా యివ్వు. బీరువా ఓ పట్టాన తాళం తెరుచుకోటం లేదు."
"ఆ బీరువాలో ఏం లేవండి. ఏదో నావి, నా భార్యా పిల్లలవి బట్టలున్నాయి—అంతే!"
"ఆమాత్రానికి బీరువా ఎందుకు కొన్నావు? సూట్ కేసుల్లోనో ట్రంకుపెట్టెల్లోనో పెట్టుకోవచ్చుకదా బట్టలు!"
"అవుననుకోండి! ఏదో వాయిదాలమీద సులభంగా బీరువా స్వంతమవుతుంది కదా అని నా భార్య ముచ్చట పడితే కొన్నాను. ఇంకా నాలుగు వాయిదాలు కట్టాల్సి వుంది కూడా!"
"నిన్నెవడు నమ్మాడు? అందులో నిజంగా విలువైన వస్తువులేమీ లేకపోతే తాళాలివ్వడానికేం? ఓసారి తెరిచి చూసి, ఏం లేకపోతే మళ్ళీ నీ తాళాలు నీకు భద్రంగా యిచ్చేస్తాను."
"నిజంగా, ఒట్టండీ! మీకు అనవసర శ్రమ!"
"అనవసరంగా ప్రసంగం పెంచకు! నా చేతిలో ఏముందో చూశావా?" కత్తిని ఓసారి వెల్తుర్లో మెరిపించాడు.
"అయ్యో, చూడకపోవటమేమిటండీ? కత్తి చాలా పదునుగా కూడా వుంది."
"ఇది అలంకారప్రాయమనుకోకు. ఏ మాత్రం గొడవ చేసినా నేను చెప్పినట్టు వినకపోయినా యిది నీ గుండెల్లో దిగిపోతుంది."

"అంతపనిమాత్రం చెయ్యకండి. నేను మరీ అంత మొండివాడ్ని కాదు. మీరెలా చెపితే అలాగే వింటాను. నా యింట్లో విలువైన వస్తువులంటూ ఏమీలేవు. ఏదో బిందెలు గిన్నెలులాంటి స్టీలుసామగ్రి, యిదిగో ఈ బీరువా, దీనిలాగానే వాయిదాలమీద తీసుకున్న సోఫా—యివే నా ఆస్తి. నాకొచ్చే కొద్దిపాటి జీతంతోను నా భార్యా పిల్లల్ని పోషించుకుంటున్నాను. స్వంతానికి సంపాదించుకున్నదిగాని, దాచుకున్నదిగాని ఏదీలేదు. అప్పులు చెయ్యకుండా నెలలు గడిచిపోతే అంతేచాలనుకునే తత్వం నాది!"

"మిస్టర్, వుపన్యాసాలు వద్దు! పాయింట్ కి రా! నువ్వు యెక్కడ పనిచేస్తున్నావు?"

"ఇన్‌కంటాక్సు డిపార్టుమెంట్లో గుమాస్తాని. పేరు సుబ్బారావు."

"బయట నేమ్‌బోర్డ్ చూశానులే! సింపుల్‌గా 'ఇన్‌కం టాక్స్' అని వుంటే ఏదో పెద్ద ఆఫీసర్ హోదాలో వున్నావనుకున్నాను. ఉత్తగుమాస్తావన్న మాట!"

"అవునండి. మీకు ఇంగ్లీషు వచ్చునా?"

"సంస్కృతం కూడా వచ్చు. చదవమంటావా?"

"అబ్బెబ్బె వద్దండి. మీ నిజాయితీమీద నాకు నమ్మకముంది. చూస్తున్నాగా, మీరు చాలా సిన్సియర్!"

"పొగడ్తలు వద్దు. ఇన్‌కంటాక్స్‌లో పనిచేస్తూ ఏమీ సంపాదించలేదంటే ఎలా నమ్మమంటావు? యెక్కడో దాచిపెట్టి వుంటావు. అందుకే బీరువా చూడాలంటున్నాను."

సుబ్బారావు భార్య పార్వతి కదిలింది. ఎవరిదో కొత్త గొంతు వినబడి కళ్ళుతెరిచి చూసింది.

మొదట్లో ఆమెకి అతనెవరో అంత అర్ధరాత్రి యెందు

కొచ్చాడో, భర్తతో అతనికంత తీరిగ్గా కబుర్లేమిటో అర్థం కాలేదు. ముసుగు తియ్యకుండానే దుప్పటి కొసనుంచి పరిశీలనగా చూసింది. భర్త తన ఆస్తిపాస్తుల గురించి చెప్పటం, అతను బీరువా తాళాలు అడగటం వరసాగ్గా వింటోంది.

వాడు దొంగని అర్థమయిపోయింది. దొంగతో తీరిగ్గా భర్త కబుర్లాడటం చూసి ముందు విస్తుపోయినా, భర్త ఆంతర్యం అర్థమయిపోయింది. అవకాశం చూసుకుని దొంగని పట్టుకోవాలని భర్త వాడిని మాటల్లో పెట్టాడని గ్రహించింది. తనవంతు నటన తనూ ప్రదర్శిస్తే భర్తకు మరింత సపోర్టింగ్‌గా వుంటుందని తనూ రంగంలోని దిగింది.

"ఏం తాళాలిమ్మంటే అలా వెర్రిచూపు చూస్తారేం! నేను కత్తి నుపయోగించనని ధైర్యమా?"

"అబ్బెబ్బె. అదేంలేదండి. తీరా ఎంతో ఆశతో బీరువా అంతా వెతికి అనవసరంగా ఆయాసపడతారని ముందుగానే వద్దంటున్నాను, అంతే!"

పార్వతి అప్పుడే నిద్ర లేచినదానిలా లేచికూచుని "ఎవరండీ, బంధువులా? మీ తరపు బంధువులా ఏమిటి ఎప్పుడూ చూపినట్టులేదే!" అన్నది.

సుబ్బారావు తడబడుతున్నట్టుగా "అవును పారూ! ఈయన మనకు కావలసినవాడే! నేను కూడా యిదివరలో చూడలేదులే. ఇప్పుడే పరిచయాలయ్యాయి" అన్నాడు.

"అలాగా, అయ్యో నిలబడే మాట్లాడుతున్నారేమిటండీ భలేవారే! చూడు బాబూ, అలా పిల్లలున్న మంచంమీద కూచో! ఈ గదిలో కుర్చీలవీ లేవు" అన్నది పార్వతి నొచ్చుకుంటూ.

"ఈ మర్యాదలకోసం కాదు నేనొచ్చినది. మర్యాదగా తాళాలు యిచ్చుకుంటే బావుంటుంది" అన్నాడు దొంగగారు పార్వతివంక చూడలేనట్టు—సుబ్బారావు నుద్దేశించి.

"బీరువా తాళాలా, దేనికి బాబూ?"

"నీకు మళ్ళీ మొదట్నుంచి చెప్పాలనుకుంటాను. నేను దొంగని. అవసరమైతే హంతకుడ్ని కూడా అవుతాను" పార్వతికి కత్తి చూపించాడు దొంగ.

"ఊరుకో అబ్బాయ్, అవేం మాటలు? నిన్ను చూస్తుంటే పెద్దింటి బిడ్డలా వున్నావు. నీకు దొంగతనాలు, హత్యలు చెయ్యాల్సిన ఖర్మేం?"

"నా సహనాన్ని పరీక్షించవద్దు. నేనసలే మంచివాడ్ని కాదు."

"చెడ్డవాడెవడూ తను మంచివాడ్ని కాదని చెప్పుకోడు. తప్పకుండా నువ్వు మంచివాడివే!"

"వాదనలతో టైం వేస్టుచెయ్యొద్దు. నేనడిగినవి ఇచ్చి పంపించండి ముందు."

"అలానే బాబూ! నీ మాటెందుకు కాదనాలి? బీరువా పేరుకేగాని అందులో ఎర్రని ఏగాణీలు లేదు. ఏ గాణీలు యిప్పుడు లేవు కదా అన్నట్టు—ఎర్రటి పైసలు కూడా లేవు; పది పైసలు కూడా లేవు నాయనా అందులో. కట్టెను కొట్టి, పొయ్యిలో పెట్టు! ఈయనగారి ఒకడి సంపాదన యింట్లో అవసరాలకే చాలదు. ఇంకా సేవింగ్సు కూడానా! చూసుకో నాయనా అనుమానం తీరిపోతుంది."

"మీ ఆయన బొత్తిగా అమాయకజీవిలా వున్నాడు. ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంటులో పనిచేస్తూ ఆ మాత్రం వెనకెయ్యలేకపోయాడా?"

"అలా గడ్డిపెట్టు బాబూ! నీ కడుపు చల్లగా ఎంత చక్కటి

సలహా యిచ్చావు. నేను నెత్తీ నోరు కొట్టుకుంటాను, ఏదో దీపముండగా యిల్లు చక్కబెట్టుకోవాలండి, పిల్లలు ఎదిగొస్తున్నారు. రేపు వాళ్ళ చదువులకి వాటికీ బోలెడు డబ్బు కావాలి. ఇప్పట్నించి సంపాదించి దాచుకోకపోతే ఎలా— అని!

కాని ఈయన బొత్తిగా అసమర్థుడు. అన్యాయార్జితం వద్దంటారు. ఎంగిలికూడుకు ఆశించకూడదంటారు. ఇవాళ ఒకడి దగ్గర పదిరూపాయలు తీసుకుంటే మనవి, వంద పోతాయంటారు. లేదా పిల్లలకో మనకో ఆరోగ్యం పాడయిపోతుందంటారు. నేను గాబట్టి యిలాంటి మొండి మనిషితో నెగ్గుకొస్తున్నాను గాని, మరొకతె అయితే ఎప్పుడో ఆత్మహత్య చేసుకు చచ్చేది!"

"చూడగానే అనుకున్నాను యిది అలాంటి కేసేనని! ఏమయ్యా, బొత్తిగా అంత మడికట్టుక్కూచుంటే ఎందుకూ పనికిరావు—మనిషన్నాక లౌక్యం, నేర్పరితనం, డబ్బు సంపాదించడం తెలిసుండాలి. మనిషిజన్మ యెత్తగానే సరి కాదు!"

సుబ్బారావు తలదించుకుని సీరియస్‌గా కాలివేళ్ళని లెక్కించుకుంటున్నాడు.

దొంగగారు పార్వతివంక జాలిగా చూపి "నిన్ను చూస్తే జాలేస్తున్నది. ఇలాంటి మొగుడితో యెలా కాపురం చేస్తున్నావోగాని!" అన్నాడు.

పార్వతి కొంగుతో కళ్ళొత్తుకుని "ఇన్నాళ్ళకి నన్నర్థం చేసుకున్న మనిషివి నువ్వొక్కడివే కనిపించావు నాయనా! ఏ అమ్మకన్న బిడ్డవోగాని వెయ్యేళ్ళు వర్ధిల్లు!" అన్నది.

దొంగగారు మెలికలు తిరిగిపోయాడు.

"బాబూ! నువ్వు చూడబోతే పెద్దింటి బిడ్డలా వున్నావు.

నీకీ చీకటిపనులు చెయ్యాల్సిన కర్మేమిటి?" అతని 'మూడ్' చూసిన పార్వతి చిన్న చురక వేసింది.

"ఏం చెయ్యమంటావమ్మ, ఉద్యోగం దొరకనేలేదు. ఉద్యోగానికి సరిపడా చదువుందిగాని ఉద్యోగమిచ్చే నాథుడే దొరకలేదు. నా అన్నవాళ్ళు లేరు. నా బతుకు నేను బత కాలి కదా! అందుకే విసిగిపోయి యీ వృత్తి యెన్ను కున్నాను."

"సెల్ఫ్ ఎంప్లాయిమెంటన్న మాట!" అనేసి, దొంగ గారు కోరగా చూడటంతో సర్దుకున్నాడు సుబ్బారావు.

"అలా కూర్చో నాయనా! నిన్ను చూస్తుంటే మా పెద్దతమ్ముడు గుర్తొస్తున్నాడు. వాడూ ఇలాగే ఉత్త ఆవేశం. మొండి. తాననుకున్నది సాధించితీర్తాడు. అదిసరే, భోజనం చేశావా?"

"రాత్రిళ్ళు భోజనం చెయ్యను. భోంచేస్తే మత్తు వస్తుంది. దొంగకి మత్తు, ప్రమత్తత పనికిరావు. చురుగ్గా, అలెంటిక్‌గా వుండాలి. అందుకే రాత్రిళ్ళు భోం చెయ్యను."

"అలాగా. అయ్యో పాలుకూడా తోడువేసేశాను. పోనీ నాలుగు చపాతీలు చేస్తాను తింటావా?"

"అక్కర్లేదమ్మా. వచ్చేముందు టిఫిన్ తినే వచ్చాను."

"ఎప్పుడు తిన్నావో, ఏమో వుండు నాయనా కాస్త పిండి కలుపుతాను."

"వద్దు వద్దు ఇప్పుడేమీ వద్దు" అభిమానపడిపోయాడు దొంగగారు.

"ఫరవాలేదు నాయనా, మనలో మనకేమిటి?" చొర వగా, ఆప్యాయంగా అన్నది పార్వతి.

"పిల్లలకోసం తెచ్చిన ద్రాక్షపళ్ళు, అరటిపళ్ళు ఉన్నాయి

అవి పెట్టకూడదూ?" అన్నాడు సుబ్బారావు ఆతిథ్యంలో తన్మా ఏం తీసిపోలేదన్నట్టు.

"ఊరుకోండి. అలాంటి చిరుతిళ్లు ఆకలి తీరుస్తాయా ఏమిటి? మరీ విడ్డూరం."

"ఇప్పుడేమీ వద్దమ్మా! నాకు ఆకలిగాలేదు. నా మాట నమ్మ!" అన్నాడు దొంగగారు.

"మరీ అంతగా బలవంతపెట్టంలే, ఆకలిగా వుంటే మాత్రం మొహమాటపడి కడుపు కాల్చుకోకు!" ఆదరణగా అంది పార్వతి.

"అబ్బే మొహమాటం ఏంలేదు."

"నేను నీ అక్కలాంటిదాన్ని. నా దగ్గిర మొహమాట పడవనుకో! అన్నట్టు యిందాకా నా అన్నవాళ్ళెవరూ లేర న్నావు. ఏం నాయనా అమ్మ, నాన్న, అక్క, చెల్లి-ఎవరూ లేరా నీకు? ఏమనుకోకపోతే నీ కథ వినాలని వుంది" అన్నది పార్వతి.

"చెప్పాను కదా! నాకెవరూలేరు. నాన్న నా చిన్నతనం లోనే చనిపోయాడు. అమ్మ మొన్నమొన్నటి వరకు బతి కుంది. నన్ను డిగ్రీ చదివించింది. తను అక్కడ ఇక్కడ కూలి నాలి చేసి నన్ను పోషించింది; చదివించింది. కాని ఎన్నాళ్ళకీ నాకు ఉద్యోగం రాలేదు. అమ్మ ఒంట్లో యిక పనిచేసి సంపాదించే ఓపికలేదు. నేను అటు ఉద్యోగమూ లేక, ఇటు కూలిపనీ చెయ్యలేక మధ్యలో నలిగిపోయాను. ఆకలిబాధ తట్టుకోలేక, అమ్మని పస్తులుంచలేక ఒక రోజు దొంగతనం చేశాను. అదీ చాలా స్వల్పం. రెండు రొట్టెముక్కలు! కొత్తకావటంతో పట్టుబడిపోయాను. పోలీసులు లాకప్‌లో పడేశారు. అమ్మకి యీ విషయం

తెలిపింది. అన్నాళ్ళ తన కష్టమూ ఎందుకు కొరగాకుండా పోయినందుకు, నేను దొంగగా మారినందుకు గుండె పగిలి చచ్చిపోయింది. అప్పుడే నా గుండె రాయి చేసుకున్నాను.

విడుదలయి వచ్చాక దొంగతనమే వృత్తిగా యెంచుకున్నాను. ఎన్నో దొంగతనాలు చేశాను. ఇప్పుడు నాకే లోటూలేదు. కావాలసినంత సంపాదించాను. ఇంకా సంపాదిస్తున్నాను. పెట్టుబడిలేని వ్యాపారం నా దృష్టిలో యిదొక్కటే! ఇప్పుడు నేనే నలుగుర్ని పోషించగల స్థితిలో వున్నాను. నేనెన్నుకున్న దారి తప్పంటావా, చెప్పమ్మా?

ఇప్పుడు నీ భర్తే వున్నాడు. నిజాయతీ, ఉద్యోగ ధర్మం అంటూ మడికట్టుకుని ఏం సంపాదించగలిగాడు? నీకు రెండు తులాల వస్తువు చేయించగలిగాడా? పోనీ మంచి మంచి చీరలు కొనగలిగాడా? నీ పిల్లలకి మంచి చదువు చెప్పించగలడా? మంచి బట్టలు కొనగలడా? వచ్చే జీతం తిండికే చాలనపుడు యిక యివన్నీ యెక్కడ నుంచి కొంటాడు.

అందుకే న్యాయానికి యివి రోజులుకావు. పాపం, అన్యాయం అని కూచుంటే పస్తులేగతి! నాలాగా తెగించి దోచుకున్నవాడిదే రాజ్యం! వాడికి యీ లోకంలో తిరుగు లేదు. డబ్బు సంపాదించటమే ముఖ్యం, ఎలా సంపాదించామన్నదికాదు. డబ్బున్నవాడికి యీ లోకం దాసోహమంటుంది. వాడెంత దుర్మార్గుడైనా, పాపాత్ముడైనా వాడికి సలాం కొడుతుంది; జేజేలు చెపుతుంది. ఒప్పుకుంటావా?"

ఊపిరి పీల్చుకోవటానికి ఆగాడు దొంగగారు.

పార్వతి ఎంతో శ్రద్ధగా, ఆదరంగా అతను చెప్పిన

దంతా విన్నది.

ఈ మధ్యకాలంలో సుబ్బారావు కాసేపు అటు యిటు యిబ్బందిగా కదిలాడు. ఈ గజదొంగిని యెలా పట్టుకోవాలా అన్న అలోచనలతో సతమతమవుతున్నాడు.

టైం చూడబోతే యింకా మూడుగంటలు దాటలేదు. మరో రెండు గంటలకుగాని తెల్లారదు. ఆ రెండు గంటలూ ఈ దొంగగార్ని కథలు కబుర్లు చెప్పి ఆపితే, వాడ్ని చాలా సునాయాసంగా పోలీసులకు అప్పచెప్పెయ్యొచ్చు. అప్పటికి జనం లేచి తిరుగుతుంటారు, అరవగానే పరుగెత్తుకొస్తారు. దొంగగారు తప్పించుకోలేడు!

"ఏమిటి చాలా సీరియస్‌గా ఆలోచించేస్తున్నావు? నేను చెప్పింది తలకెక్కిందా లేదా యింకా?" అథార్టీగా అన్నాడు దొంగగారు సుబ్బారావు నుద్దేశించి.

"ఎందు కర్థం కాలేదండీ, బాగా నే|అర్ధమయింది. నిజం నిజం! డబ్బులేనివాడికి యీ లోకంలో గౌరవంలేదు. వాడి మాటకు విలువలేదు. నన్నడిగితే నీ పనే బావుంది. పెట్టుబడిలేదు. సంపాదన వేలమీద, లక్షలమీద కూడా వుంటుంది...."

"నీలాంటి కేసులు తగిల్తే నా పని దివాళాయే!" మధ్య జోక్ చేశాడు దొంగగారు.

నవ్వు రాకపోయినా ఫెళ్ళున నవ్వాడు సుబ్బారావు.

"భలేవారండీ మీరు! చక్కగా జోక్ వేస్తారు!" అన్నాడు ప్రశంసగా.

"నాకయితే నిన్ను చూస్తుంటే ఓ ఆలోచన వస్తోంది" అన్నది పార్వతి దొంగగార్ని ఉద్దేశించి.

"ఏమిటది?"

"నువ్వు చేస్తున్న పని లాభసాటిగా వున్నమాట నిజమే గాని, దాంతో బాటే రిస్కు కూడా చాలావుంది."

"ఏమిటిది? దొరికిపోతా ననేగా!"

"అవును. జనానికి దొరికిపోతే పులుసులోకి యెముక లేకుండా సున్నం చేసేస్తారు. తర్వాత పోలీసులకి అప్ప చెపుతారు. అ తర్వాత జైలు....శిక్ష...."

"పోలీసులా?" పడిపడి నవ్వారు దొంగగారు. "పోలీసులు నన్నేం చేస్తారు? నాకు తెలీకడుగుతాను, నా కన్న పోలీసులు ఏందులో తీసిపోయారు?"

మళ్ళీ నవ్వాడు దొంగగారు.

"వాళ్ళకి నేను ఎప్పుడూ లోటు చెయ్యను. కిందవాడి నుంచి పైవాడి దాకా నేను ఫార్మాలిటీస్ చూసుకుంటాను. ఆమాటకొస్తే నాకెన్నో విషయాల్లో సాయంచేసేదే వాళ్ళు! అప్పుడప్పుడు గూర్ఖాలు కూడా శక్తి వంచన లేకుండా నాకు సాయపడుతుంటారు. నేను వాళ్ళకీ ఏం లోటు చెయ్య ననుకో! వాళ్ళని సంతృప్తి పరుస్తూంటాను" అన్నాడు దొంగగారు.

పార్వతి కూడా నవ్వింది.

"నేను చెప్పాలనుకున్న విషయం మరొకటి. నువ్వు పోలీసుల విషయం తేగానే అది అడుగున పడిపోయింది."

"ఏమిటది?"

"మరేంలేదు. నువ్వింకా పెళ్ళిచేసుకోలేదు కదూ!" అన్నది పార్వతి.

పెళ్ళిమాట వినగానే మళ్ళీ మెలికలు తిరిగిపోయాడు దొంగగారు.

"అవును, యింకా చేసుకోలేదు."

"ఇంకా అంటున్నావు. అంటే చేసుకోవాలని నీకూ మనసులో గాఢంగా వుందన్నమాటే కదా!"

"ఎందుకుండదమ్మా! నేనూ మనిషినేగా."

"అచ్చా! మంచిమాటన్నావు. నువు వెంటనే పెళ్ళి చేసుకో; మంచి అమ్మాయినిచూసి!"

"ఎందుకలా అంటున్నావు?"

"అప్పుడు నువు యీ వృత్తి చాలా తొందరగా, తేలికగా వదిలేస్తావు. ఆ నమ్మకం నాకుంది!"

"అదెన్నటికీ జరగదు. అయినా నే నీ వృత్తి ఎందుకు వదులుకోవాలి? అందునా పెళ్ళయ్యాకనే వదిలేస్తానని ఎందుకనుకొంటున్నావు?"

"ఎందుకా? నేను స్త్రీని కనుక! ఆడదాని మనసు నాకు తెలుసుగనక! ఏ ఆడదీ తన పసుపు కుంకుమలను వదులుకోవటానికి యిష్టపడదు. దొంగ భార్యకానీ, హంతకుడి భార్యగానీ, మరెవరి భార్యగానీ—ఆడదానికి తన అయిదవతనం కన్న మించింది లేదు! నువు దొంగతనాలు చేస్తూ ఎవడిచేతులోనయినా మరణిస్తావంటే నీభార్య సహించదు! నీ వృత్తికి గుడ్‌బై చెప్పిస్తుంది!" ఆగింది పార్వతి.

దొంగగారు ఆలోచనలో పడ్డారు.

"నువ్వుకూడా 'నా' అనేవాళ్ళంటూ యేర్పడితే యీ వృత్తిలోని 'రిస్క్'ని భరించటానికిష్టపడవు. నీ భార్యతోబాటు, పుట్టుకొచ్చే పిల్లలు నీకు బతుకుమీద మమకారం పుట్టిస్తారు. దాంతో నీకు యీ వృత్తిమీద, దీంట్లోవున్న రిస్క్‌మీద రోత పుడుతుంది. జీవించటానికి ఎన్నోమార్గా

లున్నాయి. అందులో ఒకటి—సంఘంలో విలువ వున్నది పరువున్నదీ—ఎన్నుకుంటావు. ఇప్పటికే ఎంతో కొంత సంపాదించి వుంటావు కాబట్టి నీకు పెట్టుబడికి లోటుం డదు. పెట్టుబడిలేని వ్యాపారం వదిలేసి, పెట్టుబడి పెట్టే వ్యాపారం మొదలెడతావు. ఏమై రైట్?" అన్నది పార్వతి లాయర్‌లా ఫోజుపెట్టి.

దొంగగారు అవునన్నట్టు తలూపాడు.

"నువు చెప్పింది వాస్తవంగానే వుందమ్మా! నేనిన్నాళ్ళు యివన్నీ ఆలోచించలేక పోయాను. నేను పోయినా బాధ పడే వాళ్ళుగాని, నష్టపోయే వాళ్ళుగాని ఎవరూ లేకనే నే నీ వృత్తిలో దిగా ననిపిస్తోందిప్పుడు. అందుకే యిన్నాళ్ళు కత్తిమీద సాములాంటి యీ వృత్తిలో నిర్భయంగా, నిరా టంకంగా నెగ్గుకొచ్చాను. పెళ్ళయిం తర్వాత యింత చొరవా, యింత రిస్కూ తీసుకోలేనని నాకూ అని పిస్తోంది" అన్నాడు.

"చూశావా! నువ్వూ నా పాయింట్‌లోకే వచ్చావు. నా మాటక్కూడా విలువిస్తే సంతోషిస్తాను" అన్నది పార్వతి.

సుబ్బారావు దొంగగార్ని పట్టుకోవటం విషయం వది లేసి వాళ్ళిద్దరి సంభాషణా ఆసక్తిగా వింటున్నాడు. ఓ పక్క భార్య చాతుర్యానికి, మాటకారి తనానికి మురిసి పోతున్నాడు. ఇన్నాళ్ళుగా కాపరం చేస్తున్నా పార్వతి హృదయపు లోతు తెలుసుకోలేక పోయాడు. నిజంగా పార్వతి చాలా తెలివయినది.

"ఈ యిద్దరేనా నీ పిల్లలు?" నిద్రపోతున్న పిల్లలవంక చూసి అడిగాడు దొంగగారు.

"అవును బాబూ. ఓ పాప, ఓ బాబు. అంతటితో

సరి!"

"ఇంకా ఎందుకులే! అందులోను ఇలాంటి బావగారితో కాపరమంటే చెప్పేదేముంది? నే వస్తానమ్మా!"

"అయ్యో! అపుడే వెళ్ళిపోతున్నావా? కాసేపట్లో పాల వాడు వస్తాడు. కాస్త నా చేతికాఫీ తాగి వెళ్ళకూడదా?"

"అబ్బెబ్బె. అదేంవద్దు. దొంగనని కూడా సంకోచించ కుండా యింట్లో మనిషిలాగా మర్యాదగా, ఆత్మీయంగా మాట్లాడావు. నాకో దారి చూపించావు. నీ మేలు మరచి పోలేను. నన్ను తోబుట్టువుగా ఆదరించావు. మరి నా తోబుట్టువుకి నేనేదోకటి సంతోషంగా యివ్వాలికదా! ఇదిగో యిది వుంచు!" అంటూ తన మెళ్ళోవున్న పులిగోరు పతక మున్న చెయిన్‌తీసి పార్వతి చేతిలో పెట్టాడు దొంగ.

"తీసుకోవటానికి సంకోచించకమ్మా! ఇది దొంగ సొమ్ముకాదు. ఇది మా అమ్మ గొలుసు. పస్తులతో బాధ పడినా దీన్ని ఎన్నడూ అమ్మటానికి ఒప్పుకోలేదు అమ్మ. ఇదిప్పుడు ఓ మంచిపనికి ఉపయోగపడుతుందంటే అమ్మ ఆత్మ సంతోషిస్తుంది. నీ పాపకు దీంతో ఏమైనా చేయించు. మామయ్య యిచ్చాడని చెప్పు!" అంటూ దొంగగారు హడా విడిగా బయటకి వెళ్ళిపోయాడు.

పార్వతి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. తను అను కున్న దానికన్న ఎంతో ఎత్తున వున్నాడు యీ దొంగ! పెద్దమనుషులుగా చలామణీ అయే ఘరానా దొంగలు ఇతని ముందు ఎందుకూ పనికిరారు! ఇక యిత నెన్నటికీ దొంగ తనం చేయడు! అతను వెళ్ళినవైపే చూస్తూండిపోయింది పార్వతి!

సుబ్బారావు భార్యవంక, ఆమె చేతిలోని బంగారు చెయిన్‌వంక మార్చి మార్చి చూస్తూండిపోయాడు. □

గంజాయి స్మగ్లరు

ఎమ్.వి.వి. సత్యనారాయణ

అతడు పరుగెత్తుతోన్నాడు.

కాళ్ళు తడబడుతున్నాయి. కాళ్ళకివున్న స్లిప్పర్స్ జారి పోతున్నాయి.

అతడు ఆగాడు. స్లిప్పర్స్ పరుగుకు ఆటంకంగా వున్నాయి. కాళ్ళు ఒక్కొక్కటీ ఎత్తి విసిరికొట్టాడు.

స్లిప్పర్స్ ఎడాపెడా పడ్డాయి.

అతడి ప్రక్కగా సర్ మని చప్పుడయింది.

అతడు వులిక్కిపడ్డాడు. శత్రువు తనమీద తుపాకీ కాల్చాడు. అంటే శత్రువు తెగించాడు.

అతడు తిరిగి పరుగెత్తడం మొదలుపెట్టాడు.

అతడివెనుక మరలా తుపాకీ ప్రేలింది. చప్పుడుకంటే ముందే అతడికి పిక్కలో నిప్పురవ్వ దూరినట్టయింది. కొన్ని క్షణాలపాటు అతడు నిర్ఘాంతపోయాడు.

కాలు సలుపుతోంది. వెచ్చగా నెత్తురు కారుతోంది. పాంటు తడుస్తోంది.

అతడు తిరిగి పరుగు లంకించుకున్నాడు.

ప్రక్క వీధిలోకి తిరిగాడు. రోడ్డుకు ప్రక్కగా చిన్న పెంకుటిల్లు. పెంకుటిల్లు ప్రక్కగా ఇరుకుసందు. అతడు సందులో ప్రవేశించాడు. చిన్న డాబా యింటిముందు ఆగాడు.

తలుపు తోశాడు. సులువుగా తెరుచుకుంది.

గదిలో ప్రవేశించాడు. బల్ల వద్దకు నడిచాడు. టెలిఫోన్ సెట్టుమీద చెయ్యివేశాడు.

మనిషి వణుకుతోన్నాడు.

అతడు నిలబడినచోట నెత్తురు మడుగు కడుతోంది.

రిసీవర్ ఎత్తాడు. నంబర్ డయల్ చేశాడు. అవతలకు రింగ్ వెళుతోంది.

నిమిషం తర్వాత అవతల రిసీవర్ ఎత్తారు.

"హలో....డిటెక్టివ్ శిరీష్ స్పీకింగ్ హియర్!"

"డిటెక్టివ్‌గారూ! నాలుగురోజుల క్రితం మీ దగ్గరకు వచ్చాము."

"ఏం పనిమీద?"

అతడు ఉద్వేగంగా ఏదో చెప్పబోయాడు.

అతడి వెనుక అలికిడయింది. అతడు చటుక్కున తల తిప్పబోయాడు. అప్పటికే ఆలస్యమైపోయింది. అతడి తలమీద బలమైన దెబ్బ పడింది. రిసీవర్ చేతిలోంచి జారి పడింది.

అతడు చిన్న మూలుగు మూలిగి పడిపోయాడు.

2

డిటెక్టివ్ శిరీష్‌కి బద్ధకం వదిలిపోయింది. తనతో మాట్లాడుతోన్న వ్యక్తి తన ప్రశ్నకు జవాబు చెప్పవలసి వుంది. టెలిఫోన్ రిసీవర్‌లో ఏదో కదలిక విన్పించింది.

"టక్ ....." ఏదో దేనిమీదో పడిన చప్పుడయింది.

చిన్న మూలుగు.

శిరీష్ రిసీవర్‌లోకి చూశాడు. నుదురు చిట్లించాడు. తనతో మాట్లాడిన వ్యక్తికి ప్రమాదం ముంచుకువచ్చింది. తనతో మాట్లాడబోయి అతడు ప్రమాదం కొని తెచ్చుకున్నాడు.

అతడు నాలుగురోజుల క్రితం తనను కలుసుకోవడానికి వచ్చాడట!

అతడు ఎవరో తెలుసుకునేముందు అతడి కేమయిందో తెలుసుకోవడం తన కర్తవ్యం.

రిసీవర్‌ను బల్లమీద పెట్టాడు శిరీష్.

బల్లమీది రెండో టెలిఫోన్ సెట్టును దగ్గరకు లాక్కున్నాడు. డయల్ చేశాడు.

"టెలిఫోన్ ఎక్స్‌చేంజ్!" అంది సున్నితమయిన గొంతు.

"గుడ్‌నైట్. 532118 కి ఫోన్ ఎక్కడినిండి వచ్చిందో చెబుతారా?"

"ఒక్క క్షణం...." అవతల నిశ్శబ్దం.

"మీకు 576491 నుండి కాల్ వచ్చింది."

"అడ్రసు చెబుతారా?"

"పది-ఎ-దండపాణి వీధి."

"థాంక్యూ!" రసీవర్ పెట్టేశాడు శిరీష్.

మొదటి సెట్టుమీదకూడా రిసీవర్‌ను క్రెడిల్ చేశాడు. వాచీ చూసుకున్నాడు. రాత్రి పదకొండు గంటలయింది. కన్సల్టింగ్ రూములోంచి బయటకు నడిచాడు.

నైట్ గౌనులోంచి డ్రస్‌లోకి మారాడు.

గదికి తాళంపెట్టి బయటకు కదిలాడు.

గారేజిలోంచి డాట్సన్‌కారు బయటకు తీశాడు.

కారు శరవేగంతో రోడ్డుమీద పరుగెత్తుతోంది. దండపాణి వీధిలోకి తిరిగింది. చీకట్లో ఇళ్ళ నెంబర్లు కనిపించడం లేదు. రోడ్డుమీద కారు ఆపాడు.

ఇళ్ళ నెంబర్లు చూసుకుంటూ నడవసాగాడు.

చిన్న పెంకుటింటిముందు ఆగాడు. దాని నెంబర్ 10. సందులోంచి లోపలకు నడిచాడు.

డాబా యింటినెంబర్ 10-ఎ.

శిరీష్ యింట్లోకి పరిగెత్తాడు. గదిలో లైటు వెలుగుతోంది. బల్లముందు నేలమీద అతడు బోర్లగిలా పడివున్నాడు. అతడిచుట్టూ నెత్తురు మడుగు కట్టివుంది. తలలోంచి నెత్తురు కారుతోంది.

పాంటు రక్తంతో తడిపివుంది.

అతడి మొహం ఒక ప్రక్కకు తిరిగివుంది. మొహం వద్ద వంగిచూశాడు. అతడి మొహం తనకి పరిచయమయినదే! నాలుగురోజుల క్రితం తనవద్దకు వచ్చాడు. అతడి పేరు చక్రధరం. గంజాయి స్మగ్లరు.

రోడ్డుమీద ఏదో వాహనం ఆగింది. చకచక యెవరో రోడ్డుమీద దూకడం వినిపిస్తోంది.

శిరీష్ గదిలో చుట్టూ చూశాడు.

గదిలో ఏమీ అనుమానించదగిన వస్తువులు దొరకలేదు.

గదిలోంచి బయటకు నడవబోయాడు.

పోలీసులు గుమ్మంలో ప్రత్యక్షమయ్యారు.

శిరీష్‌నిచూసి క్రయింబ్రాంచ్ యిన్‌స్పెక్టర్ కుమార్ కళ్ళెగరేశాడు.

3

పరాత్పరం కాలుకాలిన పిల్లిలాగా తిరుగుతోన్నాడు. తన భార్య కమలవేపు చూశాడు.

ఆమె తల వొంచుకుని ఏడుస్తోంది.

"ఏమండీ! మన వనజకి ఏమయిందండీ?" వెక్కుతోంది కమల.

పరాత్పరం పిచ్చివాడిలాగా చూశాడు.

"కాలేజీకి వెళ్ళాను. మిగతా పిల్లలతోబాటు బయలు దేరిందట. అంతకుమించి ఎవరూ ఏమీ చెప్పలేకపోయారు" అన్నాడు పరాత్పరం.

"ముకుందంగారి యింటికి వెళ్ళిందేమో!"

పరాత్పరం మొహంలో క్షణంపాటు దైన్యం మాయ మయింది.

అయినా అతడి మొహంలో భయసందేహాలు దోబూచు లాడాయి.

గుండె దిటవు చేసుకున్నాడు. టెలిఫోన్ బల్ల వేపు నడిచాడు.

ముకుందంగారి యింటికి ఫోన్ చేశాడు. ఫోన్ రింగ్ వెళ్తోంది. ఎంతసేపు గడిచినా ఎవరూ ఎత్తడంలేదు.

పరాత్పరం రిసీవర్‌ని అలాగే బల్లమీద పెట్టాడు. కుర్చీ దగ్గరకు లాక్కుని కూర్చున్నాడు.

అయిదు నిమిషాలు దాటాయి కాని, అవతల యెవరూ ఫోన్ తీయలేదు.

పరాత్పరం విసుగెత్తి పోయాడు.

"వెళ్ళి చూసివద్దామా?" అన్నది కమల.

పరాత్పరం కారు తీశాడు.

భార్యాభర్తలు ముకుందంగారి యింటికి వెళ్ళారు.

ముకుందంగారి యింటికి తాళంపెట్టి వుంది. ప్రక్క యింట్లో దర్యాప్తు చేశాడు పరాత్పరం.

"వాళ్ళ అమ్మాయి ఇంతవరకూ కాలేజీనుండి రాలేదుట. కంగారుపడ్డారు. వెతకడానికి వెళ్ళారు" అన్నాడు ప్రక్కింటాయన.

"పోలీస్ కంప్లయింట్ యిద్దామా?" అడిగాడు పరాత్పరం.

కమల మాట్లాడలేదు.

పరాత్పరం ప్రక్కింటాయనకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. కారు బయలదేర తీశాడు.

పోలీస్ స్టేషన్ ముందాగింది కారు.

ముకుందం పోలీస్ స్టేషన్‌లో వున్నాడు. అతడి భార్య యేడుస్తోంది.

రైటర్ వాళ్ళకు కాగితాలు ఇచ్చాడు.

పరాత్పరం, ముకుందం కంప్లయింట్ రాశారు.

రైటర్ వాళ్ళవద్దనుండి కాగితాలు తీసుకున్నాడు.

"మీ రెండు వుత్తరాలతో తప్పిపోయిన పిల్లల సంఖ్య పదహారు" అన్నాడు రైటర్.

పరాత్పరం నోరావులించాడు.

ముకుందం భార్య స్పృహ తప్పిపోయింది.

పరాత్పరం దంపతులు ఆమెకు పరిచర్యలు చేశారు. పావుగంట తర్వాత పరాత్పరం కారును యింటి దగ్గర ఆపాడు. ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి.

పరాత్పరం అనుమానంగా యింట్లోకి నడిచాడు. కమల అతడిని అనుసరించింది. వనజ ఎదురువచ్చింది.

"ఎక్కడకు వెళ్ళిపోయారు?" అడిగింది వనజ.

పరాత్పరం, కమలా మొహాలు చూసుకున్నారు.

"కాలేజీ విడిచిపెట్టగానే యెక్కడికి వెళ్ళావు?" అడిగాడు పరాత్పరం.

వనజ నిర్మలంగా నవ్వింది. "బీచ్‌కి వెళ్ళాలనిపించింది. వెళ్ళాను."

"నువ్వు ఒక్కతెవేనా?"

"అవును ఒక్కతెనే."

"ముకుందంగారి అమ్మాయి రాలేదా?"

"లేదు."

"నువ్వు రమ్మని అడగలేదా?"

"ఏమో అడగాలనిపించలేదు!"

బల్లమీద టెలిఫోన్ మ్రోగింది. అవతల ముకుందం మాట్లాడుతున్నాడు.

పరాత్పరం రిసీవర్ పెట్టేసి నుదురు తుడుచుకున్నాడు.

"ముకుందంగారు ఏమంటారు?" అడిగింది కమల.

"వాళ్ళ అమ్మాయి కూడా యింటికి వచ్చిందట!"

"ఎక్కడకు వెళ్ళిందట!"

"బీచ్‌కి!"

"అదేమిటి? ఒక్కర్తేనా?"

"అవును. సడన్‌గా వెళ్ళాలనిపించిందట!"

కూతురి మొహంలోకి పరాత్పరం కమలా చూడ సాగారు.

4

డిటెక్టివ్ శిరీష్ డైరీ తెరిచాడు. నాలుగు రోజులనాడు చక్రధరం వచ్చాడు. దృశ్యం కళ్ళముందు కదులుతోంది.

తాను కన్సల్టింగ్ రూంలో కూర్చుండి వున్నాడు.

గుమ్మం బయట చప్పుడయింది.

తాను రాసుకుంటోన్నవాడల్లా తలెత్తి చూశాడు.

అతడు గది బయట నిలబడి వున్నాడు. అతడికి ముప్ఫయి—ముప్ఫయిరెండూ వుంటుంది వయసు. కాకీ రంగు టెరీకాట్ పాంటూ, నల్లటి గడి చొక్కా తొడుక్కున్నాడు. జుత్తు సంస్కారహీనంగా పెరిగి వుంది.

మొహంలో ఒక రకమైన నిర్లక్ష్యమూ, బెదురు కళ్ళూ..

"లోపలకు రావచ్చునా సార్?" అడిగాడు అతడు.

"మీకు ఎవరు కావాలి?" అడిగాడు తాను.

"డిటెక్టివ్ శిరీష్!" అన్నాడు అతడు.

"మీ పేరు!"

"చక్రధరం!"

"లోపలకు రండి!"

చక్రధరం గదిలోకి అడుగుపెట్టాడు. అతడి కళ్ళలో బెదురు తగ్గింది.

కుర్చీలో కూర్చున్నాడు. నిట్టూర్పు వదిలాడు.

"ఏం పనిమీద వచ్చారు?" అడిగాడు తాను.

"నేను గంజాయి స్మగ్లింగ్ చేస్తాను."

"చేయండి-నా ప్రసక్తి ఎందుకు?"

"నా దగ్గర చాల డబ్బు కూడింది. నల్లడబ్బు! మీకు అర్థమవుతోందనే అనుకుంటాను."

"మీరు ఒక రాకెట్‌లో పనిచేస్తున్నారు. విడిపోవాలను కుంటున్నారు. విడిపోయే ముందు నల్లడబ్బును తెలుపు చేసుకోవాలనుకుంటున్నారు, అవునా?"

"అవున్సార్! సరిగ్గా అదే!"

"అయితే నా దగ్గరకు ఎందుకు రావడం?"

"మీరు అంతో యింతో నేర ప్రపంచంతో సంబంధం వున్నవాళ్ళు!"

"అవును."

"నేరాలు చేసి వుండకపోయినా నేరం ఎలా చేయగలరో చెప్పగలరు!"

"నేరం చేయమని చెప్పడం నా వృత్తికాదు!"

"నా వృత్తి గంజాయి స్మగ్లింగ్. అయినప్పటికీ మీకు నా వృత్తిపట్ల ఏహ్యం పుట్టలేదు. అంటే నేరాన్ని ప్రోత్స హించడం మీకు తప్పుకాదన్న మాట!"

"చక్రధరంగారూ! మీ వాదన విచిత్రంగా వుంది."

"ఎందుకు సార్?"

"మీరు చెప్పకుంటే తప్ప మీ వృత్తిగురించి నాకు తెలియదు!"

"అవును."

"మిమ్మల్ని వృత్తి మానమని నేను చెప్పలేను."

"ఎందుకు సార్?"

"మీ వృత్తి చట్ట వ్యతిరేకమైనదని తెలుసు మీకు. అయినా మీరు మీ వృత్తిని మానుకోవడం లేదు. మీకు మరో జీవనాధారం కల్పించగలిగే స్థితిలో నేను వుంటే మీ వృత్తిని మానుకోమని చెప్పేవాడిని."

"కాని నేను వచ్చిన పని వేరు!"

"ఏమిటది?"

"నా నల్ల డబ్బును తెలుపు చేసుకుంటాను. సహకరించండి. నా రాకెట్ నుండి నన్ను విడదీయండి! మీకు ఫిఫ్టీ ఫిఫ్టీ యిచ్చుకుంటాను."

"ప్లీజ్.... గెటవుట్!"

"శిరీష్‌గారూ! నన్ను క్షమించండి. మీరు మాటయిచ్చే వరకూ కదలను!"

తనకి కోపంతో శరీరం కుత కుత లాడింది.

అతడిని మెడ పట్టుకుని బయటకు తోసెయ్యాలనిపించింది.

"వెళ్తారా? పంపించమంటారా?"

"ఫిఫ్టీ పర్సెంట్‌కి మీకు పదిలక్షలు వస్తాయి."

తను లేచాడు. అతడిని సమీపించాడు. కాలర్ పట్టుకుని లేపాడు. అతడు తిరగబడబోయాడు. తను అతడికి ఆ అవకాశం యివ్వలేదు. మెడమీద చెయ్యి వేశాడు. బలంగా బయటకు తోశాడు.

చక్రధరం రోడ్డుమీద పడ్డాడు.

ట్రాఫిక్ కానిస్టేబులు అతడిని సమీపించాడు.

తాను తలుపు మూసుకున్నాడు.

చక్రధరం పోలీసుల చేతులలో పడ్డాడు. సహజంగానే తన్నులు తిన్నాడు.

చక్రధరం తనవద్దకు వచ్చిన కారణం కూడా పోలీసులకు చెప్పాడు. అతడిని లాకప్‌లో పెట్టారు. పోలీసులను గాయపరిచి రాత్రి తప్పించుకున్నాడు.

డిటెక్టివ్ శిరీష్ టెలిఫోన్ చేశాడు.

అవతల కుమార్ పలికాడు.

"పోస్ట్‌మార్టం రిపోర్ట్ వచ్చిందా?"

"వచ్చింది. నీ కోసం చూస్తాను. రా."

"బయలుదేరుతోన్నాను" రిసీవర్ పెట్టేశాడు శిరీష్.

కారు పోలీస్ స్టేషన్‌ముందు ఆపాడు. లోపలికి నడిచాడు.

శిరీష్‌ను చూస్తోనే కుమార్ కూర్చోమని సైగచేశాడు. రిపోర్ట్ అందించాడు. శిరీష్ మౌనంగా రిపోర్ట్ చదివాడు.

"అంటే! చక్రధరం తలమీద దెబ్బలకు మరణించాడు. కాలి పిక్కలో పాయింట్ త్రీనాట్ త్రీ రైఫిల్ తూటా దొరికింది. అంటే అతడిని అతడి స్మగ్లింగ్ రాకెట్ వెన్నాడుతోందన్నమాట! తప్పించుకు పారిపోబోయాడు. కాని రాకెట్ అతడిని పట్టి పంతం సాధించుకుంది."

"అతడివి రాకెట్ మట్టుపెట్టింది. కారణం తెలియదు."

"చక్రధరం యింట్లో హత్య జరుగుతోందని నీకు ఫోన్‌చేశారు. ఫోన్ ఎక్కడినుండి వచ్చిందో తెలుసుకున్నావా?"

"ప్రయత్నించాను. తెలియలేదు."

"చక్రధరం యింటిని సోదా చేయించావా!"

"సోదా చేయించాను. ఆ యింట్లో చక్రధరం ఆస్తి ఏమీ లేదు."

"ఇల్లు ఎవరి పేర వుంది?"

"చక్రధరం అద్దెకు వుంటున్నాడు. యజమానిది ఈ నగరం కాదు."

"అయితే చక్రధరం తన ఆస్తిని ఎక్కడ దాచాడో తెలుసుకోవాలి."

"ఈపాటికే శత్రువుల చేతిలో పడిందేమో!"

"అదీ పాయింటే! పడివుండక పోతే హత్య జరగదేమో!"

"శిరీష్! నగరంలోని కాలేజీ అమ్మాయిలు మాయమవు

తోన్నారు. మూడు నాలుగు గంటల హడావుడి తర్వాత వాళ్ళంతట వాళ్ళే యిళ్ళకి వస్తున్నారు."

"కార్తీకమాసం కదా! పిక్నిక్‌లకు వెళ్తున్నారేమో!"

"కాలేజి సాయంత్రం నాలుగు గంటలకు ముగుస్తుంది. అమ్మాయిలు వాళ్ళకు తెలియకుండా వాళ్ళకు వాళ్ళే బీచ్‌కి వెళ్తున్నారు. షుమారుగా పదహారూ ఇరవై మంది అమ్మాయిలు వెళ్తున్నారు కాని, ఒకరికీ ఒకరికీ బీచ్‌లో సంబంధం వుండటం లేదు."

"అంటే!"

"అమ్మాయిలంతా ఒక కాలేజీ అమ్మాయిలే! ఒకే ఓమ్నిబస్‌లో వచ్చేవాళ్ళే. అయినా ఒకరినొకరు బీచ్‌లో గుర్తుపట్టుకోలేకపోతున్నారు."

"అమ్మాయిలను వెంటాడి ఎవరైనా వెళ్తున్నారా?"

"తెలియదు. మఫ్టీలో కానిస్టేబుల్సును పంపాం కాని, విచిత్రమొహాలు, వాళ్ళకేమీ తెలియలేదు!"

"విమెన్స్ కాలేజీకి మనం వెళ్దామా?"

"నేను రెడీ. ఒకేసారి పీకలమీద రెండు కేసులు!"

శిరీష్ లేచాడు.

5

విమెన్స్ కాలేజీ ఆవరణలో డాట్సన్ కారు ఆగింది. శిరీష్ డ్రయివింగ్ సీట్లోంచి దిగాడు. రెండో వైపునుండి కుమార్ దిగాడు.

ఇద్దరూ ప్రిన్సిపాల్ ఆఫీసు గదివైపు నడిచారు.

ప్రిన్సిపాల్ పేరిందేవి వారిని సాదరంగా ఆహ్వానించింది.

టేబులుకి యివతల రెండు కుర్చీలలో కూర్చున్నారు ఇద్దరూ.

"నిన్న సాయంకాలం బీచ్‌కి వెళ్ళినట్టు మీకు తెలిపిన అమ్మాయిలను పిలిపిస్తారా?" అడిగాడు కుమార్.

ప్రిన్సిపాల్ తలూపింది.

బల్లసొరుగులోంచి జాబితాతీసి అమ్మాయిలను రప్పించింది ఆమె.

శిరీష్ వాళ్ళను పరిశీలనగా చూశాడు. మొత్తం పదహారు మంది.

అందరూ ఇరవై సంవత్సరాలలోపు అమ్మాయిలే. లేత నీలిరంగు పావడామీద తెలుపు బ్లవుజూ, తిరిగి లేత నీలి రంగు వల్లెవాటూ వేసుకున్నారు.

"మీకు నాలుగు గంటలకు బీచ్‌కి వెళ్ళాలని ఎందుకు అనిపిస్తోంది" అడిగాడు శిరీష్.

వనజ ధైర్యంగా చెప్పింది.

"మాకు రెండు రోజులుగా బీచ్‌కి వెళ్ళాలనిపించింది. నా మటుకు నాకు బీచ్‌లోకి వెళ్ళినట్టు కూడా తోచలేదు. సాయంత్రం ఏడుగంటలయివుంటుంది. చల్లటిగాలి మొహం మీద కొడుతోంది. అప్పుడు పరిసరాలు గుర్తించగలిగాను. బీచ్. అంతే! చకచక యింటికి వెళ్ళే సిటీబస్సు పట్టుకున్నాను."

"బీచ్‌లో నువ్వు యెవరితోనయినా మాట్లాడావా?"

"సాయంత్రం నాలుగూ—ఏడూ గంటలమధ్య ఏం జరిగిందో నాకు తెలియదు."

వనజ చెప్పినట్టే మిగతా అమ్మాయిలు చెప్పారు.

"మీరంతా ఒక క్లాసువాళ్ళే కదా!"

"అవును."

శిరీష్ వాళ్ళకు తలా ఒక తెల్లకాగితం ఇచ్చాడు.

"మీ వయసూ, మీ తల్లిదండ్రుల పేర్లూ, వారి ఉద్యోగ

వివరాలూ, మీకు స్వగ్రామాలంటూ వేరేవుంటే అగ్రామాల పేర్లూ రాసియివ్వండి. క్రింద మీ సంతకం స్పష్టంగా ఉండే లాగా చేయండి" అన్నాడు శిరీష్.

అమ్మాయిలు కాగితాలు అందుకున్నారు. పూర్తిచేసి యిచ్చారు.

ప్రిన్సిపాలు వద్ద సెలవు తీసుకుని పరిశోధకులు బయ ల్దేరారు.

శిరీష్ కారును దండపాణి వీధిలోకి పోనిచ్చాడు. చక్రధరం యింటివద్ద ఆపాడు.

చక్రధరం యింటికి కానిస్టేబులు కాపలావున్నాడు.

ఇన్‌స్పెక్టర్‌ను చూడగానే శల్యూట్ చేశాడు.

శిరీష్, కుమార్ యింట్లోకి నడిచారు.

"చక్రధరం ఆస్తి వివరాలు మనకు కావాలి. అత్యవ సరం!" అన్నాడు శిరీష్.

ఇద్దరూ యింటిని అంగుళం అంగుళం గాలించడం మొదలుపెట్టారు. మామూలు పద్ధతిలో కట్టిన ఇల్లు అది!

ఎక్కడా ఎలాంటి రహస్యమైన అరలుకానీ, ద్వారాలు కానీ లేవు.

"చక్రధరం సామాన్యమైన యింట్లో వుంటున్నాడు. కాని యింటికి టెలిఫోన్ పెట్టించుకున్నాడు" అన్నాడు శిరీష్.

"కావచ్చు. అతడి అవసరాన్నిబట్టి ఏర్పాట్లు చేసు కున్నాడు."

"అంటే ఆధునికమైన ఏర్పాట్లలోనే తన డబ్బును దాచుకుని వుంటాడు. ఏదైనా బ్యాంక్ లాకర్ తీసుకొని వుండవచ్చు."

కుమార్ తలూపాడు. "అతడు చనిపోతూ క్లూ ఇచ్చి వుండవచ్చును!"

"అతడి చేతిలో కలంగానీ, పెన్సిలుగానీ లేవు. వ్రేలికి రక్తం లేదు" శిరీష్ బల్లమీదికి చూశాడు. టెలిఫోన్ సెట్టు వుంది. బల్లమీద ఎక్కడా ఎలాంటి రాతా లేదు.

కుమార్ గోడకివున్న కాలెండర్లు తిరగవేశాడు.

నిట్టూర్చాడు.

శిరీష్ విజిల్ వేశాడు. టెలిఫోన్ సెట్టుమీద నంబర్ విచిత్రంగా వుంది.

576491

అయిదూ నాలుగూ తొమ్మిదీ ఒకటీ మీద రక్తం అంటింది. వ్రేలితో రక్తం రాపినట్టు చారవుంది. నాలుగంకెలూ రక్తం అయ్యాక డెబ్బైఆరు మిగిలింది. అంటే వ్రేలికంటిన రక్తం ఎవరో చెరిపివుంటారు.

"చక్రధరం క్లూ ఇచ్చినట్టున్నాడు. ఈ డెబ్బైఆరు నెంబర్ దేనికి పనికి వస్తుందో తెలుసుకోవాలి" అన్నాడు శిరీష్.

"ఏదైనా సేఫ్టీ లాకర్ నెంబరయివుండాలి!"

బల్లమీద టెలిఫోన్ మ్రోగింది.

శిరీష్, కుమార్ మొహాలు చూసుకున్నారు. చక్రధరం చనిపోయాడు. ఆ విషయం తెలియని వారెవరో అతడికి ఫోన్ చేస్తున్నారు.

శిరీష్ రిసీవర్ ఎత్తాడు.

"హలో....576491 హియర్!"

"సేఫ్టీ లాకర్ తాళంచెవి పోయినట్టు మీరు వుత్తరం పంపించారు. డూప్లికేట్ తాళంచెవి యివ్వమంటారా?" అవతల వినబడింది.

శిరీష్ నుదురు చిట్లించాడు.

"ఆ వ్యక్తిని కొంతసేపు అట్టే పెట్టగలరా?"

"ఏం ఆ వ్యక్తి మీవాడు కాదా?"

శిరీష్ జవాబు చెప్పబోయాడు. అవతల యెవరో మూలి గారు.

టక్‌మని టెలిఫోన్ పడిపోయిన చప్పుడయింది.

శిరీష్ తలత్రిప్పి కుమార్‌కి సైగచేశాడు. కుమార్ బయటకు పరుగెత్తాడు.

శిరీష్ రిసీవర్‌లోకి కోపంగా చూస్తున్నాడు.

హంతకుడు అటుప్రక్క రంగప్రవేశం చేశాడు. విషయం తెలిసి తాను చేతులు ముడుచుక్కూర్చోవలసి వచ్చింది. కుమార్ టెలిఫోన్ ఎక్ఛేంజ్‌కి ఫోన్ చేయ డానికి వెళ్ళాడు. చక్రధరం యింటికి ఫోన్‌కాల్ ఎక్కడి నుండి వచ్చిందో తెలుసుకురావాలి. అంతవరకూ తాను యింతే.

టెలిఫోన్‌లో రిసీవర్‌లో రకరరాల చప్పుళ్ళు వినిపిస్తు న్నాయి. ఎవరో అరుస్తున్నారు. కేకలు పెడుతున్నారు.

అంటే హంతకుడు పారిపోయాడు. చక్రధరం ఇంటికి ఫోన్‌చేసిన వ్యక్తికి అపకారం జరిగింది.

కుమార్ లోపలకు పరుగెత్తుకు వచ్చాడు.

"గుడ్‌విల్ బాంకు!" అరిచాడు కుమార్.

శిరీష్ బయటకు పరుగెత్తాడు. కారులోకి దూకాడు. కుమార్ అతడివెనకే కారులోకి వురికాడు.

విల్లు విడిచిన బాణంలాగా కారు వురికింది.

గుడ్‌విల్ బాంకుముందు కారు ఆగింది. బాంకులో హడావుడిగా వుంది. బాంకు మేనేజర్ గదిలోకి పరు గెత్తాడు. మేనేజర్ బల్లమీద తలవాల్చి పడివున్నాడు.

తలమీద కొద్దిగా రక్తం కారుతోంది.

చక్రధరం సేఫ్టీ లాకర్ నెంబర్ డెబ్బయ్యారు. దాని తాళంచెవి హంతకుడికి దొరకలేదు. చక్రధరం సంతకం ఫోర్జరీచేసి డూప్లికేట్ తాళంచెవికి హంతకుడు వచ్చాడు. మేనేజర్ చక్రధరానికి ఫోన్ చేశాడు. హంతకుడు అతడిని గాయపరచి పారిపోయాడు.

బాంకు సిబ్బందిని హంతకుడి పోలికలు అడిగాడు శిరీష్.

హంతకుడికి ముప్ఫయి సంవత్సరాల వయసుంటుంది. ఆకర్షణీయమైన కళ్ళు. గాబర్డిన్ సూట్‌లో వచ్చాడు.

ఇంతలో మేనేజర్ కళ్ళు తెరిచాడు.

"తలలో సూదులతో పొడుస్తూన్నట్టుంది" అన్నాడు మేనేజర్.

"అతడి మాటతీరు ఎలావుంది?" అడిగాడు శిరీష్.

"మాటలు వినేకొద్దీ వినాలని వుంటుంది!"

శిరీష్ తలూపాడు. హంతకుడు హిప్నటిస్ట్. అమ్మాయిలను బీచ్‌కి తరుముతున్నది అతడే!

అతడు వాళ్ళను ఎలా హిప్నటైజ్ చేస్తున్నాడు. అతడు ఎక్కడ కాచుకుంటున్నాడు?

శిరీష్ తన చేతిగడియారం చూసుకున్నాడు.

మధ్యాహ్నం రెండు గంటలయింది. మరో రెండు గంటలలో కాలేజి విడిచి పెడతారు. అమ్మాయిలు ఈరోజు బీచ్‌కి వెడతారా?

బాంకు సిబ్బందివద్ద సెలవు తీసుకొని శిరీష్ బయలదేరబోయాడు.

"సేఫ్టీ లాకర్ నెం. 76 ను ఏం చేయమంటావు?" అడిగాడు కుమార్.

"బాంకు యాజమాన్యాన్ని ఒప్పించు. చక్రధరం ఆస్తి

దానిలోనే వుంటుంది!" అన్నాడు శిరీష్.

కుమార్ అతడిని పక్కకు తీసుకువెళ్ళాడు.

"చెక్‌పోస్టుల దగ్గర నువు చెప్పినట్టు కాపలా పెట్టించాను. ఫలితం వుంటుందా?"

"తప్పకుండా వుండాలి. గంజాయి స్మగ్లింగ్ వ్యవహారంలో చీలిక ఏర్పడింది. నగరంలోకి వచ్చి పడిన గంజాయిని నగరం దాటించాలి. చక్రధరం చావు తర్వాతనే గంజాయి నగరం దాటవలసిన పరిస్థితి ఏర్పడింది."

"నిజమే! నాకు రాజకీయంగా చాల ఒత్తిడి వస్తోంది. నగరం సరిహద్దులు దాటివెళ్ళే ప్రతి వాహనమూ తనిఖీ అవుతోంది."

"కేసు ముగింపులోకి వస్తోంది. రాజకీయం నిన్నేమీ చేయదు. ఎక్కడికో ట్రాన్స్‌ఫర్ చేస్తుంది, అంతే!" శిరీష్ అతడి భుజం తట్టి బయటకు నడిచాడు.

6

విమెన్స్ కాలేజి భవనంలోకి నడిచాడు శిరీష్.

"బీచ్‌కి వెళుతోన్న అమ్మాయిలకు ఇప్పుడు ఏం క్లాసు?" అడిగాడు శిరీష్.

పేరిందేవి చార్ట్ చూపింది. "హిస్టరీ క్లాస్. తర్వాత పొలిటిక్స్."

"ఆ అమ్మాయిలంతా హిస్టరీ పొలిటిక్స్ వాళ్ళే నన్నమాట!"

"అవునండి!"

"నిన్నా మొన్నా కూడా అంతేనా?"

"అవును. నిన్నా మొన్నా ఈ రోజూ అవే సబ్జెక్టులు! రేపు మాత్రం రెండు పీరియడ్లు ఒకటి ఇంగ్లీషు గ్రామరూ, ఫిజికల్ ఎడ్యుకేషనూ!"

శిరీష్ తల పంకించాడు.

"ఈరోజు మీస్టాఫ్ అందరూ వచ్చారా?"

"వచ్చారు."

"ఉదయం ఎవరయినా సెలవుపెట్టారా?"

"లేదు."

"పోలిటిక్స్ లెక్చరర్ ఎవరు?"

"కృష్ణస్వామిగారు!"

"ఆయనను ఒకసారి చూపిస్తారా?"

పేరిందేవి బయటకు కదిలింది. వరండావైపు ఇద్దరూ నడిచారు. వరండాలోనే కృష్ణస్వామి ఎదురయాడు. శిరీష్ అతడిని తేరిపారచూశాడు.

పంచెకట్టు కట్టాడు. గోల్డ్ కలర్ సిల్కుచొక్కా తొడిగాడు. కళ్ళకు కూలింగ్ గ్లాసెస్. వయసు ముప్ఫయిదాటి వుంటుంది.

పేరిందేవి, శిరీష్ అయనను దాటి వెళ్ళారు.

"ఆయన ఎప్పుడూ కళ్ళద్దాలు పెడతారా?" అడిగాడు శిరీష్.

"అవును. క్లాసులో మాత్రం తీసేస్తారు!"

డిటెక్టివ్ శిరీష్ వెయిటింగ్ హాలులో కాపు వేసు కూర్చున్నాడు. పేరిందేవి మధ్యమధ్య అతడివద్దకువచ్చి వెళుతోంది.

నాలుగు గంటలకు లాంగ్ బెల్ కొట్టారు.

శిరీష్, వనజ వాళ్ళ క్లాసువైపు చూశాడు. తరగతి గదిలోంచి కృష్ణస్వామి వస్తూ కనిపించాడు. అతడి కళ్ళకు కళ్ళద్దాలు వున్నాయి.

"అతడు యెటు చూస్తూన్నాడో తెలియడంలేదు!" గొణుక్కొన్నాడు శిరీష్. కృష్ణస్వామి ఆవరణలో ఆగాడు.

తరగతి గదుల్లోంచి విద్యార్థినులు ప్రవాహంలాగా బయటకు వస్తున్నారు.

ఓమ్ని బస్ ఆవరణలో ఆగింది.

వనజా ఆమె స్నేహితురాండ్రు బస్సువైపు నడుస్తోన్నారు.

కృష్ణస్వామి బస్సును దాటి వెళ్ళిపోయాడు.

ఓమ్ని బస్సు కదిలింది.

శిరీష్‌ను సమీపించింది పేరిందేవి.

"అదృష్టం శిరీష్‌గారూ! ఈ రోజు అమ్మాయిలు మామూలుగా వున్నారు. రోజూ యీ వేళకి వాళ్ళు యెటు వెళ్ళారో తెలియకుండా పోయేది!" అంది పేరిందేవి.

శిరీష్ తలూపి "అవును ప్రిన్సిపాలుగారూ! ఈ రోజు అమ్మాయిలు బీచ్‌కి వెళ్ళరు" అన్నాడు.

"కాని వాళ్ళు ఏదో దుష్ప్రభావానికి గురయారు. రెండు రోజులలో పిక్నిక్ వుంది. అప్పుడు వాళ్ళు చూస్తూచూస్తూ మాయమైతే పోలీసులు నన్ను మూసేస్తారు!"

"పిక్నిక్కా? ఎక్కడకు?"

"జూ పార్క్!"

శిరీష్ ఆలోచనలో పడ్డాడు.

జూపార్క్‌కి యివతలే చెక్‌పోస్ట్ వుంది. అంటే అమ్మాయిలు నగర పరిసరాలు దాటుతారు. ఈ అమ్మాయిల మీద హిప్నటిజం ప్రయోగించిం దెవరు? అందువలన ప్రయోజనం ఏమిటి?

7

పిక్నిక్ బస్సు ఆగింది. చెక్‌పోస్ట్‌వద్ద తణిఖీ అధికారులు ప్రత్యక్షమయారు. లెక్చరర్లు బస్సు దిగారు.

బస్సులో కిలకిల నవ్వుతూ అమ్మాయిలు చూస్తోన్నారు.

"మన బస్సులో ఏముంది చూసుకోడానికి—తణిఖీకి!" ఎవరో అమ్మాయి అరిచింది.

తనిఖీ అధికారులు బస్సులోంచి అమ్మాయిల్ని దింపారు.

అమ్మాయిలు ఎయిర్ బాగ్స్‌తో దిగారు.

తణిఖీ అధికారులు బస్సును అంగుళం అంగుళం సోదా చేశారు. దిగిపోయారు.

"సోదా అయిపోయింది! బస్సు ఎక్కండి!" అన్నాడు కృష్ణస్వామి.

అమ్మాయిలంతా బిలబిల లాడుతూ బస్సెక్కారు.

"బస్సులను తణిఖీ చేయడం ఎందుకు?" అడిగాడు కృష్ణస్వామి.

నీ కెందు కన్నట్టు తణిఖీ అధికారులు కోపంగా చూశాడు.

కృష్ణస్వామి నవ్వుకొంటూ బస్సెక్కాడు. నల్లకళ్ళద్దాలు తొలగించాడు.

పిక్నిక్ బస్సు కదిలింది. డైరీ ఫారం దాటింది. జూ పార్క్ ముందు ఆగింది.

పిక్నిక్ పార్టీ జూ పార్క్‌లో ప్రవేశించింది.

8

అతడు చెట్టు చాటున నిలబడ్డాడు. అతడికి దగ్గరలో మరో యిద్దరు వ్యక్తులు పొదలలో కూర్చున్నారు.

వాళ్ళ ప్రక్కనే రెండు పోలిథిన్ సంచులున్నాయి. ఒక వ్యక్తి సంచిలో చిన్న పొట్లాలు సర్దుతోన్నాడు. చిన్న పొట్లాలు కూడా పోలిథిన్ కాగితంతో చేసినవే!

పొట్లాలలో తెల్లటి పొడి అస్పష్టంగా కనిపిస్తోంది.

చెట్టుచాటున నిలబడిన వ్యక్తి వాళ్ళను పరిశీలిస్తున్నాడు.

కూర్చున్న వ్యక్తిని ఒకడిని పిలిచాడు.

"వెళ్ళి వనజను పిలుచుకురా!" అన్నాడు నిలబడినవ్యక్తి.

అతడు పార్క్‌లోకి నడిచాడు.

క్షణాలలో వనజ చెట్టుచాటుకు వచ్చింది. ఆమె ఎయిర్ బాగును నేలమీద పెట్టింది.

"వనజా! బాగ్ తెరువ్!" ఆజ్ఞాపించాడు నిలబడినవ్యక్తి.

నిద్రలో వున్నట్టుగా వనజ బాగ్ తెరచింది. వస్తువులను నేలమీద పెట్టింది. చిన్న అద్దమూ, హాండ్ పర్స్, తిలకం పెన్సిలూ....వాటి తర్వాత పోలిథిన్ పేపర్ బాగ్స్ తీసింది.

తెల్లటి పొడివున్న పేపర్ బాగ్స్.

ఆజ్ఞాపించిన వ్యక్తి బాగ్స్‌ను అందుకున్నాడు.

"నీ వస్తువులు సర్దుకో! వెళ్ళు. నీ ఫ్రెండ్స్‌ను కలుసుకో. అంతా మరచిపో" ఆదేశించాడు అతడు.

వనజ మౌనంగా తలూపింది. తన వస్తువులను ఎయిర్ బాగులో సర్దుకొంది. యేమీ యెరగనట్టుగా వెనక్కి తిరిగింది.

చెట్ల చాటుకు కదిలింది.

ఆజ్ఞాపించిన వ్యక్తి పకపక నవ్వాడు.

"మన గంజాయి మొత్తాన్ని అమ్మాయిలు తెచ్చి పెట్టారు చెక్‌పోస్ట్ కళ్ళు గప్పి!" అతడు మరల నవ్వాడు. అతడి అనుచరులు శృతి కలిపారు.

పొదలలో అలికిడయింది.

ముగ్గురూ తలలు త్రిప్పారు.

డిటెక్టివ్ శిరీష్ నిలబడి వున్నాడు. అతడి చేతిలో పిస్తోలు నిగనిగలాడుతోంది.

"కృష్ణస్వామీ! నువ్వు హిప్నటిస్ట్‌వని తెలుసుకున్నాను. నా పని సులువయింది!" అన్నాడు శిరీష్.

కృష్ణస్వామి కోపంగా చూశాడు.

"చక్రధరం మీతోపాటు పని చేసిన గంజాయి స్మగ్లర్. అతడు మిమ్మల్ని మోసగించబోయాడు. అతడిని చంపేశారు.

నగరంలో వున్న గంజాయి అమ్మకం కాదు. ఎందుకంటే చక్రధరం మీ రాకెట్ లో ఒక లింకు. ఆ లింకు కాస్తా బెసికింది. మీ గంజాయి అమ్మడు కావాలంటే మరో నగరం వెతుక్కోవాలి.

కృష్ణస్వామీ! నువ్వు అమ్మాయిల కాలేజిలో లెక్చరల్ వి. గౌరవప్రదమైన వుద్యోగివి కాబట్టి నిన్ను అనుమానించేవాళ్ళుండరు అనుకొన్నావు. గంజాయి రాకెట్టుకు నువ్వు మూల స్తంభం అని యెవరనుకొంటారు?.... అమ్మాయిలను యోగనిద్రలోకి శిక్షణ యివ్వడం మొదలుపెట్టావు.

గుడ్ విల్ బాంకులో నువ్వు సేఫ్టీ లాకర్ కి డూప్లికేటు తాళం చెవికోసం ప్రయత్నించావు. నీ వ్యవహారం బయట పడబోయి ఆగింది. బాంకులో నీ గురించి వర్ణన తెలిసింది. నీవి ఆకర్షణీయమైన కళ్ళు, హిప్నటైజ్ చేయగల కళ్ళు. అందుకే యెప్పుడూ నల్ల కళ్ళద్దాలు వాడతావు.

నీ నేత్రాలు అమ్మాయిలమీద బాగా పని చేశాయి. వాళ్ళను హిప్నటైజ్ చేసి గంజాయి వారి బాగ్స్ లో పెట్టి నగర సరిహద్దు దాటించావు.

నువ్వు రాకెట్ ని కూడదీసుకొని యిక్కడకు బయల్దేరావు. నీ రహస్య స్థావరంలోనూ, ఇక్కడ జూ పార్క్ చుట్టూతా పోలీసులు!" ఆగాడు శిరీష్.

"శిరీష్!" కృష్ణస్వామి ఆకర్షణీయంగా పిలిచాడు.

శిరీష్ పక పక నవ్వి "నీ విద్యకు లొంగని మనో నిబ్బరం నేను సాధించుకున్నాను!" అని పిస్తోలు గాలిలోకి ప్రేల్చాడు. క్షణాల్లో పార్క్ పోలీసులను ప్రసవించినట్టయింది. □

వసుంధర

కళాపోషకుడు

"ఈ రోజు ఏమైనా సరే దొంగతనం చేయాలి" అన్నాడు శర్మ.

"దొంగతనము చేయుట పాపము—" అన్నాడు శాస్త్రి.

"పాపాత్ముల యింట్లో దొంగతనము చేయుట పాపము కాదు—" అన్నాడు శర్మ.

"పాపి అనగా ఎవడు?"—శాస్త్రి.

"ఎవడింట్లో లక్ష రూపాయలుంటే వాడే పాపి—" అన్నాడు శర్మ.

"సరే—నీ మాట నాకు వేదవాక్కు—ఓ పాపాత్ముడి ఇల్లు చెప్పు—"

శర్మ గుర్నాధం పేరు చెప్పాడు.

గుర్నాధం పక్క సందులో వుంటున్నాడు. వడ్డీ వ్యాపారి. ఆయ న్నందరూ పాపాత్ముడని తిట్టుకుంటూ వుంటారు. ఆయన ప్రఖ్యాతి విన్నారు కానీ ఆయ న్నెప్పుడూ చూడలేదు శాస్త్రి, శర్మ. ప్రస్తుతం డబ్బవసరం చాలా ఎక్కువగా వుంది.

ఇద్దరు కాలేజి స్టూడెంట్సుకు స్కూలు ఫీజు, హాస్టలు ఫీజు కడతామని మాటిచ్చారు వాళ్ళు. ఒకాయన కూతురి పెళ్ళికి అప్పిస్తామన్నారు. మొత్తం నాలుగువేలు కావాలి. దగ్గర పైసా లేదు.

దొంగతనం చేయాలంటే ధైర్యం కావాలి. ధైర్యం కావాలంటే ఆకలి వుండకూడదు. మిత్రులిద్దరికీ కూడా ఆకలిగా వుంది. అడిగితే పెళ్ళికూతురి తండ్రి భోజనం పెడతాడు. కానీ అప్పిస్తామని మభ్యపెట్టి అత డింట్లో భోంచేయడం మిత్రుల కిష్టం లేదు. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి.

"భోజనం కూడా గుర్నాధం ఇంట్లోనే చేద్దాం—" అన్నాడు శాస్త్రి.

గుర్నాధం అసలే లోభివా డంటారు. తనకే కడుపు నిండా వండుకుంటాడో లేదో తెలియదు. అసలే తా మాకలి

మీదున్నారు. అక్కడ కడుపునిండా భోజనం దొరక్కపోతే ఎలా?—శర్మకు అనుమానం వచ్చింది.

"ముందు వెళ్ళి చూద్దాం—" అన్నాడు శాస్త్రి.

శాస్త్రికి, శర్మకు దొంగతనం గురించి ఏ మాత్రం బెంగ భయం లేవు. ఎవరో చుట్టా లింటికి వెడుతున్నట్లే వుంది వాళ్ళకు.

"ఎందుకైనా మంచిది—పెందరాళే బయల్దేరుదాం." అనుకొన్నా రిద్దరూ కూడా. సరిగ్గా ఎనిమిదయ్యేసరికి ఇంటి దగ్గర బయల్దేరి ఆయిదు నిముషాల్లో గుర్నాధం యిల్లు చేరారు.

గుమ్మందాకా వెళ్ళాక—"ఇంట్లో ఎంతమందున్నారో ఏమో!" అన్నాడు శాస్త్రి.

"మనుష లెక్క వుంటే ప్లేటు మారుద్దాం—" అన్నాడు శర్మ.

తలుపు తట్టాడు శాస్త్రి.

లోపల దీపం వెలగడం లేదు. అలికిడీ వినిపించడం లేదు.

"పిసినిగొట్టు కదా—దీపం కూడా వేసుకోడు—" అంటూ శాస్త్రి మళ్ళీ తలుపు తట్టాడు. ఈసారి లోపల కాస్త అలికిడయింది. ఏదో అడుగుల చప్పుడు తలుపుదాకా వచ్చి ఆగింది. తలుపు తెరుచుకుంది.

చీకట్లోంచీ ఓ ఆకారం తన తల గుమ్మం బయటకు పెట్టింది. ఆ తల మేరకు గుమ్మం బయటి వెలుగులో ప్రకాశం కలిగింది.

"నమస్కారం గుర్నాధంగారూ — కులాసానా?" అన్నాడు శర్మ.

"ఎవరు మీరు?" అన్నాడు గుర్నాధం తడబడుతూ.

"మరీ గుమ్మంలో నిలబెట్టి మాట్లాడతారేంటండీ— బాకీ తీర్చడానికి వ స్తేనూ—" అన్నాడు శర్మ.

గుర్నాధం ఓ అడుగు వెనక్కు వేశాడు. శాస్త్రి, శర్మ అదే వేగంతో ఓ అడుగు ముందుకు వేశారు.

"మీరు పిసినిగొట్టు అని విన్నాను కానీ—మరీ దీపాలు వెలిగించుకోకపోవడం బాగోలేదండీ—" అన్నాడు శాస్త్రి. అతడి కళ్ళు ఆ చీకట్లోనే చూడడం మొదలుపెట్టాయి. అతను గోడవారకు వెళ్ళి ఓ స్విచ్ వేశాడు. గదంతా ప్రకాశవంతమయింది. ఈ లోగా శర్మ వీధి తలుపు వేశాడు.

గుర్నాధం మళ్ళీ—"ఎవరు మీరు?" అన్నాడు.

"కూర్చోమనైనా అనకుండా ఏమిటండీ ఆ ప్రశ్నలు?" అంటూ శాస్త్రి వెళ్ళి అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు. శర్మ అతణ్ణి అనుసరించాడు. గుర్నాధం ఏం చేయాలో తెలియక తనూ ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"గుర్నాధంగారూ—ఆకలేస్తోంది. భోజనం సిద్ధంగా వుందా?" అన్నాడు శర్మ.

"ఇంట్లో ఎవ్వరూ లేరు. నేనే హోటల్లో తింటున్నాను—" అన్నాడు గుర్నాధం.

శాస్త్రి గుర్నాధంమీద జాలిపడ్డాడు—"హోటల్ భోజనమే అంతంత మాత్రం. అందులోనూ మీరు తినే హోటలంటే అదింకా భరించలేం. ఎంత చచ్చు హోటలయినా రెండ్రూపాయలకు తక్కువలో భోజనం పెట్టరు గదా—ఇంట్లో అయితే ముప్పావలాలో పంచభక్ష్య పరమాన్నాలూ వస్తాయి—"

"నాకు వంట రాదు—" అన్నాడు గుర్నాధం.

"నాకూ రాదు—" అన్నాడు శాస్త్రి.

"నాకూ రాదు—" అన్నాడు శర్మ.

"అయితే గుర్నాథంగారూ—ఎప్పుడైనా మీ భార్యకు జబ్బు చేస్తే వంటెలా చేసేవారు?" అన్నాడు శాస్త్రి.

"దాని కేముంది—ఆవిడ చెప్పేది—నేను చేసే వాణ్ని!"

"అయితే ఇంకేం—చిట్కా తెలిసిపోయింది—" అన్నాడు శర్మ.

"ఏమిటది?" అన్నాడు శాస్త్రి.

"నాకు చెప్పడం వచ్చు—" అన్నాడు శర్మ.

"కానీ కాకు చెయ్యడం రాదే—" అన్నాడు శాస్త్రి.

"నీకూ నాకూ చెయ్యడమెందుకు వస్తుంది? మన మిద్దరం బ్రహ్మచారులం. గుర్నాథంగారు చేస్తాను. నేను చెబుతాను—" అన్నాడు శర్మ.

"అయ్యో—నాకు చెప్పడమూ చెయ్యడమూ రాదే—నేను మీకెలా సాయపడగలను?" శాస్త్రి వాపోయాడు.

"దేవుడి దయవల్ల నీకూ యేదో పని దొరక్కపోదు. తొందరపడకు. పనిలేనివాళ్ళకు పని చెప్పడం నాకు వెన్నతో పెట్టిన విద్య—"

అప్పటికి గుర్నాథం తేరుకొని—"ఎవరయ్యా మీరు? బాకీ తీర్చడానికొస్తే అదేదో నా మొహాన్న కొట్టిపోక—భోజనం అడుగుతారేమిటి?" అన్నాడు.

"బాకీ తీరుస్తామనగానే చంకలు గుద్దుకుంటూ లోపలకు రమ్మనడమేనా? అసలు బాకీ వున్నామో లేదో తెలుసుకో వద్దా?" దబాయించాడు శాస్త్రి విసురుగా.

"బాగుంది. అప్పులున్నవాళ్ళు స్వయంగానే రావాల నేముంది? మీ లాంటి వాళ్ళ కిచ్చి పంపుతూంటారు—" అన్నాడు గుర్నాథం.

"మేం బాకీ తీర్చడానికి రాలేదు. భోంచేయడానికే వచ్చాము. కావాలంటే భోజనంకాగానే ఆ బాకీ తీర్చేస్తాం" అన్నాడు శర్మ.

"ఇంట్లో వండితే ముగ్గురికీ మూడు ముప్పావలాలు—అంటే రెండుంపావలా అవుతుంది. మీరెలాగూ బయటే భోంచేద్దామనుకొంటున్నారు. అంటే మీకు అదనంగా అయ్యే ఖర్చు పావలా! ఆ పావలా కావాలంటే ముందే యిచ్చేస్తాను—" అంటూ జేబులో చెయ్యి పెట్టాడు శాస్త్రి.

"నేను వండను—" అన్నాడు గుర్నాధం.

"ఇంటి కొచ్చిన అతిథులకి వండిపెట్ట నంటావేం టయ్యా—ఎంత పాపం—యెంత పాపం?" అన్నాడు శాస్త్రి.

"నేను పాపాత్ముణ్ని—ఒప్పుకొంటున్నాను. మీరు వెళ్ళండి?" అన్నాడు గుర్నాధం నిస్సహాయంగా వారివంక చూస్తూ.

"చూస్తూచూస్తూ నిన్ను పాపం మూట కట్టుకోనిస్తామా? అదీ మా కారణంగా...." అని—"నీచేత వంట చేయిస్తాను చూడు" అన్నాడు శర్మ.

"నేను వండను—" అన్నాడు గుర్నాధం మొండిగా.

శర్మ తన చేతుల్ని అదోలా చాపి—"శాస్త్రీ—ఏదైనా కఱ్ఱ ఉంటే తీసుకురా—" అన్నాడు. గదిలో గోడవారగా ఓ బూజుల కఱ్ఱ ఉన్నది. శాస్త్రి దాన్ని శర్మ ముందుకు తేగానే శర్మ చిన్న కరాటే నాట్యం చేసి కుడిచేత్తో ఆ కఱ్ఱమీద ఓ దెబ్బ వేశాడు. అది రెండు ముక్కలయింది.

"ఇది చెయ్యికాదు. కత్తి!" అన్నాడు శాస్త్రి.

"కఱ్ఱ పని అయింది గదా—ఇప్పుడు గుర్నాధం పని

పట్టాలి. ఎక్కడ కొట్టను?" అనడిగాడు శర్మ.

"చేతుల జోలికి వెళ్ళకు. వంట చేయాలి కదా!" అన్నాడు శాస్త్రి.

"నేను వంట చేయను...." అన్నాడు గుర్నాధం.

శర్మ విసురుగా గుర్నాధం ముందుకు వచ్చి కరాటే నాట్యంచేసి గాలిలోకి చేతిని లేపాడు. అతను కొట్టబోతూంటే శాస్త్రి అడ్డం వచ్చి దెబ్బ తిని పడిపొయ్యాడు.

"నువ్వెందు కడ్డ మొచ్చావు?" శర్మ కోపంగా అడిగాడు.

"ఆయన్ని కొడితే మనకెవరు వండుతారు?" అన్నాడు శాస్త్రి.

"వెర్రివాడా—ఆయ నెలాగూ మనకు తన వంట రుచి చూపిస్తాడు. ఈ లోగా మనం ఇది రుచి చూపించనిదే వంట ప్రారంభించడు...."

"నేను వంట చేయను...."

శర్మ చేయి గుర్నాధం కాలిని తాకింది. ఆయన ఉన్నట్లుండి కూలబడిపోయి—"వంట చేస్తాను...." అన్నాడు.

అంతా వంటింట్లోకి వెళ్ళారు. ఇంట్లో గ్యాస్ స్టవ్ వున్నది. శర్మ గుర్నాధంచేత బియ్యం పడేయించాడు.

ఇంట్లో ఇంకే పదార్థాలూ వున్నట్లు లేదు. కానీ ఊరగాయలున్నాయి.

"ఛీ—ఊరగాయా అన్నం తినను నేను. కనీసం వంకాయకూరా, సాంబారూ కావాలి నాకు...." అన్నాడు శాస్త్రి.

"మరి పెరుగో?" అన్నాడు శర్మ.

"అవును మరి. ఇంట్లో పెరుగుకూడా లేదు" అని

"గుర్నాధం—జేబులో డబ్బులుంటే యివ్వు. సరుకులు తెప్పించాలి" అన్నాడు శర్మ.

గుర్నాధం జేబులో పాతిక రూపాయలున్నాయి.

"శాస్త్రీ—నీకే పనీ లేదని బాధపడ్డావు—వెళ్ళి సరుకులు తీసుకునిరా" అన్నాడు శర్మ.

శాస్త్రి వెళ్ళి సరుకులు తెచ్చాడు. హోటల్నుంచి పెరుగు తెచ్చాడు.

శర్మ గుర్నాధంచేత వంట చేయించాడు. ముందు తమకు వడ్డించి తర్వాత తను తినాలన్నాడు.

"ఆహా—ఏం పాళ్ళు గురూ నీవి!" అని మెచ్చుకుంటూ శాస్త్రి, శర్మ మొత్తం వండిందంతా ఇద్దరూ తినేశారు.

"అయ్యో — గుర్నాధంగారూ మీకేం మిగల్లేదు. "మొత్తం రెండుం పావలా మీకే ఇచ్చేస్తాం లెండి" అన్నాడు శర్మ.

గుర్నాధానికి మండిపోతోంది. అతను ఏమీ అనలేక "రెండుం పావలా వద్దు. ఇంక మీరు బయటకు వెళ్ళండి. మా ఆవిడకే నే నెప్పుడూ వంట చేయలేదు" అంటూ గొణిగాడు.

"చూశావా శాస్త్రీ—ఏదైనా చెప్పి చేయించుకోడంలో వుంటుంది. ఈయన వాళ్ళావిడకే వండలేదట—మనకు వండిపెట్టాడు."

"అయితే—ఇనప్పెట్టె తలుపు తీయమను—చూద్దాం!"

"నేను తీయను" అన్నాడు గుర్నాధం.

"ఇందాకా వంట వండనన్నావు. వండావా లేదా?" అన్నాడు శర్మ.

"గుర్నాధంగారూ—మీకీ వడ్డీ వ్యాపార మెందుకండీ. డబ్బివ్వడమూ—ఆ తర్వాత నుంచి బాకీ వసూలు చేయ

లేక అవస్థపడడమూను. మనం హోటలొకటి పెడదాం. శర్మ చెబుతాడు. మీరు చేస్తారు. నేను గల్లాపెట్టి దగ్గిర కూర్చుంటాను" అన్నాడు శాస్త్రి.

"నేను వడ్డీ వ్యాపారమే చేస్తాను" అన్నాడు గుర్నాధం.

"అయితే ఇనప్పెట్టె తియ్యి"

"తియ్యను."

శర్మ చెయ్యి గాలిలోకి లేచింది.

"నన్ను కొట్టొద్దు. నా దగ్గర తాళాలు లేవు" అన్నాడు గుర్నాధం.

"నీ ఇనప్పెట్టె తాళాలు నీ దగ్గర కాక ఇంకెవ్వరి దగ్గరుంటాయి?"

"నా భార్య దగ్గర—ఆమె రేపు వస్తుంది!"

"పెళ్ళాని కొక్కసారేనా వండి పెట్టనివాడివి—తాళాలిచ్చావా—ఈ మాట మమ్మల్ని నమ్మమంటావా?"

"తాళాలు నేనివ్వలేదు. తనే తీసుకుపోయింది...."

శాస్త్రి, శర్మ వివరాలడగలేదు.

"అయితే—పద — ఇనప్పెట్టె గదిలోకి!" అంటూ గుర్నాధాన్ని ఇనప్పెట్టె వున్న గదిలోకి తీసుకువెళ్ళి, "దీని తాళాలు నీ దగ్గర లేవూ?" అనడిగారు.

"లేవు."

"ఆయన్నడిగి లాభం లేదు—దెబ్బ వేయి గురూ!" అన్నాడు శాస్త్రి.

శర్మ చేయి గాలిలోకి లేచింది. గుర్నాధం కెవ్వుమనబోగా శాస్త్రి అయన నోరు మూశాడు. శర్మ చేయి ఇనప్పెట్టె మీద పడింది. తలుపు తెరుచుకుంది. గుర్నాధం కళ్ళు ఆశ్చర్యంలో పెద్దవయ్యాయి.

ఇనప్పెట్టెలో క్యాషు వుంది. మొత్తం నలభై రెండు

వేల రూపాయలు. ఇంకా ఏవో లాకర్లున్నాయి గానీ మిత్రులు వాటి జోలికి వెళ్ళలేదు.

శాస్త్రి మొత్తం డబ్బు తీసుకుని—"అంతా అవసర మంటావా?" అన్నాడు. శర్మ తాపీగా—"మనం వాడేది మంచి పనులకే గదా—ఫర్వాలేదు. ఉంచుదూ" అన్నాడు.

గుర్నాధం వాళ్ళ కాళ్ళమీద పడిపోయాడు—"నన్ను చంపుకు తిన్నట్లే-అంత డబ్బూ తీసుకునిపోతే!" అన్నాడు.

"నిన్ను చంపుకుని తినే ప్రసక్తే లేదు. నీచేత వండిం చుకు తినడమంటావా—అది వేరే సంగతి!"అన్నాడుశర్మ.

"మసైపోతాను. ఎంతో కొంత నాకు వదిలిపెట్టండి!"

"నీకెందుకు వదలాలి?"

"అది నా డబ్బు" అని ఆక్రోశించాడు గుర్నాధం.

"ఇంట్లో కూర్చుని అంత డబ్బెలా సంపాదిస్తున్నావు? మోసం చేసేకదా—నిన్ను శిక్షించమని దేవుడు పంపాడు."

"ఏ శిక్ష విధించినా భరిస్తాను. కానీ డబ్బుమాత్రం ఎంతో కొంత నాకు వదిలిపెట్టండి...."

"అయితే విను....ఇది నీ డబ్బు కాదు. మా డబ్బు.... ముందా మాట నువ్వు ఒప్పుకోవాలి...." అన్నాడు శర్మ.

"ఒప్పేసుకున్నాను. అది మీ డబ్బే!"

"నువ్వు ముష్టివాడివి. మా దగ్గర కొచ్చి అడుక్కుంటు న్నావు...." శాస్త్రి ఎలా అనాలో కూడా చెప్పాడు.

"ముష్టాణ్ని బాబయ్యా—దరమపెబువులు నన్ను దయ తలచాలి బాబయ్యా" అన్నాడు గుర్నాధం తన పంచెను జోలిగా పడుతూ.

అందులో ఓ పదిపైసల నాణెం వేశాడు శర్మ.

గుర్నాధం ఘొల్లుమన్నాడు. — "మీ కాళ్ళు పట్టు కుంటాను....నాకు కొన్ని వేలైనా వదలండి...."

శర్మ, శాస్త్రి అతడితో ఆడుకున్నారు. గదంతా చంటి పిల్లాడిలా పాకమన్నారు. ఓ వెయ్యి ఇచ్చారు. గుంజీకి వంద చొప్పున ఇస్తామని పది గుంజీలు తీయించి ఇంకో వెయ్యి ఇచ్చారు. గుర్నాధం ఇంకా తీస్తానన్నాడు కానీ ఇంక గుంజీలు తీసినందుకు డబ్బివ్వాలి అంటే మానేశాడు. ఆగకుండా రెండు నిముషాలు నవ్వమంటే నవ్వి మరో వెయ్యి సంపాదించుకున్నాడు. వాళ్ళిద్దరి చుట్టూ పది నిముషాలు తిరిగి మరో వెయ్యి, ఆడదానిలా అభినయించి ఓ వెయ్యి. సినిమా ఆర్టిస్టులను మిమిక్రీ చేసి ఓ వెయ్యి....ఇలా రకరకాల విద్యలు ప్రదర్శించి మొత్తం పదిహేను వేలు సంపాదించుకున్నాడాయన.

"గుర్నాధం—నీ విద్యలకు మెచ్చాను. కానీ విద్యలను మాకులా ఆదరించే వాళ్ళెక్కడైనా వుంటారా? ఒక్క రాత్రిలో ఒక్క గంటలో కళాపోషణకు పదిహేను వేలు ఖర్చు చేశాం. ఇలా ఎవరైనా వుంటారా?"

"మీ సొమ్ము కాకపోతే సరి...." అని పళ్ళు పిండుకున్నాడు గుర్నాధం.

"విని ఊరుకుంటావేం — మమ్మల్ని మెచ్చుకో!" అన్నాడు శర్మ.

గుర్నాధం వాళ్ళను తెగపొగిడి మరో వెయ్యి సంపాదించుకున్నాడు.

"శర్మా! మనమిక్కడ మరి కాసేపు వుంటే డబ్బంతా ఇక్కడేఅయిపోయేలాగుంది"అంటూ శాస్త్రి హెచ్చరించాడు.

"వెనుకటికి కృష్ణుణ్ణి రుక్మిణి ఇలాగే హెచ్చరించిందట. గొప్పగొప్పవాళ్ళను సహధర్మచారిణులో, సహచరులో ఇలా కాపాడుతూంటారు. గుర్నాధం! కళాపోషణచేయడం వల్లనేమో నాకెంతో తృప్తిగా వుందీ రోజు. ఇలాంటివాళ్ళు

మరికొన్ని వుంటే చెప్పు."

గుర్నాధం మాట్లాడలేదు.

శాస్త్రి, శర్మ అక్కణ్నించి వెళ్ళిపోయారు. ఇల్లు చేరుకుని హాయిగా నిద్రపోయారు. మర్నాడుదయం లేచి వాగ్దానాలు చేసిన వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి మరీ డబ్బిచ్చి వచ్చారు. ఇంట్లో ఇంకా చాలా డబ్బుంది.

"ఏం చేద్దాం?" అన్నాడు శర్మ.

"వెంటనే ఓ నిర్ణయానికి రావద్దు. రెండుమూడు రోజులాగుదాం!"

రెండు రోజుల తర్వాత శాస్త్రి, శర్మ ఇంట్లో వుండగా ఒకతను వచ్చి "గుర్నాధంగారు మిమ్మల్ని ఓసారి పిల్చుకుని రమ్మన్నారండి!" అన్నాడు.

మిత్రులిద్దరూ ఆశ్చర్యపోయారు. గుర్నాధం తమ సంగతి ఎలా తెలుసుకున్నాడు? ఇప్పుడు తామేం చేయాలి? ఆయన పోలీసులకు అప్పజెపితే—ఏం చేయాలి? ఇంట్లో ఇంకా డబ్బుకూడా వున్నది.

"తర్వాత వస్తాం" అన్నాడు శాస్త్రి.

"లేదండి. అర్జంటుగా వున్న పళంగా తీసుకు రమ్మన్నారండి!"

"ఏమిటి పని?"

"తెలియదండి."

"సరే—వెడదాం" అన్నాడు శర్మ. అది మేకపోతు గాంభీర్యం.

శాస్త్రి నెమ్మదిగా శర్మ చెవిలో "గురూ-దగ్గర వీధిలో దొంగతనాలు చేయకూడదు. ప్రమాదం!" అన్నాడు.

"ముందు ముందు జాగ్రత్తగా వుండొచ్చు—కానీ ఇప్పుడేం చేయాలి?"

నిజానికి ఇద్దరికీ భయంలేదు. అవసరమైతే జైలుకు వెళ్ళడానికీ సిద్ధమే వాళ్ళు. దొరక్కుండా వుంటే బాగుండు నన్న కనీసపు కోరిక మర్యాదకైనా వుండాలిగదా!

ఇద్దరూ గుర్నాధం ఇల్లు చేరారు.

"మీరేనా శాస్త్రి, శర్మ!" అన్నాడో నడివయస్కుడు.

"అవును గుర్నాధంగారెక్కడ?"

"నేనే గుర్నాధాన్ని...." అన్నాడాయన.

శాస్త్రికీ, శర్మకూ నోట మాటరాలేదు.

"మీరు గుర్నాధంగారు కాదు" అన్నాడు శర్మ.

"మీరు గుర్నాధంగారని ఎవరైనా సాక్ష్యం చెబితేకానీ నమ్మం" అన్నాడు శాస్త్రి.

"ఇది చాలా బాగుంది. నా ఇంటికొచ్చి నేను నేనేనని ఋజువు చేసుకోమంటారేమిటి? మీరింకా తెలివైన వాళ్ళను కున్నాను. మందబుద్ధుల్లాగున్నారు."

అక్కడున్నవారంతా ఆయనే గుర్నాధమని వాళ్ళకు నచ్చజెప్పారు.

"నా ఇనప్పెట్టెలోంచి—మొత్తం—నలభై రెండు వేలు పోయింది. నేనీ రోజు ఉదయమే ఊర్నించి వచ్చి చూసు కున్నాను" గుర్నాధం లబోదిబో మన్నాడు.

"పోలీసుల్ని పిలిచారా?"

"వాళ్ళని పిలిస్తే ప్రయోజనముండదు. మీ గొప్పతనం గురించి విన్నాను. అందుకే మిమ్మల్ని పిలిచాను" అన్నాడు గుర్నాధం.

"మా గొప్పతనం గురించి మీకెవరు చెప్పారు?" అను మానంగా అడిగారు మిత్రులిద్దరూ.

"మీ కిద్దరకూ నేనే స్వయంగా వండి వంకాయకూర, సాంబారుతో భోజనం పెడతాను, మీకు కావాలంటే సినిమా

ఆర్టిస్టు లందర్నీ మిమిక్రీచేసి చూపిస్తాను. చంటి పిల్లాడిలా పాకుతాను. గుంజీలు తీస్తాను. మీ చుట్టూ పరిగెడతాను. మీరు మాత్రం శాయశక్తులా ప్రయత్నించి దొంగెవరో తెలుసుకుని—వాడెవరో నాకు చెప్పకపోయినా నా డబ్బు నాకు అప్పగించండి. చచ్చి మీ కడుపున పుడతాను."

"ఆగండి—ఇవన్నీ మీ కెవరు చెప్పారు?"

"మా గుమస్తా—జోగయ్య....మీ కిలాంటి సరదాలున్నాయనీ అ సరదాలు తీరిస్తే ఎంత పనైనా చేసిపెడతారనీ అన్నాడు. మీరు గొప్ప కళాపోషకులటగా...."

శాస్త్రి, శర్మ గుర్నాధంవద్ద సెలవు తీసుకుని జోగయ్య వివరాలు తెలుసుకుని అతడింటికి వెళ్ళారు.

అక్కడ వున్నది తాము గుర్నాధంగా పొరబడిన జోగయ్యే!

"దొంగతనం నాకు చేతకాదు. తెగించి యజమానింటికి వెళ్ళాను. మీరు చాలా గొప్పవారు. కళాపోషకులు. మీ ధర్మమా అని నా కూతురి పెళ్ళి చేయగల్గుతున్నాను. ఇప్పుడింకేమైనా విద్యాప్రదర్శన చేయమంటారా?" అన్నాడు జోగయ్య.

మిత్రులిద్దరూ అక్కణ్నించి లేచి వచ్చేశారు.

"గురూ! ఎంతో కొంత తనకు వదిలిపెట్ట మన్నప్పుడైనా వాడూ మనలాంటి దొంగేనని అర్థం కాలేదు. మన జాతి వాళ్ళని మనం హింసించడం న్యాయంకాదు. గుర్నాధం చేత మనం ఇంకా వండించుకుని తినవలసి వుంది" అన్నాడు శాస్త్రి.

"రూంలో ఇంకా ఇరవై వేలున్నాయి. రాత్రికి గుర్నాధం విద్యాప్రదర్శనం చూద్దాం?" అన్నాడు శర్మ. □

అమానుషం

బొమ్మిడి అచ్చారావు

"నువ్విలా మాటిమాటికీ పెళ్ళి వాయిదా వెయ్యటం ఏం బాగోలేదు మావా" అన్నది చిన్నమ్మ.

"ఉండవే, నీ గస ఒకటి మధ్య. పేపరు మిల్లులో ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాను. ఉద్యోగం లేకుండా పెళ్లి

చేసుకుని నిన్నెట్టా పోషించేది?" అన్నాడు దేవయ్య కొంచెం చిరాకు, మరికొంత ప్రేమా మిళాయించి.

"నువ్వలాగే అంటున్నావు రెండేళ్ళనుంచీ, కాని యిప్పటివాకా ఆ సంగతే పట్టించుకుంటన్నట్లు కనపడదు. పేపరు మిల్లులోనే తప్ప నీకు దగ్గ ఉజ్జోగం యింకెక్కడా దొరకదేటి! అంతా యిద్దూరం నీదీ!"

"ఇంకోటి యింకోటీ నే జెయ్యనే! ఒత్తే పేపరు మిల్లుదే చేస్తాను, లేదంటే యిక మా బాబుతో బాటు యవసాయం చేసుకుంటాను. అదే నయ్యం, సొతంత్రంగా, బతకొచ్చు."

"పోనీ ఆ ఎవసాయమేందో యిప్పుడే చెయ్యరాదా?"

"నీకు మరీ పెల్లికోసం యిదెక్కువై పోతందే! నేను జేసుకోకపోతేకదా నీ భయ్యం? నేనప్పితే నిన్ను పెల్లాడే వోడుకూడా ఎవడూ వుండడు. నేనెట్టాగూ నిన్నే పెల్లాడతాను—తొందర పడిపోబోక!"

"ఇయ్యేల బస్తీలో సిన్మా సూపిస్తానంటివి. పోదామా?"

"ఇవ్వాల వద్దులేవే! మరోరోజెళ్దాం. నేను బస్తీ పోయి పేపరు మిల్లు దగ్గిర ఓ మనిషిని కల్సుకుని రావాల. మనం సిన్మాకి పోతే ఆ పని అవ్వదు. అంచేత రేపు వెలదాంలే!"

"అలాగే వారం రోజుల నుంచీ గడుపుకొస్తున్నావు. సరే యీసారి దివాన్ చెరువులో టెంటు హాలులో సినిమాకి నడిచిపోయి చూసొస్తాను. నువు లేకండా ఒక్కదాన్నే చూసొస్తాను."

దేవయ్య నవ్వి, "నన్ను రెచ్చగొట్టకే! ఎప్పుడన్నా నేను లేకుండా నువ్వొక్కదానివీ సిన్మా చూసేవేంటి? అలాగంటే నేనే తీసికెల్తానుగందా అని నువ్వలాగంటన్నా

వని నాకు తెల్సులే! రేపు యిక తప్పకండా తీసుకెల్తానులే. నీమీద ఒట్టు!'' అన్నాడు.

చిన్నమ్మ వెన్నెలలా నవ్వింది.

2

''ఏమే చిన్నా యిక్కడ ఒక్కదానివీ కూచుండి పోయావు?'' చనువుగా చిన్నమ్మ పక్కనే కూలబడుతూ అన్నాడు చంద్రయ్య.

చిన్నమ్మ కొరకొరా చూసింది.

''నీకెందుకా సంగతి? నీ దార్ని నువుపో!''

''అదేంటే, నీ గురించి నాక్కాకపోతే యింకెవరికే! వరసకి బావని. పెళ్ళికానివాడిని. వరసయిన పిల్లతో సరస మాడమని సామెత కూడా వుందిగా!''

''సరసం గిరసం అన్నావంటే మూతిపల్లు రాల్తయ్!''

''అమ్మో, చాలా పొగరుగా మాట్లాడ్తావే? చూడుపిల్లా యిలాంటి పొగరుమోతు మకురుగొడ్డుని యెలా దారికి తేవాలో నాకు తెలుసు. అసలు నాకిలాంటి పొగరున్న ఆడ దంటే మా బలేయిష్టం!''

''నాకు ఆబోతులాగా కనపడ్డ ఆడదాని ఎనకపడే నీలాంటి వోడంటే మహా రోత.''

''నువ్వేమన్నా నాకు కోపంరాదే! ఇంతకీ కారణ మేంటో తెలుసో-నువ్వంటే నాకు ప్రేమ! ఎంత ప్రేమో చెప్పలేను. నా కోసం ఎంతమంది ఆడపిల్లలు వాళ్ళ బాబులు క్యూలో నిలబడ్డారో నీకు తెలుసా? నీకేం తెలు స్తుంది. అక్షరమ్ముక్కరాని ఉద్యోగం సద్యోగం లేని ఆ దేవయ్యగాడంటే పడిచస్తావు. ఏంటి ఆడిలో స్పెషాలిటీ?''

''బావ గురించి ఒక్క పొల్లుమాటన్నావంటే మర్యాద దక్కదు. బావ కాలిగోటికృాడా సరిపోవు నువ్వు.''

"ఓసోస్-ఆడెక్కడ, నేనెక్కడ? నేను ఆరోక్లాసుదాకా చదూకున్నాను తెల్సా? మా బాబుకు నేనొక్కడినే కొడుకుని, అఫ్కోర్స్ కూతురు కూడా ఒక్కతి వుందిలే. దానికి పెళ్ళయిపోయింది కదా, ఫర్లేదు. నీ బావకి ఏటుందే? ఒక్క అరెకరం పొలం వాడికీ వాడి బాబుకీ. మా చిన్నాయినే అనుకో—ఉమ్మడి. ఇంట్లో పెళ్ళికావలసిన చెల్లెలు.

నాకే బాదరబందీ లేదు. పైగా మా రైసుమిల్లు మా బాబు తర్వాత నాదే? చుట్టుపట్ల ముప్పయి గ్రామాలకు మా మిల్లు లేకపోతే రోజు గడవదు. మరి యిన్ని మంచి లచ్చ నాలున్న నన్నుగాక ఆ దేవయ్య దగ్గిర ఏముందని పరి గెత్తన్నావు?"

"మంచి మనసుంది. పేమంటే తెలిసిన మనిసి. నేనంటే పేనం పెడతాడు. అది చాల్దా? నీలాగా యెకిలి ఏసాలేస్తూ, కనపడ్డ ఆడదాని ఎనకల్లా బోడు. నువ్వు తన పెద్దనాన్న కొడుకువని చెప్పుకోడానికే బావ సిగ్గుపడ్తుం టాడు."

"చీ, ఆడిసంగతి నా దగ్గిర మల్లీ ఎత్తకు. పూటకు టికానాలేని ఆడ్ని మా చిన్నాయిన కొడుకని చెప్పుకోడానికే నాకు సిగ్గుగా వుంది. చుట్టుపట్ల గ్రామాల్లోను, బస్తీలోను నాకున్న పలుకుబడి, విలువ నీ బావకి యెన్ని జన్మలెత్తితే వస్తాది?"

"అదేమాట నిన్నూ అడుగుతున్నాను. ఎన్ని జనమ లెత్తినా నువ్వు దేవయ్యబావ కాలిగోటికి సరికావు. బావకి ఉజ్జోగం లేకపోవచ్చు, డబ్బు లేకపోవచ్చు. కాని నీలాంటి పాడుబుద్ధి మాత్రంలేదు. ఇకమీదట నన్ను కల్సుకోడానికి గాని, నాతో మాట్లాడ్డానికిగాని ఎలాంటి పెయత్నమూ జెయ్యకు. ఎల్లిక" అన్నది చిన్నమ్మ కళ్ళనుంచి నిప్పు

రవ్వలు చిమ్ముతూ.

"ఆడు నిన్ను పెళ్లి జేసుకుంటాడని, ఇంద్రలోకమో, చంద్రలోకమో తీసుకెళ్తాడనీ వెర్రికలలు కనక! నిన్ను నట్టేట్లో ముంచుతాడు, చూస్తావుండు!" విసురుగా లేచి పోయాడు చంద్రయ్య.

3

"అన్నయ్యా,నువ్వా?" విస్మయంగా అన్నది చిన్నమ్మ.

"ఛీ, ఛ, ఆ మాటనక. నా పేరు కనకారావు-కనకం అని ముద్దుగా పిలు!"

"ఛ, అన్నయ్యను పేరుతో పిలుస్తానా? ఏయిటి యిట్టా గొచ్చావు?"

"ఏంలేదు చిన్నమ్మ, నీతో మాట్లాడదామని!"

"నాతోనా, మాట్లాడటమా? నాతో చెప్పుకునే మాట లేటుంటాయి అన్నా!?"

"అదుగో మళ్ళీ అన్నా అంటున్నావు. నేను బస్తీలో పుట్టి పెరిగినవాడ్ని. ఇలా అన్నయ్యా, చెల్లెమ్మ, బుల్లెమ్మ అని పిల్చుకోవటం నాకు నచ్చదు.... ఊఁ, యెవరికోసం పొలంగట్టున ఎదురుచూస్తూ కూచున్నావు?"

"అబ్బె, ఊరికనే!"

"ఆ, నాకు తెలుసు. ఎవరికోసమో చూస్తున్నావు. ఆ దేవయ్యకోసమే కదూ!"

"అబ్బె, కాదు."

"నేనేం అనుకోనులే! చిన్నమ్మ, నువ్వు ఏం అనుకో నంటే ఓ మాట అడగనా?"

"ఏమిటది?"

"ఏం అనుకోకూడదు."

"అలా అనుకుండే మాటయితే మరి చెప్పకు."

"అహహ, అలా తేల్చెయ్యకు-లేస్తున్నావేం, కూచో, మరేంలేదు, నా పెళ్ళాంతో నాకు పొత్తు కుదరడంలేదు. దాన్ని ఒదిలేద్దామనుకుంటున్నాను."

"అదేమిటి, సీతాలు చాలా మంచిపిల్ల, అలాంటి పిల్ల మీద లేనిపోనివి జెప్పకు, కళ్ళోతాయి."

"ఆ, పోతే పోనీద్దు. నీ కళ్ళున్నాయిగా! అదికాదు చిన్నా, దానికి ఓ సరదా తెలీదు, ఓ ఫ్యాషన్ తెలీదు. ఓ అందంలేదు, చందంలేదు. ఏదో కట్నం బాగా యిచ్చాడని ఆ మూడుముళ్ళూ వేసేశాను. దానితో సంసారం చేసాక తెలిపింది, అది సరదాలకి పనికిరాదని!"

"చూడన్నా! పెల్లంటూ జరిగాక ఆ మొగోడికి మరో ఆడది వుంటే వుండొచ్చుగాని, ఆ యాడదానికి మరో మొగాడి దేస వుండదు. దేవతలాంటి సీతాలును అన్నేయం జెయ్యటానికి పెయత్నించక."

"మరి దాన్ని ఒదిలేస్తేనేగాని నిన్ను చేసుకోవటం కుదర్దుగదా అని ఆలోచిస్తున్నాను."

తోకతొక్కిన తాచులా లేచింది చిన్నమ్మ.

"ఏమిటి తెగవాగుతుండావు?"

"ఆ ఆ! అంతకోపం దేనికి చిన్నమ్మా! నాకా ఎప్పటి నుంచో నీమీద మనసుంది. ఏదో కట్నంకోసం చేసుకున్నా నాకు సీతాలుమీద మనసులేదు. అలాంటప్పుడు యిష్టంలేని దానికి విడాకులు యిచ్చేసి యిష్టమయినదాన్ని చేసుకోవ వడంలో తప్పులేదుగా!"

"అసలు నిన్ను చేసుకునేది ఎవత్తివుంది? మీ మొగాళ్ళకి బుద్దీ గేనం వుండవనుకుంటాను. ఆడది కాత్త ఎర్రగా బుర్రగా కనపడితే దాని ఎనకాలే పడతారు. వాయివరసా చూడని గొర్రెపోతువాటం. దేవయ్యబావ చెల్లెలుని పెల్లి

జేసుకున్నావు. నాకు అన్నవి సీతాలు ఒదినకి మొగుడవి అయ్యావు. ఎవర్తో మాట్లాడ్తన్నావో, ఏం మాట్లాడ్తన్నావో నీకేమైనా ఎరికుందా?"

"ఉష్, ఎందుకలా అరుస్తావు? ఆ దేవయ్య చెల్లెల్ని కాదుగా నేచేసుకున్నది, చంద్రయ్య చెల్లెల్ని.

"దేవయ్య చంద్రయ్య అన్నదమ్ముల బిడ్డలుగాదా!"

"వేరు వెరుసయితే బంధాలు వెరుసే! అవన్నీ ఎందుకు, నాకు నువ్వు కావాలి! నిన్ను నేను ఒదులుకోలేను. సీతాలుకి విడాకులివ్వకూడదనుకుంటే నిన్నుంచుకుంటాను. సీతాలుతో సమానంగా చూసుకుంటాను. ఏమంటావ్?...."

కనకారావు మాటలు పూర్తికాకుండానే ఆతని చెంప చెళ్ళుమంది. చిన్నమ్మ నిలువెల్లా ఆవేశంతో ఒణికి పోతుంది.

"నా చేతిలో కత్తో, కొడవలో వుంటే యీ పాటికి కారుకూతలు కూసిన నీ నాలుగ తెగ్గోసివుండేదాన్ని. పో, నా ఎదట్నించి పో! ముదనష్టపోడా! బ స్త్రీలో పుట్టి పెరిగా నన్నావు, యిలాంటి బండకూతలు కుయ్యడానికా?" తిట్టి పోసింది చిన్నమ్మ.

"ఊ!, నన్నే కొడతావంటే? కనకారావు పగ పాము పగ! నిన్నేం చేస్తానో చూడు!" విసవిసా బుసలుకొడుతూ వెళ్ళిపోయాడు కనకారావు.

4

"చిన్నమ్మా, నాకు ఉజ్జోగం దొరికింది" ఆనందంగా చెప్పాడు దేవయ్య.

చిన్నమ్మ కళ్ళు వెలిగిపోయాయి.

"నిజంగానా? పేపరు మిల్లులోనేనా?"

"అఁ! నీకు జెప్పానుగా, దొరికితే పేపరుమిల్లు ఉజ్జో

గమే చేస్తాను, లేకుంటే ఇంకేదీ చెయ్యనని!"

"ఎవసాయం జేత్తానన్నావుగందా!"

"అదేలేయే! ఉజ్జోగం దొరక్కపోతే ఎవసాయం జేత్తా నన్నాను. ఉజ్జోగం దొరికిందిగాదా!"

"మరయితే లగ్గమెప్పుడు?"

"ఓసినీ, యిక నిన్ను పట్టలేంగందా! అవునే, ఉజ్జోగం రాగానే మనువాడేస్తే అది కాయం కావొద్దూ? మద్దెలో తీసేస్తే?"

"ఛీ, సుబమా అని ఉజ్జోగం దొరికితే అలాంటి అప సెకునపు మాటలాడతావేంటి?"

"అబ్బ, వూరికే అన్నానులేయే. కట్టపడి పన్జేయాలేగాని ఆల్లే పెరమనెంటు జేత్తరు. మంచిరోజు జూసి మా అయ్యను లగ్గంపెట్టమంటాను."

చిన్నమ్మ బుగ్గల్లో గులాబీలు పూశాయి.

"అయితే పెల్లయ్యాక మన కాపరం రాజమండ్రి మార్చేద్దామా?"

"ఏంటే, బస్తీకిపోతే రోజుకో సిన్మా చూత్తావుండొచ్చని కలలు గంటున్నావేంటి! పిచ్చిమొద్దా, బస్తీలో కాపరమంటే మాటలుకాదు. మనకొచ్చే కూలిడబ్బులు—అదే జీతమనుకో—తిండికే సాలవు. నేను రోజూ సైకిలుమీద డ్యూటీకెల్లి వచ్చేత్తుంటాను. మన కాపరం మనూల్లోనే.

అవునే. నాకు తెలీకడుగుతాను మన పల్లెకి మించిన బస్తీ ఎక్కడుందే? పచ్చటి పొలాలు, మన పొలానపండిన తిండిగింజలు, కూరగాయలు, ఇంట దొరికే పాడీ-ఇయ్యన్నీ బస్తీలో యెక్కడ దొరుకుతాయే ఎర్రిదానా? గొప్పగొప్పోల్లంతా పల్లెటూల్లో గడపాలంటే సరదాపడతారు, తెలుసా? అలాంటది ఇయ్యన్నీ ఒదులుకుని బస్తీ ఎల్లి ఏం జేద్దామని

నీ ఉద్దేశం?"

"అబ్బ నేరకపోయి అంటే అదే పట్టుకుంటావ్? మరి వారానికొకసారి నీ సైకిలెనకాల కూచోబెట్టుకుని బస్తీలో సిన్మా చూపిత్తావా మరి?"

"ఏంటీ, సైకిలెనకాలా? సిన్మా? ఓసి ఎర్రిమొగవా ఆర్టీసీవోడు ఏసిన బస్సులుండగా సైకిలేం కర్మ? బస్సు మీదెల్లి సిన్మాచూపి ఓటేల్లో బోజనం గట్రాజేపి జల్సా సేసుకుందాం. సరేనా?"

"బస్సుకి బోల్డుడబ్బులు కర్చుగందా!"

"ఏంటే, పెల్లికాకండానే పిల్లలు పుట్టకుండానే నీకు పొదుపు ఎక్కువైపోతంది. పర్లేదే, నా జీతవంతా మిగిల్పే లాగానే వున్నావు."

చిన్నమ్మ మనోహరంగా నవ్వింది.

5

ఆ రోజుకి చిన్నమ్మ దేవయ్య పెళ్ళి జరిగి నాలుగు నెలలు కావస్తోంది.

పుచ్చపువ్వులా వెన్నెల విరగ్గాస్తోంది.

చిన్నమ్మ జాజిపందిరి కింద మంచం వాల్చుకుని పడుకున్నది. నిద్ర రావటంలేదు. పక్కమీద అసహనంగా కదులోంది.

దేవయ్య నైట్ డ్యూటీకి వెళ్ళాడు. రాత్రంతా మిల్లులోనే పనిచేస్తాడు. ఉదయం ఆరుగంటలకి దిగుతాడు. తమ పల్లె చేరేసరికి మరోగంట పడుతుంది. వారానికి రెండు రోజులు దేవయ్య నైట్ డ్యూటీ చేస్తాడు. ఆ రెండురోజులు తన కంటికి నిద్రరాదు. నోటికి ఏదీ సయించదు.

పక్కగ ఏదో అలికిడి కాగానే చటుక్కున తిరిగి

చూపింది చిన్నమ్మ. పక్కనే మరిది రంగయ్య!

నవ్వుతున్నాడు. అతని పద్ధతి విచిత్రంగా వుంది.

చిన్నమ్మ మంచంమీద దిగ్గునలేచి కూచుంది.

"ఏమిటి రంగా, ఏం కావాలి?" ఆమె కంఠంలో రవంత కఠినత్వం తొొంగిచూసింది.

"ఏంలేదు, ఏంలేదు."

"ఈ రాత్రప్పుడు యిక్కడ నీ కేం పని?"

"అబ్బే మరేంలేదు. నువ్వు ఒక్కదానివే వున్నావు. అన్న లేడుగద. కాసేపు కబుర్లు చెపుతావేమోనని!"

"నీతో నాకు కబుర్లేంటి? అందులోను యిట్టాంటి సమయంలో కబుర్లేంటుంటాయి? ఎల్లు యింకెప్పుడూ యిలా అరదం పరదంలేని మాటలు సెప్పొద్దు."

"అదేంటి చిన్నమ్మ, యియ్యలంటే అన్నయ్యాని మను వాడేవుగాని లేకుంటే ముందుగాలనించీ నేన్నీకు బావ వరసేగా!"

"ఇదివరలో అయితే గావచ్చు. గానిప్పుడు మీ అన్నను పెల్లాడాక మరిదివి. కొడుకుతో సమానం. తల్లిలాంటి ఒదినెమ్మతో మాట్లాడే యిదానమేనా యిది?"

"అయ్యన్నీ పురాణాల కబుర్లు చిన్నమ్మ! అయినా పాండవులు అయిదుగురికీ దవుపతి ఒక్కతే పెల్లాంగందా! అట్టాగే మా యిద్దరన్నదమ్ములకీ ఉమ్మడిగా."

మరుక్షణం రంగయ్య చెంప చెళ్ళుమంది.

"ఇంకొక్క చనం యిక్కడుండొద్దు. వెంటనే ఇక్కడ్నించపో! లేకపోతే నిన్ను జంపి నేను జత్తాను" పక్కనే పడివున్న కొడవలి తీసింది చిన్నమ్మ.

"చిన్నమ్మా! మర్యాదగా నా మాటిన్నావా సరే! లేకపోతే నీ కాపరానికి ఎసరెట్టేస్తాను. నే నెంతకయినా

తెగించినోడిని. నా సంగతి నీకు సరిగ్గా తెల్దు."

"ఫోఫో. అనవసరంగా వాక్కు. నీలాంటి పనికిమాలి నోల్ల మాటలు యినేటంత సేతగానివోడు గాదు నా పెనిమిటి."

"ఊ, జూస్తాను, జూస్తాను" తీవ్రంగా చిన్నమ్మ కళ్ళ లోకి చూసి, వెళ్ళిపోయా డక్కడ్నుంచి రంగయ్య.

6

"అలా కూర్చో బాబూ! ఏం కావాలి?"

అడిగాడు డిటెక్టివ్ కిరణ్ ఆ కుర్రాడి వంక పరీక్షగా చూస్తూ.

"నా పేరు దేవయ్య బాబూ! తమరి గురించి బాగా యినివున్నాను. తమతో కూసంత పనిపడి వొచ్చాను" అన్నాడు ఆ కుర్రాడు.

"అలా కూచో, ఫరవాలేదు. నా ముందు ఎవరూ నిల్చోనవసరంలేదు. తాపీగా కూచుని ఏం కావాలో చెప్పు. నా చేతనయిన సహాయం చేస్తాను."

"మాది రాజమండ్రి తాలూకా పాలచర్ల గ్రామం బాబూ! నేను రాజమండ్రిలో పేపరు మిల్లులో పని చేత్తన్నాను. ఎన్నెమ్మార్ పని బాబూ! రెండు రోజుల క్రితం నా పెల్లాన్ని యెవరో దారునంగా జంపేరు బాబూ!" దేవయ్య నోటినుంచి మాటలు రాలేదిక. అతని కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

"విన్నటి పేపర్లో ఈ వార్త చూశాను. పాలచర్ల పేరు చూడగానే అంతా పూర్తిగా చదివాను. పాలచర్ల కరణం గారి అబ్బాయి నాతో కలిసి చదువుకున్నాడు. నేను రాజ మండ్రిలో కొన్నాళ్ళు చదివాను. పాలచర్ల కూడా రెండు మూడుసార్లు వచ్చి వున్నాను."

"అలాగా బాబూ! తమ తో మనవి జేసుకునే దేమంటే, నా పెల్లాం చిన్నమ్మ దేవత బాబూ! అలాంటి ఆడోల్లు చాలా అరుదుగా వుంటారు—తమరు పేపర్లో ఏం జది వారో తెల్దుగాని, అసలు జరిగిన యిసయం వివరంగా చెబు తాను యినండి బాబూ! ఈ యిసయంలో తమరు కలుగ జేసుకుని నా దేవమ్మని జంపిన దురమార్గుడికి ఉరిశిచ్చ ఏయించండి బాబూ...."

కొన్ని క్షణాలు ఆగాడు దేవయ్య. తర్వాత మళ్ళీ గొంతు సవరించుకుని చెప్పాడు. అతను చెప్పిన కథనం సారాంశం యిది:

రెండురోజుల క్రితం దేవయ్య నైట్ డ్యూటీకి వెళ్ళాడు. అతని భార్య ఆ సమయంలో పుట్టింట వుంది. పెళ్ళయ్యాక మొదటి పండుగ దీపావళి వచ్చింది. దేవయ్య మామ కూతుర్ని పండుగకి పిల్చుకు వెళ్ళాడు.

చిన్నమ్మకి తోడబుట్టిన అన్న తప్ప మరెవరూ లేరు. తల్లి చిన్నతనంలోనే పోయింది.

చిన్నమ్మని యింటికి తీసుకువెళ్ళిన రాత్రే చిన్నమ్మ తండ్రికి విపరీతమైన గుండె నొప్పి వచ్చింది. చిన్నమ్మ అన్న చిన్నమ్మని ఒక్కదాన్నీ యింట వదిలి ఆ రాత్రికి రాత్రి పక్కనే వున్న దివాన్ చెర్వు గ్రామంలో వున్న డాక్టర్ దగ్గరకు తండ్రిని తీసుకుపోయాడు. ఆ రాత్రి అంతా డాక్టరుగారు ఏవేవో మందులు వేస్తూ చిన్నమ్మ తండ్రి బాధకు ఉపశమనం కలిగించాడు. అంతసేపూ చిన్నమ్మ అన్న తండ్రితోనే హాస్పిటల్లో వుండిపోయాడు.

తెల్లవార్తుంగా చిన్నమ్మ అన్న తండ్రిని తీసుకొని పాలచర్ల తిరిగొచ్చాడు. అయితే అప్పటికే ఘోరం జరిగి పోయింది. నట్టింట చెల్లెలి శవం మెడలో ఉరిపోసుకుని

వేలాడుతోంది. గబగబ మెడనుంచి ఉరి తప్పించాడు. కాని అప్పటికే ప్రాణం పోయింది.

బహుశా ఏ రాత్రో ఉరిపోసుకుని చచ్చిపోయి వుంటుందని అనుకొన్నారు. అయితే యెందుకు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకొన్నదో యెవరికీ అర్థం కాలేదు. దేవయ్య బాధలుపెట్టే మనిషి కాదు. భార్యని ప్రాణసమానంగా చూసుకుంటాడు.

అయితే ఆ తర్వాత డాక్టరు పరీక్షలో తేలిన దేమంటే చిన్నమ్మ ప్రాణం పోయేముందు మానభంగం చెయ్యబడ్డదని! ఊరి జనానికి ఆమె ఆత్మహత్యకు కారణం తెలిసింది. ఎవడివల్లనో మానభంగం చెయ్యబడ్డ చిన్నమ్మ ఆ అవమానం భరించలేక, అభిమానవతి కాబట్టి నట్టింట ఉరిపోసుకుని ప్రాణం తీసుకున్నదని అందరూ అనుకున్నారు.

ఉదయమే యింటికి చేరిన దేవయ్య భార్య మరణవార్త విని కంటికి మంటికీ ఏకధారగా ఏడ్చాడు. పోలీసులు వచ్చారు—శవ పంచాయితీ జరిగింది. చిన్నమ్మ శవాన్ని రాజమండ్రి తీసుకుపోయి శవ పరీక్ష చేశారు. మానభంగం చెయ్యబడ్డ విషయం నిర్ధారణ చేశారు. పోలీసులు అది ఆత్మహత్య కావచ్చునని అభిప్రాయపడుతున్నారు....

దేవయ్య చెప్పిన విషయాలన్నీ శ్రద్ధగా విన్నాడు డిటెక్టివ్ కిరణ్.

"ఇది ఆత్మహత్య కాదేమోనని నీ అనుమానం, అవునా?" అనడిగాడు దేవయ్యను.

"అవును బాబూ! నా దేవమ్మని యెవడో అన్యాయంగా జంపేశేడు బాబూ! నా చిన్నమ్మని పాడుచేసి మరీ జంపేశేడు....కచ్చితంగా జెప్పగలను బాబూ!"

"అలా అనే ఎందుకనుకున్నావు? ఆమె అవమానం

భరించలేక ఆత్మహత్య చేసుకున్నదేమో?”

“నా అనుమానానికి అరదముంది బాబూ! ఉరోసుకుని చచ్చినోల్లని యిదవరలో జూసేను. ఉరేసుకున్నోల్ల కల్లు ఎల్లుకొస్తాయి. నాలి కూ్కాడా బయటికి పొడుచుకొస్తది. కాని యిదేం చిన్నమ్మ యిసయంలో జరగలేదు. కల్లు మామూలుగా మూసుకొని వున్నాయి, నాలిక బయటికి రావడం గాని, పల్లగిట్టల కర్సుకోవటం గాని జరగ లేదు....”

కిరణ్ తలూపాడు.

“నీ అనుమానం ఆలోచించ దగ్గదే! అయితే చిన్న మ్మకు గాని, నీకు గాని పాలచర్లలో శత్రువులెవరయినా వున్నారా?”

“ఉన్నారు బాబూ! ఒకల్లు యిద్దరూ గాదు, సాలామంది. మీ దగ్గిర దాపరికం దేనికి గాని, ఓసారి మా అయ్య గూడా చిన్నమ్మ ఒంటిమీద సెయ్యి ఎయ్యబోయాడంట. నా తమ్ముడు రంగడు గూడా నే నింట లేనప్పుడు దాంతో ఎకసక్కాలాడబోయాడంట. నే నిక ఆ యింటినించి ఏరే కాపరం పెట్టేదామనుకున్నాను. అయితే పెల్లి కెదిగిన సెల్లి వుందనీ, నేను పోతే దాని పెల్లి మా అయ్య జెయ్య లేడనీ అలాగే కాలం గడుపుకొస్తున్నాను. ఇంతలో యీ గోరం జరిగిపోనాది” మళ్ళీ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు దేవయ్య.

“ఊ, అయితే వాళ్ళిద్దరు ఆమెని చంపి వుండవచ్చని నీ అనుమానమా?”

“అదికాదు బాబూ! మీరు దానికి నాకు పగోల్లు ఎవ రున్నారంటే జెప్పుకొచ్చాను. అది నా కింతకు ముందు యింకా కొన్ని సంగతులుజెప్పింది. మా పెద్దనాన్నకొడుకు

చంద్రయ్య, అల్లుడు కనకారావు కూడా దాన్ని యిష్ట మొచ్చినట్లు మాట్లాడి పెళ్లాడమన్నారంట. అది ఆల్లిద్దరికీ బాగా బుద్ధి జెప్పి వొదిలిందంట."

"ఊఁ, అయితే యీ నలుగురూ అనుమానించదగ్గ వాళ్ళ లాగానే వున్నారు. ఈ నలుగురిలోను ఎవడో ఒకడు యీ అత్యాచారం, హత్యచేసి వుండవచ్చును. ఆ విషయం తర్వాత తెలుస్తుంది. నీ క్కూడా ఎవరైనా గిట్టనివాళ్ళు పాలచర్లలోగాని, చుట్టుపట్ల గ్రామాల్లోగాని వున్నారా?"

"ఓసారి మా వూళ్ళోనే మోతుబరిరైతు కొడుకుతో కొట్లాట జరిగింది బాబూ! అది శాన్నాల్ల కితం. ఆ తర్వాత మల్లీ మేం మాట మాట కలుపుకున్నాం కూడా."

"ఊఁ, యింకా గుర్తు చేసుకుని చెప్పు."

"నా పెల్లయ్యాక ఓనాడు మేమిద్దరం గుడికి పోయొస్తుంటే మునసబు కొడుకు మోటుగా ఏదేదో అన్నాడు బాబూ! నేను వెంటనే ఆడి చొక్కాలు పట్టుకున్నాను. యింతలో నలుగురూ వొచ్చి యిడిపించారు."

"ఊఁ. ఆ కోపంతో అతను చిన్నమ్మని యేమైనా చేసి వుండవచ్చునని అభిప్రాయపడుతున్నావా?"

"ఏమో బాబూ, యీ మనుసుల కుల్లు తెల్సుకోడం అంత తేలిక్కాదు."

"సరే. ఈ విషయం నేను పరిశోధిస్తాను. ఈ రోజే బయల్దేరి పాలచర్ల వస్తాను. ఇంకా చెప్పవలసిన మర్చి పోయిన ముఖ్యమైన విషయాలేమన్నా వుంటే చెప్పు!"

"అంతే బాబూ! తమరు యెలాగయినా యీ గోరం జేసినోడ్ని పట్టుకుని నా చిన్నమ్మకి యేసినట్టే వురేయించండి బాబూ! అప్పుడే నా చిన్ని ఆతమకు కూసంత వూరట కలుగుద్ది!"

"సరే, నువ్వు నిశ్చింతగా వుండు. నే చూస్తాగా."

"తమరామాటన్నారు సాలు బాబూ!" అంటూ దేవయ్య పై పంచలో కట్టితెచ్చిన డబ్బు విప్పి కిరణ్ ముందు టేబిల్ మీద పెట్టాడు.

"ఏమిటిది?"

"మీకు నా కున్నంతలో యేదో యిచ్చుకుంటున్నాను బాబూ, కాదనకండి" దేవయ్య వేడికోలుగా అన్నాడు.

"వద్దు, తీసుకువెళ్ళు! ఈ డబ్బు సంపాదించటంకోసం నువ్వు యెన్ని అగచాట్లు పడివుంటావో, యెవరెవర్ని బతిమాలుకొని వుంటావో నే నర్థం చేసుకోగలను. నేను యీ కేసులో డబ్బాశించి పని చెయ్యటంలేదు. నిష్కల్మషమైన మీ పల్లె ప్రజల్లో కూడా పాతుకుపోయిన రాక్షసుల్ని బయట పెట్టడంకోసం, నా స్నేహితుడి వూళ్ళో జరిగిన అత్యాచారం వెనక దాగిన కుళ్ళుని బయటికి లాగటంకోసం పని చేస్తాను. నే నిప్పుడే వస్తున్నాను. నువ్వు నాతో రా!" అన్నాడు కిరణ్.

కిరణ్ వెంటనే ప్రయాణానికి యేర్పాట్లు చేసుకోవటం మొదలెట్టాడు. దేవయ్య వోపక్కగా నిల్చుని చూస్తున్నాడు.

"బిందూ! రెండురోజులపాటు రాజమండ్రి కేంప్. బహుశా మరో రెండు రోజులు తీసుకున్నా తీసుకోవచ్చు. అవసరమయితే ఫోన్ చేస్తాను....!" అన్నాడు భార్యని పిలిచి.

బిందు తలూపింది.

కిరణ్ రాజదూత్ బయటికి తీశాడు. అందులో కేంపు కవసరమైన పరికరాలు సర్దుకున్నాడు. దేవయ్యని వెనక కూచోమన్నాడు. పది నిమిషాల్లో రాజదూత్ కాకినాడ పొలిమేరలు దాటి రాజమండ్రి రోడ్న దూసుకుపోయింది.

7

"ఇదే బాబూ, మా యిల్లు" అన్నాడు దేవయ్య. కిరణ్ రాజదూత్ ఆపాడు.

"హత్య జరిగిన స్థలం చూపించు...." అన్నాడు కిరణ్.

"అలాగే బాబూ! మా అత్తారిదీ యిదే వూరు. మెరక వీధిన వుంటున్నారు. రండి బాబూ దారి చెపుతాను."

"మోటారుసైకిలు వెళ్ళగలదా?"

"వెళ్తుంది బాబూ!"

"అయితే వెనక కూచుని దారి చెప్పు."

దేవయ్య దారి చూపుతుండగా కిరణ్ రాజదూత్‌ని చిన్నమ్మతండ్రి యింటి దగ్గిర ఆపాడు.

దేవయ్య లోపలికి తీసుకువెళ్ళాడు. హడావిడిగా కుర్చీ తెచ్చి వెయ్యబోతుండగా కిరణ్ వారించి, "ఆమె చని పోయిన స్థలం చూపించు" అన్నాడు.

"ఈ గదే బాబూ! ఈ యింటికి వున్నవి యీ రెండే గదులు." అన్నాడు దేవయ్య.

కిరణ్ ఆ గదిని పరిశీలనగా చూశాడు.

"ఇదిగో ఈ దూలానికే బాబూ ఉరేసుకుని ఏల్లాడింది" అని చూపించాడు దేవయ్య.

ఇంతలో ఓ ముసలతను, ఓ యువకుడు అక్కడికి కొచ్చారు.

"ఇతను మా మామ. ఇతను మా బావమర్ది" అని వాళ్ళిద్దర్నీ కిరణ్‌కి పరిచయం చేశాడు దేవయ్య.

కిరణ్ ముసలతనివంక పరీక్షగా చూశాడు. కూతురు పోయిన దుఃఖంనించి అతనింకా తేరుకోలేదు. చిన్నమ్మ అన్న కూడా దుఃఖంతో కుంగిపోయి వున్నాడు.

నేలంతా వెతికాడు. ఎక్కడా అనుమానాస్పదమైన వస్తువులేవీ కనిపించలేదు.

"చిన్నమ్మ పోయాక యీ గదిని శుభ్రం చేశారా?"

"లేదు బాబూ! పోలీసులు సామాను లేవీ కదపవద్దనీ, ఈ గదిలో యెవరూ రావద్దనీ చెప్పారు. అయితే తమ రొచ్చారని తలుపులు తీశాను."

"మరి నా కింతసేపు యెందుకు చెప్పలేదు? వాళ్ళు వద్దన్నాక లోపలికి మనం చొరబడకూడదు. కొన్ని ముఖ్యమైన వేలిముద్రలు, యిది హత్యే అయితే, అందుకవసరమైన ఆధారాలు మాసిపోయే అవకాశముంది. మరి పోలీసులు యీ గదిని సీలు చెయ్యలేదా?"

"అబ్బే అలాంటిదేం జెయ్యలేదు బాబూ! తాళం కూడా మాదే ఏయించారు. అంచేత నేను తెలియక తలుపు తీసేసేను."

"ఆ ఇన్‌స్పెక్టర్‌గారితో నేను మాట్లాడుతానులే! ఇన్‌స్పెక్టర్ జగదీష్ యీ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేపర్లో చూశాను. ఆయన నాకు బాగా తెలుసు."

"అలాగా బాబూ!"

"నేనోసారి రాజమండ్రి వెళ్ళి ఈ కేసు విషయాలు పూర్తిగా తెలుసుకుని వస్తాను. ఇది హత్యో, ఆత్మహత్యో తేల్చుకున్నాక పరిశోధించటం మంచిదని నా అభిప్రాయం" అన్నాడు కిరణ్.

"చీకటి పడిపోతోంది బాబూ! ఈ రాత్తిరికి యిక్కడా వుండి పొద్దుటే ఎల్లగూడదా?"

"ఆలస్యం చెయ్యకూడదు. నే నుండాలనుకుంటే యిక్కడ నాకు కానివాళ్ళెవరు? కరణంగారి యిల్లు వుండనే వుందిగా. ఆఁ....కరణంగారు పోయాక నేను మళ్ళీ ఇక్క

డికి రాలేదు. వాళ్ళ తమ్ముడుగారు కరణీకం చేస్తున్నారని విన్నాను. నేను రాజమండ్రి వెళ్తున్నాననీ ఉదయం వస్తాననీ ఆయనకు కబురుచెయ్యి. రాలేదనుకుంటారు" అంటూ కిరణ్ రాజదూత్ యెక్కబోతూ దేవయ్యని పక్కకి పిలిచి—

"చిన్నమ్మ చనిపోయినరోజు రాత్రి మీ తమ్ముడు, మీ తండ్రి, కనకారావు, మీ పెత్తండ్రి కొడుకు చంద్రయ్య పాలచర్లలో వున్నారో మరెక్కడికైనా పోయారో ఆ వివరాలన్నీ నేను వచ్చేలోపల సేకరించిపెట్టు" అన్నాడు మెల్లిగా.

దేవయ్య తలూపాడు.

8

"వెల్‌కమ్ మిస్టర్ కిరణ్. ఏమిటి పనిమీద వచ్చారు?" ఆహ్వానించాడు ఇన్‌స్పెక్టర్ జగదీష్.

"పనిమీదే వచ్చాను. పాలచర్ల గ్రామంలో జరిగిన చిన్నమ్మ హత్య విషయం పరిశోధించాలని వచ్చాను" అని కిరణ్ అంటుండగానే జగదీష్ అడ్డు తగిలి, "అది హత్యే అని మీరెలా నిర్ణయించారు? ఆత్మహత్య కావచ్చు కదా!" అన్నాడు.

"వెరీ సింపుల్ మిస్టర్ జగదీష్. ఆమె ఉరి వేసుకున్నదని చెప్పబడుతున్న యింటి పైకప్పు దూలం చాలా తక్కువ యెత్తులో వుంది. దానికి వేలాడుతున్న తాడు కూడా చూశాను. దాని ముడి వురి వేసుకునే జారుముడి కాదు. ఆ తాడు మెడలో వేసుకుని ఉరి తీసుకునేటంత ఎత్తులో యింటి పై కప్పులేదు. కాళ్ళు నేలమీద ఖచ్చితంగా ఆని తీర్తాయి.

నేను చిన్నమ్మని చూడలేదు. కాని చిన్నమ్మ దేవయ్యల

ఫోటో చూశాను. అది నిల్చుని తీయించుకున్న ఫోటో. దాన్నిబట్టి చిన్నమ్మ ఎత్తు అయిదడుగుల రెండంగుళా లుంటుందని ఊహించాను. ఆమె పొడవుకు పై దూలానికి వేలాడుతున్న తాడు చివరకు మధ్యదూరం అయిదడుగుల లోపే వుంది. బట్ అయామ్ సారీ టు సే, మీ పరోక్షంలో ఆ గది నేను పరీక్ష చేశాను. మరోలా అనుకోవద్దు'' అన్నాడు కిరణ్.

జగదీష్ వెంటనే, "దానికేం ఫరవాలేదు. మీరు డిపార్టు మెంటుకు కొత్తకాదు. మీరు మా డిపార్టుమెంటుకి ఎన్నో సార్లు జటిలమైన కేసుల్ని పరిష్కరించారు. మా ఫ్రెండు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కి మీరు గురుతుల్యులని కూడా నాకు తెలుసు....

ఆ, మీ అంచనా సెంటీపర్సెంట్ కరెక్టు. చిన్నమ్మది ఆత్మహత్య కాదు. హత్యే! ఆమెని చంపేసిన తర్వాత అది ఆత్మహత్యగా రుజువు చెయ్యటానికి ఆమెని గోడకి నిల బెట్టి దూలానికో తాడు కట్టి దాన్ని ఆమె మెడలో హడా విడిగా తగిలించేసి పారిపోయాడు హంతకుడు! అది ఆత్మ హత్య అని రుజువు చెయ్యటానికి జాగ్రత్తలు తీసుకోలేదు. చనిపోయాకనే తాడు మెడకు తగిలించబడిందని డాక్టరు రిపోర్టులో వుంది.'' అన్నాడు.

"సో, డెఫినిట్లీ యిటీజ్ మర్డర్! ఓసారి పాథాలజిస్ట్ రిపోర్టు చూపిస్తారా??''

"బై ఆల్‌మీన్స్. ఇప్పుడే అరగంట క్రితమే వచ్చింది రిపోర్టు. చూడండి'' అంటూ బయటకి తీశాడు జగదీష్.

కిరణ్ అందుకుని చూశాడు.

అందులో, హత్య రాత్రి పదకొండు-పన్నెండు గంటల మధ్య జరిగినట్టు, మానభంగంచేసి హింసించి చంపినట్టు,

వెజైనల్ బ్లీడింగ్ విపరీతంగా జరిగి చిన్నమ్మ ప్రాణం పోయినట్టు, ఆమె గర్భకోశంలోని సెమినల్ ఫ్లూయిడ్ ఒక వ్యక్తిది కాదని, యిద్దరు వేర్వేరు వ్యక్తులదనీ, వరసగా ఒకరి తర్వాత మరొకరు ఆమెని అనుభవించి తర్వాత గర్భకోశంలో పొడిచి చంపినట్టు వివరంగా వ్రాయబడివుంది.

కిరణ్ డాక్టర్ రిపోర్టును జగదీష్‌కి తిరిగిచ్చేస్తూ 'సెమినల్ ఫ్లూయిడ్‌ని లేబరేటరీ పరీక్షకు పంపించారా?" అనడిగాడు.

"పంపించాం. ఇంకా రిజల్టు రావాల్సివుంది."

"ఆల్‌రైట్ ఆ ఫ్లూయిడ్ రిజల్టునిబట్టి అనుమానితుల్ని పరీక్షచేస్తే హంతకుడు చాలా తేలిగ్గా దొరికిపోతాడు, అవునా?"

"యు ఆర్ రైట్. అది ఫోరెన్సిక్ నిపుణులు చాలా తేలిగ్గా కనుక్కోగలరు."

"సో, కేస్‌కి తుదిరూపం వచ్చినట్టే! మీరు నాతో రేపు ఉదయం పాలచర్ల రండి. హంతకుడికి అరదండాలు తగిలిద్దురుగాని" అన్నాడు కిరణ్ లేచి.

9

మర్నాడు ఉదయం—

డిటెక్టివ్ కిరణ్, ఇన్‌స్పెక్టర్ జగదీష్ తక్కిన బలగంతో పోలీస్‌వాన్ పాలచర్ల చేరింది.

డిటెక్టివ్ కిరణ్ దేవయ్యను దగ్గరికి పిలిచాడు.

"నేను చెప్పిన ఆరా తీశావా?" అడిగాడు.

"ఆరాతీశాను బాబూ! ఆ రాత్రి మా అయ్య యింటి దగ్గరే వున్నాడు. మా తమ్ముడు రంగయ్య, మా పెత్తండ్రి గారి అల్లుడు కనకారావు దివాన్ చెర్వులో టెంట్ సిన్మా

జూడటానికి రెండో ఆటకు బోయారట. అల్లని దివాన్ చెర్వు పిన్మాలో జూపినవాల్లు కూడా చాలామందున్నారు. మా బావమర్ది మా మామను హాస్పిటల్‌కి తీసుకువెళ్ళినపుడు రోడ్డుమీద కొస్తే ఆల్లు రోడ్డుమీద కనబడ్డారంట కూడా.

తరువాత మా పెత్తండ్రి కొడుకు చంద్రయ్య సంగతి కూడా కనుక్కున్నాను. ఆడు పంచాయితీ ఎన్నికల గురించి ఆ రాత్రి జరిగిన మీటింగంలో రాత్తిరి రెండు గంటల దాకా పంచాయితీ బోర్డాపీసులో ఊసులాడుతూ గ్రామ పెద్దలతో వున్నట్టు తెలిసింది'' అన్నాడు దేవయ్య.

"గుడ్. అన్ని విషయాలు బాగా ఆరాతీశావు. నీ భార్యను మానభంగం చేసి చంపినది ఒక్కడు కాదు, యిద్దరు. వాళ్ళు ఎవరో కాదు, నీ తమ్ముడు రంగయ్య, పెత్తండ్రి అల్లుడు కనకారావు'' అన్నాడు కిరణ్ మెల్లగా. అతనికే వినిపించేంత లోస్వరంలో.

దేవయ్య విస్తుపోయి చూశాడు.

"ఆ విషయం యిప్పుడే రుజువు చేస్తాను, రా. మీ అత్తవారింటికి యిటు అటు ఎదురుగా వున్న యిళ్ళలో ఎవరోకరు వీళ్ళిద్దరిలో ఎవర్నయినా చూశారో లేదో కనుక్కుందాం రా'' అన్నాడు కిరణ్.

జగదీష్ కిరణ్‌వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"మీరుకూడా నాతో రండి'' అంటూ కిరణ్ చుట్టుపట్ల యిళ్ళలో ఎంక్వయిరీ చేశాడు.

వీధి చివర్న వున్న ఓ యింట్లో అనుకున్న సమాచారం దొరికింది. ఆ యింట్లో వున్న ఉబ్బసం వ్యాధి ముసలాయన రాత్రి పన్నెండు గంటల ప్రాంతాల కననారావు, రంగయ్యే చిన్నమ్మ పుట్టింట్లో నించి కంగారుగా బయటికొచ్చి దివాన్ చెర్వు రోడ్డున సైకిళ్ళు వేసుకుని పోవటం చూశానని

చెప్పాడు.

డిటెక్టివ్ కిరణ్ ఇనస్పెక్టర్ జగదీష్ వంక చూసి, "సో మిష్టర్ జగదీష్! చిన్నమ్మని మానభంగం చేసి హత్య చేసిన నేరానికి కనకారావు, రంగయ్య అనబడే యిద్దరు వ్యక్తుల్ని అరెస్టు చెయ్యవచ్చును. వాళ్ళిద్దరి స్పెరమటో జోవాని ఫోరెన్సిక్ నిపుణులు చిన్నమ్మ గర్భాశయంలో దొరికిన సెమినల్ ఫ్లూయిడ్‌తో చాలా తేలిగ్గా పోల్చగలరు.

"వాళ్ళిద్దరు హత్యాసమయంలో తాము పాలచర్లలో లేమని నేరం తమమీదకు రాదనీ అతి తెలివికి పోయారు. కాని నేరం దాగదు, నేరస్తుడు తప్పించుకోలేడు" అన్నాడు. □

మర్యాదస్తుడు

జడ్జి : (దొంగతో) నీవు హోటల్లో దొంగతనం చేశావా?

దొంగ : ఔనండి.

జడ్జి : భోజనానికి బదులు రూపాయల్ని ఎందుకు దొంగిలించావ్?

దొంగ : నేను మర్యాదస్తుడను. డబ్బిచ్చి భోంచేస్తాను.

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

బుస్సా బాలచందర్

కొత్తవాళ్లను నమ్మకు!

"ట్రుక్ ....టక్" మని తలుపు చప్పుడవటంతో ఆవులిస్తూ లేచి తలుపు తీశాను.

"రాజుగారి ఇల్లు ఇదేనాండీ!" అని అడుగుతున్నాడు ఆ ఆగంతకుడు. కళ్లు నులుపుకుని అతన్ని పరీక్షగా

చూశాను. కనీసం అతని ముఖమైనా ఎక్కడా చూసిన గుర్తు లేదు నాకు.

"ఆః నేనేనండి రాజును" అన్నాను.

"ఓః గ్లాడ్ టుమీట్ యు సార్!!" అన్నాడు చెయ్యి జాపుతూ.

"సేమ్‌టుయూ" అంటూ కరచాలనం చెయ్యక తప్పింది కాదు నాకు.

నాకు కొత్తవాళ్ళంటే చికాకు! ఎంతో బాగ తెలిసిన వాళ్ళయితే తప్ప నేను మాట్లాడను. బాగా చనువుంటేగాని వాళ్ళతో కలిసి తిరగను.

నేనేం మాట్లాడక పోవటం చూసి అతను "ఈ గదిలో వుండేది మీరొక్కరేనా...." అంటూ అర్ధోక్తిలో ఆగి పోయాడు.

అసలు అతనెవరో తెలుసుకోవాలనిపించింది ముందు నాకు—"మీరు...." అందుకున్నాడతడు, "ఓః అయామ్ సారీ. నేనెవరో మీకు చెప్పనేలేదుగా! ఐయామ్ శేఖర్ బికాం" అన్నాడతడు.

అతడు శేఖరుడైతే నాకెందుకు, సుకుమారుడైతే నా కెందుకు!! అతనికి నాతో నా గదితో పనేం వచ్చింది, అది కావాలి నాకు, అదే అడిగాను.

"సార్! నిజంగా మీలాగా నిర్మొహమాటంగా వుండే వాళ్ళంటే నాకెంత యిష్టమో నేను చెప్పలేను" అన్నాడు పరవశించిపోతూ.

నాకు ఒక్కసారి కోపం ముంచుకు వచ్చింది. కమ్మటి నిద్ర పాడు చెయ్యటమే గాకుండా బోరె త్తిస్తున్నాడు. ఇటు వంటి వాళ్ళంటే నాకు చెడ్డ మంట.

"పనేమిటి" సూటిగా అడిగాను.

అతను బిత్తరపోయినట్టు కనిపించినా సర్దుకొని— "మరేం లేదండి, నాకెక్కడా రూమ్ దొరకలేదు. దొరికినా నా ఒక్కడికి, అంతంత అద్దెలు పెట్టడం వేస్ట్ అనిపించింది...."

నాకు చిర్రెత్తుకొచ్చింది "ఐయామ్‌సారీ! ఈ గది నాకే చాలటం లేదు" అన్నాను. అతన్ని మరీ ముందుకెళ్ళనివ్వడం యిష్టంలేక.

"సార్! సార్!! మీరలా అంటే నేను అన్యాయంగా చచ్చిపోతాను. యట్‌లీస్ట్ నాకు రెండు నెలలైనా చోటివ్వండి ప్లీజ్!"దాదాపు కాళ్ళమీదపడి ఏడ్చినంత పనిజేశాడు.

ఈసారి బిత్తరపోవటం నా పనయ్యింది. ఎక్కడినించో హఠాత్తుగా వూడిపడి చోటివ్వమనే ఈ 'వామను' డెవడా అనిపించింది నాకు. సరే యిదేమిటో చూద్దామనిపించింది. ఆ మాటే అనేసాను.

"థాంక్యూ సార్! థాంక్యూ వెరీమచ్! మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను. మెనీ మెనీ థాంక్స్" అన్నాడతను నేనేదో అతని ప్రాణం కాపాడినట్టుగా.

"సరే సార్! నేను రేపు వచ్చేస్తాను" అన్నాడు హడావుడిగా వెళ్ళిపోతూ. అతనలా పరిగెత్తటం చూస్తుంటే నాకు నవ్వాగలేదు.

ఆ రోజు ఆదివారం, స్వయం పాకాన్ని సస్పెండ్ చేసి, హోటల్‌లో భోంచేసి, మార్నింగ్ షోకి వెళ్ళొచ్చి తీరిగ్గా నిద్రపోదాంకదా అని పడుకుని ఇలా కునుకు తీసానో లేదో అలా అతనొచ్చాడు.

ఇంతలో ఆవలింత పరామర్శించటంతో, ఆలోచనలకు స్వస్తిచెప్పి తలుపేసి మళ్ళీ మంచంపైన వాలాను.

2

కాలచక్ర పరిభ్రమణంలో మూడు నెలలు గిర్రున తిరిగి పోయ్యాయి. మూడు నెలల్లో శేఖర్, నేను ఎంతగా కలిసి పోయ్యామంటే బహుశా మాలాంటి స్నేహితులు ఈ ప్రపంచంలో వుండరేమోననిపించింది నాకు.... సారీ....మాకు.

ఇదివరకు ఒంటరిగా కాలం ఎలా గడిపానో తలుచుకుంటే నాకే ఆశ్చర్యమేసింది.

శేఖర్ని పేరుపెట్టి పిలవడం, శేఖర్ నన్ను 'సార్' అని పిలవడానికి బదులుగా 'గురువుగారు' అనటం, అప్పటికి, ఇప్పటికి జరిగిన మార్పులు.

ఆ రోజు ఆఫీసునించి వచ్చేసరికి రూముకు తాళం వేసుంది. మా ఆఫీసు అయిపొయ్యే టైముకి, అక్కడికి శేఖర్ రావటం, ఆ తరువాత ఇద్దరం కలిసి రూమ్కి రావటం ఆనవాయితీ. ఆ రోజు ఆఫీసుకి రాకపోవడమే కాకుండా, రూమ్కికూడా రాకపొయ్యేసరికి నేను కించిత్తు ఆశ్చర్యపోయాను.

డూప్లికేట్తో తాళం తీసి లోపలికి అడుగుపెట్టిన నేను స్థంభించిపోయాను. కారణం రూమ్లో శేఖరానికి సంబంధించిన వస్తువొక్కటీ లేదు. చివరికి శేఖర్ అగ్గిపెట్టె, సిగిరెట్ కేస్ కూడా లేవు.

కళ్ళు గట్టిగా నులుముకుని మళ్ళీ చూసాను. కాని దృశ్యం మారలేదు. నా కళ్ళు తిరిగిపోతున్నట్టుగా అనిపించి కళ్ళు మూసుకుని మంచంమీద కూలబడ్డాను. మనసంతా శూన్యంగా వుంది. మెదడు మొద్దుబారిపోయింది.

శేఖర్ లేని ఆ గదిలో ఇంకొక్క క్షణంకూడా వుండలేక పొయ్యాను.

మళ్ళీ రూంకి తాళంవేసి నా కాళ్ళు నడిపించిన చోటికల్లా

నడిచాను. ఇంతలో కారు హారన్ 'బొయ్‌మని' వినిపించటంతో వులిక్కిపడి, రోడ్డుమీది నుంచి ఫుట్‌పాత్‌మీదికి వచ్చాను.

"ప్రైవేటు డిటెక్టివ్ వర్మ" అన్న సైన్‌బోర్డు కనిపించింది, ఎదురుగా. అప్పుడర్థమయ్యింది నాకు, ఒక్కొక్కసారి ఆవేదన మనిషిని ఏంత దూరమైనా నడిపిస్తుందని.

నాకున్న మంచి స్నేహితుల్లో వర్మ మొదటివాడు. అతన్ని చూస్తేనే నాకు పెద్ద రిలీఫ్.

హుషారుగా మేడ మెట్లెక్కి అతని ఆఫీసు గదికేసి నడిచాను.

నన్ను చూస్తూనే డిటెక్టివ్ వర్మ లేచి "వాట్ ఎ వండర్ కమాన్! కమాన్!" అంటూనే, టేబుల్‌పైన వున్న బెల్ నొక్కాడు. మళ్ళీ నావైపు తిరిగి "కమాన్! సిట్‌డౌన్ మై డియర్ బాయ్! ఏమిటిలా దారితప్పి వచ్చావు" అన్నాడు కరచాలనం చేస్తూ.

నేను కుర్చీలో కూర్చుంటూ "యు ఆర్ కరెక్ట్! నేను దారితప్పే వచ్చాను" అన్నాను.

"అయితే నా మీద ప్రేమకాదన్న మాట" కనురెప్పలు కొద్దిగా వాల్చి, కిందపెదవి విరుస్తూ అన్నాడు. ఆ ఫోజులో వర్మ మరింత బాగున్నాడు.

నేను నవ్వేస్తూ "నో! నో! డోంట్ మిస్ అండర్‌స్టాండ్ మి, నేను దారితప్పింది నీకోసమే" అన్నాను.

"ఐసీ! ఐయామ్ ప్రైసింగ్ యువర్ అడ్జస్ట్‌మెంట్" అన్నాడు నవ్వుతూ.

ఇంతలో నౌకరు కుర్రాడుకాబోలు వచ్చాడు "ఏంటి సార్!" అన్నాడు.

"చూడు బాంబే స్వీట్ హౌస్ కెళ్ళి రెండు ప్లేట్ల కళా

కాంద్, రెండు ప్లేట్ల దాల్‌మోట్, కూల్‌డ్రింక్స్ పట్టుకురా" అంటూ పదిరూపాయల నోటుతీసి వాడికిచ్చాడు.

కుర్రాడు తుర్రుమన్నాడు-"చూడు నేను స్వీట్లు గీట్లు ఏం తినను" అన్నాను.

"పిల్లీబాయ్! స్వీట్లు గీట్లు నిన్నెవడు తినమన్నాడు. కళాకాంద్, కాస్త హాట్, ఆ తర్వాత కూల్‌డ్రింక్ బస్" అన్నాడు డిటెక్టివ్ వర్మ నవ్వుతూ. నేనేం మాట్లాడలేక పోయాను.

మరో అరగంటలో కుర్రాడు తెచ్చిన కూల్‌డ్రింక్స్‌తో సహా అన్నీ అయిపోయాయి. వర్మ సిగరెట్ అంటించి నాకొకటి అందించాడు.

నేను సిగరెట్ అంటించగానే "ఆ: ఇప్పుడు చెప్పు రాజూ!" అన్నాడు వర్మ. ఆశ్చర్యపోవటం నా వంతయ్యింది "ఏమిటి చెప్పేది" అన్నాను.

"ఏంలేదూ! అయితే నీ ముఖం అట్లా ఎందుకు వాలి పోయింది. తప్పకుండా ఏదో వుంది. నాతో చెప్పటానికి సందేహమెందుకు" అన్నాడు వర్మ.

ఆవలించకుండానే దంతాలు లెక్కపెట్టే వ్యక్తి వర్మ.

నిజానికి నే నక్కడికి వచ్చింది రిలీఫ్‌కోసం. ఆ రిలీఫ్ దొరకడమే కాకుండా ఆ సమయాన్ని చక్కగా ఎంజాయ్ చెయ్యగలిగాను. శేఖర్ విషయమే మర్చిపోయాను.

నాకు శేఖర్‌కు మధ్య జరిగిన విషయాలను క్లుప్తంగా వర్మకు వివరంగా చెప్పేసాను.

"అయితే రూములో నీకు సంబంధించిన వస్తువొక్కటీ పోలేదన్న మాట" అన్నాడు డిటెక్టివ్ వర్మ అంతా విని.

"ఈవెన్ చిన్నకాయితం ముక్కకూడా పోలేదు. అయినా అతనలాంటివాడు కాదు" అన్నాను నేను నమ్మ

కంతో.

వర్మ నవ్వి "రాజు! మనుషులకి కాయితం ముక్కలతో పనుండదు. అయినా మరొక్కసారి జ్ఞాపకం చేసుకో" అన్నాడు.

నేను కళ్ళు మూసుకుని రూమ్‌లో ప్రతి వస్తువును పరీక్షగా చూసాను. "నో !అన్నీ సురక్షితంగా వున్నాయి. అయినా శేఖర్ లాంటి వాడికి, నా రూమ్ నుంచి కావాల్సిన వస్తువులేముంటాయి" నన్ను నేను ప్రశ్నించుకొన్నాను.

"సర్లే! ఈ విషయాన్ని ఇంతటితో మర్చిపో. మళ్ళీ ఎప్పుడైనా ఆ శేఖరం కనిపిస్తే, నా దగ్గరకు తీసుకురా" అన్నాడు వర్మ.

వర్మ ఆలోచనలేమిటో నాకు బొత్తిగా అర్థంకాలేదు "సరే అలాగే—" నని చెప్పి, "గుడ్‌నైట్" అన్నాను లేస్తూ.

3

సాయంత్రం—

కాఫీ చప్పరిస్తూ పేపరు చదువుతున్న నేను తలుపు దగ్గర గాజుల చప్పుడవటంతో తలెత్తి చూసాను.

ఒక్కసారి ఆనందాశ్చర్యాలలో మునిగిపొయ్యాను నేను.

ఎప్పటి సుజా! నా వూహల రాణి!

ఒకప్పుడు మేమిద్దరం ప్రాణప్రదంగా ప్రేమించుకున్నాం. పెళ్ళి కూడా చేసుకోవాలనుకున్నాం. కాని విధిప్రాబల్యం వల్ల పరిస్థితులు అనుకూలించనందువల్ల మేమిద్దరం శాశ్వతంగా విడిపోయాం: 'సుజా' మరొకరి సొత్తయిపోయింది.

"సుజా!....ఓ....సారీ....రా సుజాతా నిన్ను చూసి ఎన్నాళ్ళయింది" అన్నాను నేను మెరిసే కళ్ళతో ఆమెవంక

చూస్తూ.

"ఛీ....ఎంత తియ్యగా మాట్లాడుతున్నావు-నువ్వు తేనె పూసిన కత్తివి. తడిగుడ్డతో గొంతుకోసే నీచుడివి" నన్ను అసహ్యంగా చూస్తూ నిలువెల్లా వణికిపోతూ అంది సుజాత.

అనుకోని ఈ సుడిగాలేమిటో అర్థంకాలేదు నాకు. "ఏమిటి సుజాతా" అన్నాను కంగారుగా.

"ఏమిటి! ఒకప్పుడు నిన్ను ప్రేమించిన పాపానికి నువ్విచ్చిన బహుమతి" అంటూ తన చేతిలోని కాగితాలు విసిరి నా ముఖంమీద కొట్టింది.

ఆశ్చర్యంగా చూస్తూనే వాటిని క్రింద పడిపోకుండా పట్టుకున్నాను. అవి రెండు ఉత్తరాలు. పిన్ చేసున్నాయి. పైది....

అప్పట్లో అంటే నేను సుజాతా ప్రేమించుకునే రోజుల్లో సరదాగా నేను రాసిన ఉత్తరానికి, సుజాత ఇచ్చిన జవాబే ఆ వుత్తరం.

క్రిందది....

"మై డియర్ స్వీట్ సుజా—

ఒకప్పుడు నువ్వునాకు రాసిన వుత్తరం మళ్ళీ నీకెందుకు పంపించానని ఆశ్చర్యపోతున్నావు కదూ-అవును అది సహజమే మరి! కాని సుజా ఈ వుత్తరాన్ని మరొకరు....ఎవరో ఎందుకు నీ ఆరాధ్య దైవం, నీ పతిదేవుడు చూసాడంటే ఏమవుతుందో ఆలోచించు

నువ్వు రాసిన ప్రతివుత్తరాన్ని అందమైన డిజైన్‌లో కొన్ని వందల కాపీలు తయారు చేయించాను. నువ్వీ ఉత్తరాన్ని చింపేస్తే, మరో కాపి నీకు పంపించి, పది కాపీలు నీ పతిదేవుడికి పంపి

స్తాను. అలాగని ఈ ఉత్తరాన్ని జాగ్రత్తగా దాచు
కునేవు సుమా! నేను కింద చెప్పిన పనిచేస్తే ఎవ్వ
రికి, ఏ బాధ వుండదు. ఇది ఎవ్వరికీ తెలీకుండా
చాలా రహస్యంగా వుంచాలి.

మైడియర్ స్వీట్ గర్ల్, యీనెల ఆరో తేదీన
సరిగ్గా సాయంత్రం ఆరుగంటలకి పదివేల రూపా
యలు పట్టుకుని సరాసరి ఆంజనేయస్వామి గుడికి
వచ్చి, అక్కడ నా వుత్తరంతో కాచుకున్న
నా అనుచరుడి కిచ్చేయి. పాపం! పెద్ద మొత్తమే!
కాని, ఏం చేస్తాం! మన అవసరాలు అటువంటివి.

—నీ ప్రియమైన రాజు."

నా స్థితి అయోమయంగా తయారయింది. ఇలా నా సంతకంతో వుత్తరం రాపి, నన్ను సుజాతని, కలవరపర చిన అవసరం ఎవరికుందో, ఎంత ఆలోచించినా అర్థం కావటం లేదు.

"నాకేమి అర్థం కావటం లేదు" అన్నాను నేను నన్నింకా అసహ్యంగానూ, అనుమానంగానూ చూస్తున్న సుజాత నుద్దేశించి.

ఇంతలో డిటెక్టివ్ వర్మ మాటలు జ్ఞాపకం వచ్చాయి. షాక్ కొట్టినట్లయింది నా మెదడుకి. గబగబ వెళ్ళి పెట్టె లన్నీ వెతికాను. నాక్కావల్సింది కనిపించలేదు. నా చర్య లేమీ అర్థం కాలేదు కాబోలు బిత్తరపోయి చూస్తోంది సుజాత.

నేనా కంగారులోనే గబగబా ప్యాంటు, షర్టు తగిలించు కుని, "సుజాత, దైవసాక్షిగా చెప్తున్నాను. నేనా వుత్తరం రాయలేదు, దయచేసి నువ్వు నా వెంట రా" అన్నాను.

మరో పది నిమిషాలలో మేం ఎక్కిన 'ఆటో' డిటెక్టివ్ వర్మ ఆఫీసు ముందర ఆగింది. సుజాత ఆశ్చర్యంగా నా వైపు చూసింది.

నేను దాదాపు పరిగెత్తుతున్నట్లుగా మెట్లెక్కి. ఒక్క వుదుటున ఆఫీసు గదిలో కొచ్చి వర్మ కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాను. సుజాత నా వెనకాలే ప్రవేశించింది.

వర్మ ఆశ్చర్యంగా చూశాడు నావేపు. వర్మకి విషయ మంతా చెప్పి, సుజాతని పరిచయం చేసి, ఉత్తరాలిచ్చాను.

వర్మ వుత్తరాలు చదివి సుజాతవైపు చూశాడు. తరు వాత కుర్చీ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు. నా బాధ్య తంతా అతనిమీద పెట్టేసి నట్టనిపించింది నాకు ఎంతో హాయిగా ఫీలయ్యాను.

రెండు నిమిషాలు అయిన తర్వాత వర్మ లేచి, సుజాత నుద్దేశించి, "చూడండి సుజాతగారూ! ఇవి రాజు రాసిన వుత్తరాలు కావు. అతని దగ్గర మీరు రాసిన వుత్తరాలేవీ కూడా లేవు. ఇవి రెండు పచ్చి నిజాలు కనుక, డబ్బు ప్రసక్తి అసలు లేదు. మీరింటికి వెళ్ళి విశ్రాంతి తీసు కోండి" అన్నాడు స్థిరనిశ్చయంతో. సుజాత నా వైపు సందేహంగా చూసి వెళ్ళిపోయింది.

వర్మ నా భుజంమీద చెయ్యేసి, "రాజూ, నువ్వు నిర్దోషి వని నాకు తెలుసు. రేపటిలోగా ఆ బ్లాక్ మెయిలర్‌ని పట్టు కుని పోలీసుల కప్పగించే బాధ్యత నాది. డోంట్ వర్రి" అన్నాడు నవ్వుతూ.

మనసులోనే వర్మకి కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

4

అప్పుడే ఫస్టుషో నుంచి వచ్చి తలుపు తెరవబోయాను. ఇంతలోనే పక్కింటి కుర్రాడు పరిగెత్తుకుంటూ వచ్చి-

"మీకు ఫోనొచ్చిందండీ! తొందరగా రమ్మంటున్నారు" అన్నాడు.

నాకింత అర్జంటుగా ఫోన్ చేసిందెవరురా అనుకుంటూ, రిసీవర్ అందుకుని, "హలో! రాజు స్పీకింగ్" అన్నాను. అవతల నుంచి డిటెక్టివ్ వర్మ కంఠం వినిపించింది.

"రాజూ! ఇప్పుడే నాకు సుజాత ఫోను చేసింది. తనని ఎవరో బెదిరించారని, చాలా భయంగా వుందని, సమయానికి తన భర్తకూడా లేడని, వీలైనంత తొందరగా రమ్మని అడిగింది. నేనిప్పుడే అక్కడికి వెళ్తున్నా. నువ్వుకూడా రా! ఇల్లు కుత్‌బీ బౌళిలో పాన్ షాపు ఎదురుగా" అని ఫోను పెట్టేసాడు.

నేనుకూడా రిసీవర్ క్రెడిల్‌పైన పెట్టేసి, గబగబా బయటికి పరిగెత్తి కనబడ్డ టాక్సీలో ఎక్కేసాను.

టాక్సీ కుత్‌బీ బౌళిలో ఆగింది.

అక్కడే వర్మ కారు కనిపించింది. టాక్సీ ఫేర్ చెల్లించి, కారు దగ్గరికి నడిచాను. వర్మకూడా అప్పుడే వచ్చినట్టున్నాడు. నావైపు చూసి, "అదిగో, ఇల్లదే" అంటూ గబగబ అటువైపు అడుగులేసాడు.

ఇంతలోనే ఒక వ్యక్తి, ఆ ఇంట్లోంచి పరిగెత్తుకుంటూ వచ్చి మమ్మల్ని ఢీకొన్నాడు. మేము త్రుళ్ళిపడి అతని వైపు చూశాం. కళ్ళకు వెడల్పాంటి గంతలున్నాయి. ముఖాన్నంతా కప్పేసినట్టున్న ఫెల్టు హాటు. షర్టంతా రక్తమయం. చూడటానికి భయంకరంగా వున్నాడు మనిషి.

అతను మమ్మల్ని చూసి పరిగెత్తబోయాడు. వెంటనే వర్మ అతని రెక్కలు విరిచి పట్టుకుని జేబులోంచి రివాల్వర్ తీసి గురిపెట్టి "పిచ్చి పిచ్చి వేషాలు వేశావంటే ప్రాణాలు పోతాయ్. జాగ్రత్త! చెప్పినట్టు నడుచుకో—" అంటూ

ముందుకు తోసాడు.

ముగ్గురం ఆ యింటి లోపలకు వెళ్ళాం.

లోపలంతా చీకటిగా వుంది. వర్మ బ్యాటరీ లైటు గోడమీద ఫోకసు చేశాడు. స్విచ్ కనిపించింది. వెంటనే స్విచ్ నొక్కాను.

ఒక్క క్షణం కళ్ళు మూసుకుని తెరిచి చూశాను.

అంతే! అదిరిపడి. అప్రయత్నంగా నాలుగడుగులు వెనకేసాను

మంచంమీద నుంచి నేలమీదకు వొరిగిపోయిన సుజాత శరీరం, తోటకూర కాడలా వేల్లాడిపోతూంది. బట్టలు అస్తవ్యస్తంగా వున్నాయి. శరీరం అంతా రక్తమయం. బొడ్డులో పిడివరకు దిగబడిన కత్తి భయంకరంగా వుంది.

ఇక నేనా దృశ్యాన్ని చూడలేక వెనక్కి తిరిగాను. వర్మకూడా పరీక్షగా చూస్తున్నాడు. కాని వర్మ రివాల్వర్ అతన్ని జాగ్రత్తగా కాపాడుతోంది.

ఈసారి నేనతనివైపు పరీక్షగా చూసాను. ఒక్క వుదుటున దగ్గరికెళ్ళి గంతలు పీకేసి, హాట్ తీసి విసిరి కొట్టాను.

సందేహం లేదు అతను శేఖరే. నాతో మూన్నాళ్ళ ముచ్చటగా స్నేహం చేసి, హఠాత్తుగా పారిపోయిన శేఖరం.

శేఖరం తల వంచుకున్నాడు. వర్మ ఆదేశానుసారం నేను బయటకు వెళ్ళి పోలీసులకు ఫోన్ చేసి వచ్చాను.

వర్మ నన్ను చూసి "కంగారుపడకు రాజు! ఇతను సుజాత భర్త శేఖర్. సుజాతకి తండ్రి ఇచ్చిపోయిన ఆస్తి కోసం ఇతను ఆశపడ్డాడు. చిన్నప్పట్నుంచి ఇతనికి వున్న దుర్లవాట్లు తెలిసిన సుజాత ఇతనికి ఒక్క పైసా ఇవ్వ

టానికి ఒప్పుకోలేదు. దాంతో నయానా, భయానా ఆమెను బెదిరించినా లాభం లేకపోయింది. దాంతో అడ్డుతోవలు త్రొక్కి నీకు ప్రియాతిప్రియ మిత్రుడిగా మారి నీకు సుజాత రాసిన ఉత్తరాలు చేజిక్కించుకుని ఈ ప్లాను వేశాడు.

కాని కథ అడ్డం తిరిగి ప్లాన్ పాడయిపోయింది. దాని క్కారణం సుజాత సరాసరి నీ దగ్గరికి రావటం. దాంతో వెర్రెత్తిపోయి సుజాతని హత్య చేశాడు శేఖరం. మనం రాకపోతే ఆస్తి అతనికి హత్యానేరం నీమీదికి వచ్చేది—" అన్నాడు.

ఒక్కొక్క మాట ఒక్కొక్క పిడుగయింది నాపాలిట.

"శేఖర్! ఓహ్!! ఎంత స్నేహంగా నటించాడు. స్కౌండ్రల్" నాలో నేను గొణుక్కున్నాను. □

సైకిలు దొంగ?

జడ్జి	:	ఈ ముద్దాయి ఏ మపరాధం చేశాడు?
ముద్దాయి	:	నేనేమీ చేయలేదు సార్. సైకిల్ దొంగతనం చేశానంతే!
వకీలు	:	సైకిలుమీద యీ అమ్మాయిని ఎత్తుకుపోతున్నాడండి.
ముద్దాయి	:	నాకేం తెలియదు సార్! సైకిలును ఎత్తుకు వెళుతుంటే సైకిల్‌పై ఈ అమ్మాయికూడా వుంది!!

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

పిస్టల్ పట్టిన శవం

విశ్వమోహిని

అర్ధరాత్రి టెలిఫోన్ విడవకుండా మ్రోగడంతో బద్ధకంగా కళ్ళు విప్పి రిసీవరందుకున్నాడు డిటెక్టివ్ ప్రాణ్.

"ప్రాణ్ జీ! లజ్ చర్చ్ రోడ్‌లో పదకొండవ నంబరు ఇంటిలో ఒక వ్యక్తి చంపబడ్డాడు. అది హత్య అని నా అనుమానం. దయచేసి మీరు పరిశోధించాలి" అంది ఒక

స్త్రీ స్వరం ఫోన్‌లో.

"హత్య" అనేసరికి నిద్రమత్తు వదిలిపోయింది డిటెక్టివ్‌కి.

"హలో! మీరెవరు? ఎక్కడినుంచి మాట్లాడుతున్నారు?" అని ప్రశ్నించాడు.

"క్షమించండి. కారణాంతరాంవల్ల ప్రస్తుతానికి నా వివరాలు చెప్పలేను" అందామె. "అది హత్యో కాదో నిర్ణయించినట్టయితే మీ ఫీజు ఇచ్చుకుంటాను. నేను అనుమానిస్తున్నట్లు అది హత్యే అయితే, హంతకుణ్ని పట్టుకోవాలి మీరు."

"ఆ పని చేయడానికి పోలీసులు వున్నారు. క్లయింట్ వివరాలు తెలియకుండా కేసు చేపట్టలేను" అన్నాడు ప్రాణ్.

"ఎక్స్‌క్యూజ్‌మీ సార్! ఇప్పట్లో బయట పడడం నా కిష్టం లేదు....మీ పరిశోధన ముగియగానే మళ్ళీ నేనే ఫోన్ చేస్తాను మీకు. వీలుపడితే అప్పుడు నా అయిడెంటిటీని తెలియపరుస్తాను. ప్లీజ్, కాదనకండి" అంటూ ఆమె ప్రాధేయపడడంతో కాదనలేకపోయాడు ప్రాణ్. ఆ ఇంటి వివరాలు తెలుసుకుని ఫోన్ పెట్టేసాడు. టైమ్ చూశాడు— వొంటి గంట దాటింది.

మైలాపూర్‌లోని లజ్‌చర్చ్ రోడ్‌లో ఒక మూలగా వుంది ఆ బంగళా. డిటెక్టివ్ ప్రాణ్ అక్కడికి చేరుకునేసరికి పోలీస్ జీప్ సిద్ధంగా వుంది.

డిటెక్టివ్‌ని చూసి నొసలు చిట్లించాడు క్రయింబ్రాంచ్ ఇనస్పెక్టర్ మాధవ్. "గుడ్‌గాడ్! ఇంత రాత్రివేళకూడా ఈ వార్త అప్పుడే నీవరకూ వచ్చేసిందీ!?" అన్నాడు ఆశ్చర్యంగా.

మందహాసం చేసాడు ప్రాణ్.

"ఈ సంగతి నీకెలా తెలిసింది?" ఉన్నాడు మాధవ్ అనుమానంగా.

"ఓ క్లయింట్ ద్వారా" అన్నాడు ప్రాణ్.

"ఎవరా క్లయింట్?"

"నాకే తెలియదు" అంటూ జరిగింది చెప్పాడు ప్రాణ్.

ఇనస్పెక్టర్ అపనమ్మకంగా చూసి, అంతలోనే మంద హాసం చేసి, "పాపం. అర్ధరాత్రి అనవసరంగా శ్రమ తీసుకున్నావుగాని, ఇది హత్య కేసు కాదు" అన్నాడు.

బిజినెస్ ఎక్జిక్యూటివ్ వెంకట్రామన్ వుంటున్నాడు ఆ ఇంటిలో. అతని బెడ్ రూంలో ఓ శవం పడివుంది. అర్ధ రాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది వెంకట్రామన్‌కి. గదిలో హంతకుడు పిస్టల్ గురిపెట్టి నిలుచున్నాడు. ఆత్మ రక్షణ కోసం తల దిండు క్రిందనున్న పిస్టల్ మెరుపులా తీసి ఆగంతకుణ్ని షూట్ చేసాడు వెంకట్రామన్. తరు వాత పోలీస్‌కి ఫోన్ చేసి జరిగింది చెప్పాడు.

ఇనస్పెక్టర్ చెప్పింది విని, బెడ్ రూంలో ప్రవేశించాడు ప్రాణ్.

బెడ్ రూం గుమ్మం దగ్గర పడివుంది శవం. హఠాత్తుగా కూలిపోయినట్లుంది భంగిమ. శవం చేతిలో పిస్టల్ వుంది.

హంతకుడి వయసు నలభై ఏళ్ళుంటుంది. పొడుగూ, పొట్టీ కాని దృఢమైన శరీరం. హంతకుడి వదనంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

గదంతా కలయజూసాడు ప్రాణ్! పెనగులాట జరిగిన సూచనలేవీ లేవు.

వెంకట్రామన్‌కి నలభై అయిదేళ్ళుంటాయి. సన్నగా, పొడవుగా వుంటాడు. నైట్ గౌన్‌లో వున్నాడు. ఇన స్పెక్టర్ చెప్పినదే అతనూ చెప్పాడు.

"మిస్టర్ వెంకట్రామన్! హతుడు మీకు తెలిసిన వాడేనా?" ప్రశ్నించాడు ప్రాణ్.

కాదన్నా డతను.

"రాత్రి ఎన్ని గంటలకు పడుకున్నారు మీరు?"

"పదకొండు గంటలకు."

"అంతవరకు ఏం చేస్తున్నారు?"

"నా భార్య ఇంటివద్ద లేదు. ఒక స్నేహితురాలి బర్త్‌డే పార్టీకని వెళ్ళి, రాత్రికి అక్కడే వుండిపొమ్మని వాళ్ళు బలవంతం చేస్తున్నారని ఫోన్ చేసింది. సరేనన్నాను. తొమ్మిది గంటలకు భోజనంచేసి పదకొండు గంటలవరకు ఏదో మ్యాగజీన్ చదువుకుని పడుకున్నాను. వెంటనే నిద్ర పట్టేసింది" చెప్పుకుపోయాడు వెంకట్రామన్.

"హఠాత్తుగా మెలకువ వచ్చేసరికి గదిలో లైటు వెలుగు తోంది. నేను పడుకునేప్పుడు బెడ్‌రూం లాంప్ వెలిగించి పడుకున్నాను. నా భార్య కుముదం తిరిగి వచ్చినిదేమోనని చూసాను....గుమ్మంలో నిలుచున్నా డితను. చేతిలో పిస్టల్ వుంది. 'కదలకు' అంటూ నన్ను హెచ్చరించి పిస్టల్ పైకెత్తబోయాడు. మెరుపులా తలగడ క్రిందనున్న పిస్టల్ తీసి రెండుసార్లు ప్రేల్చాను."

వెంకట్రామన్ పిస్టల్ని, శవం కడుపులోను, ఛాతిపైన వున్న బులెట్ గాయాలనూ చూసాడు.

"మీ భార్య స్నేహితురాలు ఎక్కడ వుంటోంది?"

"రాయపేటలో" అంటూ అడ్రసు చెప్పాడు వెంకట్రామన్.

"ఇంట్లో నౌఖర్లు ఎవరూ లేరా?"

"పనిమనిషి రెండు పూటలా వచ్చి పనిచేసి వెళ్ళి పోతుంది."

"హతుడుఇంట్లో ఎలాప్రవేశించగలిగాడో చెప్పగలరా?"

"వీధి తలుపులు గెడ పెట్టడం మరిచిపోయానను కుంటాను."

"హతుడు ఎందుకొచ్చాడంటారు?"

"దొంగతనానికి కావచ్చు" అన్నాడు వెంకట్రామన్.

ఆ తరువాత ఇనస్పెక్టర్ దగ్గరకెళ్ళి, "మాధవ్! పిస్టల్సుమీద, ఈ గది తలుపులపైనా, బెడ్ రూంలోని లైటు స్విచ్ మీదా వ్రేలిముద్రలు తీయించు" అన్నాడు ప్రాణ్.

"నువ్వనవసరంగా శ్రమ తీసుకుంటున్నావు బ్రదర్, దిసీజ్ ఏ క్లియర్ కేస్ ఆఫ్ సెల్ఫ్ డిఫెన్స్....పాపం! నీకు ఫీజు దక్కదు" అన్నాడు ఇన్స్పెక్టర్ మాధవ్.

ప్రాణ్ నవ్వి, "నా ఫీజుగురించి నువ్వు బెంగపెట్టు కోకు....హతుడు ఆత్మరక్షణకోసం చంపబడ్డాడని నిర్ధారణ చేసుకునేందుకైనా పరిశోధన పూర్తి చేయాలన్న విషయం నీకూ తెలుసు. దయచేసి నేను చెప్పింది చెయ్యి. శవం ఫోటోలు—ముఖ్యంగా హతుడి వదనంలోని ఎక్స్ప్రెషన్ ఫోటో తీయించడం అవసరం. రేపు పోస్టుమార్టెం రిపోర్టు ఫింగర్ ప్రింట్సు రిపోర్ట్సు వచ్చేసరికి నేను వచ్చి కలుసుకుం టాను నిన్ను....గుడ్ నైట్!" అంటూ బయటకు నడిచాడు.

వెళుతున్న డిటెక్టివ్ వంక అదోలా చూస్తూ "డామిట్! ఎస్. పి. తాతలాగ ఆర్డర్ చేస్తూంటా డితను!" అను కున్నాడు ఇన్స్పెక్టర్.

2

మర్నాడు పోస్టుమార్టెం రిపోర్టు, ఫింగర్ ప్రింట్సు రిపోర్టూ, శవం ఫోటోలూ సిద్ధంగా వున్నాయని తెలిసి క్రయింబ్రాంచ్ కి వెళ్ళాడు డిటెక్టివ్ ప్రాణ్. అయిష్టంగానే

వాటిని చూపించాడు ఇన్‌స్పెక్టర్ మాధవ్.

ఇద్దరూ కాలేజ్‌లో క్లాస్‌మేట్స్. మిత్రులిద్దరూ నేర పరిశోధననే వృత్తిగా స్వీకరించడం ఓ విశేషం. తమ పరిశోధనలలో తల దూర్చుతాడన్న కోపం ప్రాణ్‌మీద ప్రొఫెషనల్‌గా వుంది మాధవ్‌కి. అయినా క్లోజ్ ఫ్రెండూ అప్పుడప్పుడు తనకు సహకరించేవాడూనన్న అభిమానమూ ఉన్నది అతనిమీద.

పోస్ట్‌మార్టెంలో మరణకాలం రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలోనని నిర్ణయించబడింది. హతుడి ముఖంలోని ఆశ్చర్యం ఫోటోలో స్పష్టంగా కనిపిస్తోంది. వెంకట్రామన్ హఠాత్తుగా లేవడంతో హతుడు ఆశ్చర్యపోయివుంటాడన్నాడు ఇన్‌స్పెక్టర్.

హతుడి చేతిలోని పిస్టల్‌మీద హతుడి వేలిముద్రలూ, వెంకట్రామన్ పిస్టల్‌మీద అతని వేలిముద్రలే వున్నాయి. వీధి తలుపుమీద హతుడి వేలిముద్రలున్నాయి కాని, బెడ్‌రూం తలుపుమీద, లైట్‌స్విచ్‌మీద అతని వేలిముద్రలు కనిపించలేదు.

"హతుడి పేరు వైకుంఠం అనీ, మెడికల్ రిప్రజెంటేటివ్ అనీ, మాంబళంలో వుంటున్నాడనీ, బ్యాచలర్ అనీ తెలిసింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్. "వెంకట్రామన్‌తో అతనికి పరిచయమున్నట్టులేదు."

"వైకుంఠం డీసెంట్‌గా కనిపిస్తున్నాడు. వెంకట్రామన్ ఇంట్లో దొంగతనం కోసం చొరబడ్డాడంటే నమ్మబుద్ధికావడంలేదు" అన్నాడు ప్రాణ్ సాలోచనగా.

"ఈ రోజుల్లో దొంగలు దొరల్లా,దొరలు దొంగల్లా కనిపిస్తున్నారు. ఎవరినీ నమ్మడానికి వీల్లేదు"అన్నాడు మాధవ్.

"వైకుంఠం గది ఒకసారి పరీక్షించి రావాలి" అన్నాడు

ప్రాణ్ లేస్తూ.

అంతకుముందే వెంకట్రామన్ భార్య కుముదాన్ని కలుసుకుని వచ్చాడతను.

వైకుంఠం గదిని శోధించిన డిటెక్టివ్ ప్రాణ్ క్రయింబ్రాంచ్‌కి ఫోన్‌చేశాడు—"మాధవ్! వెంటనే వెంకట్రామన్‌ని, కుముదాన్ని స్టేషన్‌కి రప్పించు" అన్నాడు.

"డామిట్, ఏమిటిదంతా? కొంపదీసి క్లియర్ కేసుసు కాంప్లికేట్ చేయడంలేదు గదా నువ్వు?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కంగారుపడుతూ.

"నో. నతింగ్ టు వర్రీ. ఈ కేసు క్లోజ్ చేసెయ్యడానికి మార్గం చూపిస్తున్నాను"అంటూ రిసీవరుపెట్టేశాడు ప్రాణ్.

*

క్రయింబ్రాంచ్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మాధవ్ డిటెక్టివ్ ప్రాణ్‌ల కెదురుగా కూర్చున్నారు వెంకట్రామన్, అతని భార్య కుముదం.

ఆమెకు దాదాపు ముప్పయ్యేళ్ళుంటాయి. మనిషి అందంగా వుంటుంది.

"మిస్టర్ వెంకట్రామన్! మాతో అన్నీ అబద్ధాలే చెప్పావు. ఎందుకు?" సూటిగా ప్రశ్నించాడు ప్రాణ్.

వెంకట్రామన్ వులిక్కిపడి"ఏమిటిమీరనేది?"అన్నాడు.

"హతుడు నీ భార్య ప్రియుడని యెరిగివుండీ తెలియదని యెందుకు చెప్పావు?"

"అబద్ధం!"

"డోంట్ లై మాన్! ఇంతకుముందే నీ భార్యచేత నిజం కక్కించాను" అన్నాడు ప్రాణ్.

"వైకుంఠం డైరీలో నీ భార్య ఫోటో కనిపించకున్నట్లయితే నిజం తెలిసేది కాదు. ముందు బుకాయించినా,

దబాయించేసరికి తామిద్దరికీ వున్న సంబంధం వొప్పేసుకుంటామె."

భార్యవంక కోపంగా చూశాడు వెంకట్రామన్. అపరాధినిలా తలవంచుకుందామె.

"మిస్టర్ వెంకట్రామన్! చాలా తెలివిగా ప్లాన్ చేశావు ఈ హత్య. కాని, నేరస్తులందరిలాగే నువ్వూ పప్పులో అడుగేశావు...."

"నో, ఇది హత్య కాదు — సెల్ఫ్ డిఫెన్స్ కోసం అతన్ని చంపాల్సి వచ్చింది" అంటూ కంగారుగా లేవబోయాడు వెంకట్రామన్. ఇన్స్పెక్టర్ బలంగా అతని భుజం పట్టుకుని కుర్చీలో కూలదోసాడు.

"డోంట్ ఫూల్ అజ్ మాన్! ఈ హత్య యెందుకు చేసావో, యెలా చేసావో చెబుతాను విను...." అన్నాడు ప్రాణ్ కఠినంగా.

"వైకుంఠానికి నీ భార్యతో వున్న సంబంధం తెలుసుకుని ఇద్దర్నీ తీవ్రంగా హెచ్చరించావు. ఫలితం లేకపోయేసరికి వైకుంఠాన్ని తొలగించడానికి నిశ్చయించుకున్నావు. నిన్నరాత్రి నీ భార్య స్నేహితురాలింట్లో వుండిపోవడం అదునుగా తీసుకుని ఆమె గొంతు ననుకరించి వైకుంఠానికి ఫోన్ చేశావు. రాత్రి పదకొండున్నరకు వైకుంఠం కొరకు ఫోన్‌కాల్ వచ్చిందనీ, అర్జెంట్ అని చెప్పడంవల్ల అతన్ని లేపుకొచ్చామనీ అతని ప్రక్కింటివాళ్ళు చెప్పారు. అలాగే పదకొండూ ముప్పావుకు వైకుంఠాన్ని మీ ఇంటివరకూ తీసుకొచ్చిన ఆటోరిక్షా డ్రయివర్ సాక్ష్యమూ వుంది...." చెప్పుకుపోయాడు ప్రాణ్.

"బహుశా భర్త తనను చంపబోతున్నట్లు కుముదంలా ఫోన్ చేసివుంటావు. అందుకే పిస్టల్‌తో సయితం తిన్నగా

నీ బెడ్ రూంలో అడుగు పెట్టాడతను. వీధి తలుపులు గెడ పెట్టలేదేమో వైకుంఠం వాటిని తెరుచుకుని రావడంతో అతని చేతిముద్రలు వాటిమీద పడ్డాయి. బెడ్ రూం తలుపులు బార్లా తెరిచివుండడంతో వాటిని ముట్టుకోవలసిన అవసరం లేదతనికి. అందుకే వాటిమీద అతని చేతిముద్రలు లేవు...."

నిశ్శబ్దం ఏర్పడిందక్కడ. వెంకట్రామన్ నోరు తెరుచుకుని వుండిపోయాడు.

"వైకుంఠం గుమ్మంలోకి రాగానే, పిస్టల్‌తో సిద్ధంగా వున్న అతన్ని రెండుసార్లు షూట్ చేశావు. వైకుంఠం యెదురు చూసిందొకటి, జరుగుతున్నది వేరొకటీను. అందుకే అతని వదనంలో అంత ఆశ్చర్యం....

తరువాత గదిలో లైటువేసి, వైకుంఠం జేబులోంచి పిస్టల్ తీసి అతని చేతిలో పెట్టావు. పోలీసులకు ఫోన్ చేసి సెల్ఫ్‌డిఫెన్స్ కథను సృష్టించావు....గదిలో లైటువేసింది వైకుంఠం అయితే స్విచ్ మీద అతని వ్రేలిముద్రలు వుండాలి. కాని లేవు. నీవి వున్నాయి...."

"అబద్ధం!" అరిచాడు వెంకట్రామన్. "ఇదంతా కట్టు కథ....నమ్మకండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్‌తో.

"షటప్. మాన్! శవాన్ని చూసినప్పుడే అనిపించింది, నువ్వు అబద్ధం చెబుతున్నావని...." ప్రాణ్ అన్నాడు. "నీకు మెలకువ వచ్చేసరికి వైకుంఠం గుమ్మంలో నిలుచుని నీకు పిస్టల్ గురిపెట్టాడని, మెరుపులా పిస్టల్ తీసి పేల్చానన్నావు. కాని, మిస్టర్! నీ బులెట్స్‌కి కూలిపోయిన వైకుంఠం చేతిలోని పిస్టల్ క్రిందికి జారిపోకుండా, చచ్చాక కూడా అతను దాన్ని టైట్‌గా పట్టుకుని వుండడం అసమంజసంగా లేదూ?...."

డిటెక్టివ్ పలుకులు వింటూనే చటుక్కున నాలుక

కరుచుకున్నాడు వెంకట్రామన్. ఇన్‌స్పెక్టర్ ఇది గమనించాడు. అతన్ని లాకప్‌లో పెట్టించాడు ఇనస్పెక్టర్ మాధవ్.

"థాంక్యూ బ్రదర్! ఎంత తెలివిగా మనల్ని ఫూల్ చేయాలనుకున్నాడు రోగ్!" అన్నాడు డిటెక్టివ్‌తో.

మందహాసం చేశాడు ప్రాణ్ "దున్నపోతు ఈనిందంటే దూడను కట్టెయ్యడానికి సిద్ధపడే నీలాంటివాళ్ళు వున్నంతవరకు క్రిమినల్స్ ఏమైనా చేస్తారు" అన్నాడు.

అతనివంక కొరకొరా చూసాడు మాధవ్. ఫకాలున నవ్వేసి లేచాడు ప్రాణ్.

"ఇంతకూ నిన్ను ఈ కేసుకు నియమించిం దెవరో ఇప్పుడైనా చెబుతావా?"

"ఓ గంట క్రితంవరకు ఆ క్లయింట్ యెవరో నేనూ యెరగను" అంటూ చిరునవ్వుతో కుముదం వంక చూసాడు ప్రాణ్. "పోలీసులకంటె ముందు వెంకట్రామన్ భార్యకు ఫోన్‌చేసి, వైకుంఠాన్ని చంపేసినట్లు, పోలీసులు అడిగితే అతనెవరో తెలియదని చెప్పమనీ, తమ ప్రేమ వ్యవహారం బయటకు రావడానికి వీల్లేదనీ తీవ్రంగా హెచ్చరించాడట. కాని, ప్రియుడిమీద అభిమానం చావని కుముదం పేరు చెప్పకుండా నాకు ఫోన్‌చేసింది....ఇంతక్రితమే ఆ విషయం ఒప్పుకుందామె."

కుముదం తల వంచుకుంది. అందమైన ఆమె వదనం విచారంతో పాలిపోయింది.

ప్రాణ్ ఆమెవంక జాలిగా చూస్తూ, "తెలిసో, తెలియకో తప్పటడుగు వేయడంలో ఎటువంటి దుస్థితికి గురియ్యావో చూసావా? అటు ప్రియుణ్ణీ, ఇటు భర్తనూ కూడా పోగొట్టుకున్నావు....ఐ రియల్లీ పిటీయూ" అన్నాడు.

కుముదం కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. □

ఎమ్.వి.వి.సత్యనారాయణ

విదేశీ ద్రోహులు

క్రైం బ్రాంచ్ ఇనస్పెక్టర్ కుమార్. రిసీవర్‌లోకి విచిత్రంగా చూశాడు.

"ఏమిటీ? సూపర్నెంటును బంధించారా?" అనడిగాడు కుమార్.

"అవునండి. నేను లాబొరేటరీని తుడిచి శుభ్రం చేయాలని వచ్చాను. సూపర్నెంట్‌గారిని ఎవరో త్రాళ్ళతో కట్టివుంచారు" రిసీవర్‌లో వినిపించింది.

"త్రాళ్ళు విప్పావా?"

"లేదండి."

"ఏం?"

"సూపర్నెంటుగారికి స్పృహలేదండి. వారి పరిస్థితి ఎలా వుందో తెలుసుకోవాలి. అందుకు మీరే రావాలండి."

"గుడ్. వస్తున్నాను."

"సార్! ఎవరైనా వస్తే...."

"నువ్వు గుమ్మంలో కాచుకుని వుండు. లాబ్‌లోకి ఎవరినీ వెళ్ళనివ్వక."

"అలాగేనండి."

రిసీవర్‌ను క్రెడిల్ చేశాడు కుమార్. బల్లమీది బెల్ నొక్కాడు. సార్జంటు వచ్చాడు.

"జీపు సిద్ధం చెయ్యి. సఫ్దర్ గంజ్ రోడ్లో వైరస్ లాబొరేటరీకి వెళ్ళాలి!" కుమార్ లేచి బెల్టు సర్దుకున్నాడు. హాట్ తలమీద పెట్టుకున్నాడు.

సార్జంట్ జీపు సిద్ధంచేశాడు. కుమార్ జీపులో కూర్చున్నాడు.

జీపు బయలుదేరింది.

సఫ్దర్ గంజ్ రోడ్లో పరుగెత్తుతోంది. ఎనభైనాలుగో నెంబర్ భవనం ముందు ఆపించాడు కుమార్.

భవనం గేట్లో నీలంబట్టల యూనిఫారంలో వున్న వ్యక్తి నిలబడివున్నాడు.

జీపు ఆగగానే జీపువద్దకు పరుగెత్తుకు వచ్చాడు.

"నువ్వేనా క్రైంబ్రాంచ్‌కి ఫోన్ చేశావు?" అడిగాడు

కుమార్.

నీలం బట్టల వ్యక్తి తలూపి, "అవును సార్! నేను యిక్కడ స్వీపర్ను" అన్నాడు.

కుమార్ జీపు దిగి లోపలకు నడిచాడు.

భవనంలో పొడవుపాటి హాలూ, హాలుకు అటూ ఇటూ గాజు అద్దాల తలుపులూ, తలుపులలోంచి కనిపిస్తోన్న లాబొరేటరీ గదులూ దాటాడు కుమార్.

స్వీపర్ వరండా చివరకు దారి చూపించాడు.

వరండాలో స్తంభం దగ్గరగా నేలమీద అతడు పడి వున్నాడు. అతడి కాళ్ళూ చేతులూ కట్టిపడేసి వున్నాయి. చేతులూ కాళ్ళూ కట్టడానికి తెల్లటి నూలుత్రాళ్ళు వాడారు.

కుమార్ అతడివద్ద గొంతుక్కూర్చున్నాడు.

బంధితుడు మెల్లగా వూపిరి పీల్చుతున్నాడు.

కుమార్ అతడిని కుదిపి చూశాడు.

"రమణమూర్తిగారూ!" పిలిచాడు కుమార్.

కొంతసేపటికి రమణమూర్తి కళ్ళు తెరిచాడు. ఇన్‌స్పెక్టర్ యూనిఫాంలో వున్న కుమార్‌ను చూచి వులిక్కిపడ్డాడు.

"వాళ్ళు వెళ్ళిపోయారా సార్?" అడిగాడు రమణమూర్తి.

కుమార్ మెల్లగా కట్లు విప్పాడు.

"ఎవరు వాళ్ళు?" అడిగాడు కుమార్.

"ఎవరో నాకూ తెలియదు సార్!" రమణమూర్తి లేచి కూర్చున్నాడు.

"వాళ్ళు విదేశస్థుల మాదిరిగా వున్నారు సార్. నేను లాబ్‌కి వచ్చేసరికి వాచ్‌మాన్ లేడు. నాకు కోపం వచ్చింది. అతడిని ఎప్పుడూ గేట్‌లో వుండమని చెబుతాను. తోటలో

అతడికోసం వెతికాను. అంతే నాకు ఏమయిందో తెలియదు, తలమీద దెబ్బ పడిందనుకుంటాను. నేను వెల్లకితలా పడ్డాను. నా కళ్ళకు నలుగురు కొత్తవాళ్ళు కనిపించారు. వాళ్ళు మనదేశం వాళ్ళలాగా లేరు. ఎర్రగా ఎత్తుగా బలంగా వున్నారు. నన్ను భుజాల కింద చేతులు వేసి లాబ్‌లోకి తీసుకువచ్చారు.

"ఎవరు మీరు?" అడిగాను.

వాళ్ళు నన్ను వరండాలో యిక్కడ పడవేశారు. ఒకడు నా కాళ్ళూ చేతులూ కట్టిపారేశాడు.

"లాబ్‌లో మశూచి క్రిములు వున్నాయికదా!" ఆంగ్లంలో అడిగాడు ఒకడు.

"లేవు."

"లాబ్‌లో వైరస్ వున్నట్టుగా మాకు వర్తమానం అందింది" అంటూ అతడు నా మీద పడ్డాడు. బట్టలు వెతికి తాళంచెవులు తీసుకున్నాడు. తరువాత నాకు క్లోరోఫాం వాసన చూపించారు" ముగించాడు రమణమూర్తి.

కుమార్ తల పంకించాడు.

"మశూచి క్రిములు వాళ్ళకు ఎందుకు?" అడిగాడు కుమార్.

"నేను అడగలేదు. వాళ్లూ చెప్పలేదు."

రమణమూర్తి లేచి నిలబడ్డాడు. అతడి దుస్తుల్లోంచి తాళంచెవులు కిందపడ్డాయి.

"లాబ్స్ వెతుకుదాం సార్! క్రిములు వాళ్ళకు దొరికే వుండాలి. లేకపోతే తాళం చెవులు ఎందుకు తిరిగి ఇస్తారు?" అన్నాడు రమణమూర్తి.

"మీ లాబ్‌లో మశూచి క్రిములు మాత్రమే వుంటాయా?"

ఇద్దరూ అద్దాల తలుపు తెరచుకుని లోపలకు నడిచారు. పొడవుపాటి బల్లలమీద శాస్త్ర పరికరాలు అమర్చివున్నాయి.

"ఈ భవనంలో మొత్తం నాలుగు లాబొరేటరీలు వున్నాయి. నా పర్యవేక్షణలో మశూచి క్రిములున్నాయి. మిగతా మూడు లాబొరేటరీల్లో కలరా, ప్లేగు, పొంగు లాంటి అంటు వ్యాధులు ప్రబలే క్రిములున్నాయి. వాటికి వేరే పర్యవేక్షకులున్నారు. వాళ్ళు ముగ్గురూ ప్రస్తుతం విదేశాల్లో పర్యటిస్తోన్నారు."

రమణమూర్తి ఫ్రిజ్ ముందాగాడు.

తాళంచెవితో ఫ్రిజ్ తలుపు తెరిచాడు. ఫ్రిజ్‌లో మంచు పలకల మధ్య శోధన నాళికలున్నాయి. వాటి మూతులు బలంగా సీల్ వేసివున్నాయి. రమణమూర్తి వంగి వాటిని లెక్కపెట్టసాగాడు.

"లెక్క సరిపోయింది" అన్నాడు రమణమూర్తి.

"వూహించాను. వాళ్ళు ఫ్రిజ్ వెతకలేదు. ఈ అద్దాల బీరువా వెతికారు" అన్నాడు కుమార్.

రమణమూర్తి అటు చూశాడు. అతడి కళ్ళు ఎర్రబడ్డాయి.

అద్దాల బీరువా పగిలి వుంది.

సీసాలూ, గాజు పరికరాలూ నేలమీద కుప్ప పోసి వున్నాయి.

"వీటిమీద వేలిముద్ర లున్నాయేమో!" అన్నాడు కుమార్.

"ఉండవు సార్! వాళ్ళు నలుగురూ గ్లవ్స్ వేసుకున్నారు."

"ఆల్‌రైట్! రిపోర్ట్ రాసి యివ్వండి. నా బలగాన్ని

మీకు రక్షణగా ఏర్పాటు చేస్తాను."

రమణమూర్తి కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు.

2

తలుపుమీద దబదబ చప్పుడయింది.

డిటెక్టివ్ శిరీష్ బల్లముందు నుండి కదిలాడు. తెలుపు తెరిచాడు.

ఆమె బాణంలాగా లోపలకు దూసుకువచ్చింది.

శిరీష్ ఆమెవైపు పరిశీలనగా చూశాడు.

ఆమె చిగురుటాకులాగా వణుకుతోంది. బలంగా ఉఛ్వాస నిశ్వాసలు జరుపుతోంది.

ఆమె ఆకుపచ్చరంగు అమెరికన్ జార్జెట్ చీర కట్టింది. అదే రంగు లోనెక్ బ్లవుజ్ వేసింది. మెడలో సన్నటి బంగారుగొలుసూ, చెవులకూ రాళ్ళు పొదిగిన ఆభరణాలూ ఆమె శరీరచ్ఛాయలో కలిసిపోతోన్నాయి ఎర్రటి పెదిమలు అల్లల్లాడుతోన్నాయి.

హాండ్ బాగ్ లోంచి జేబురుమాలు తీసింది. మృదువుగా మొహం అద్దుకొంది.

"నన్ను వాళ్ళు వెంటాడుతున్నారు!" అంది ఆమె వగర్చుతూ.

ఆమెకు కుర్చీ చూపించాడు శిరీష్. మంచినీళ్ళు అందించాడు. ఆమె గటగట నీళ్ళు త్రాగి తేరుకున్నది.

"ఎవరు వాళ్ళు?" అడిగాడు శిరీష్.

"విదేశస్తులు."

"కారులో తరిమారా?"

"అవునండి. నేను షాపింగుకని కారులో బయల్దేరాను నా కారు యెక్కడ ఆగితే ఆ నలుగురూ యెక్కిన కారు కూడా అక్కడే ఆగుతోంది. నేను షాపింగ్ మాను

కున్నాను. కారు బయలుదేరదీశాను. ఎన్ని మలుపులు తిరిగినా ఆ కారు నన్ను వెంటాడింది. చివరకు మీ గుమ్మం వద్దకు నా కారు రాగానే వాళ్ళ కారు నన్ను దాటి వెళ్ళిపోయింది—"

"మీ రెవరో చెప్పనేలేదు."

"శైలజ! వైరస్ లాబ్‌లో పని చేస్తాను!"

"మీ తలిదండ్రులు?"

"మా నాన్నగారు రమణమూర్తిగారు. మశూచిక్రిముల లాబొరేటరీకి సూపర్నెంటు."

"లాబ్‌లో మీరు ఏం పనిచేస్తారు?"

"రీసెర్చ్ అసిస్టెంట్."

"వాళ్ళు మిమ్మల్ని ఎందుకు వెంటాడారు?"

"కారణం ఊహించగలను. నిన్న ఉదయం వాళ్ళు నాన్నగారిని లాబ్‌లో తాళ్ళు పెట్టి కట్టిపడేశారు. మశూచి క్రిములు కావాలట వాళ్ళకు."

"వాళ్ళకు క్రిములు అందలేదన్నమాట!"

"అవునండి, మా నాన్నగారిని స్పృహ తప్పించారు. తాళంచెవులు తీసుకొన్నారు. అద్దాల బీరువాలో వెతుక్కున్నారు. క్రిములు అందలేదు."

"వాళ్ళకు క్రిములు దేనికట?"

"తెలియదండి."

"రీసెర్చ్ అసిస్టెంట్‌గా వూహించి చెప్పండి!"

"క్రిములు మన దేశంలో వ్యాపింపచేస్తారు. మశూచి లేదని గర్వంగా చెప్పుకొనే మనం సభ్య దేశాల్లో తల వంచుకోవలసి వస్తుంది!"

"క్రిములు అంత సులువుగా వ్యాపిస్తాయా?"

"అవునండి. క్రిములు గాలిలో వాపిస్తాయి. మనుషులు

గాలి పీల్చుతారు. నిముష నిముషానికీ ద్విగుణీకృతమవు తాయి.''

శిరీష్ నిట్టూర్చాడు.

"మీ నాన్నగారు పోలీస్ కంప్లయింట్ ఇచ్చారా?"

"క్రైంబ్రాంచ్ వాళ్ళకు కాబోలు ఇచ్చారు!"

డిటెక్టివ్ శిరీష్ టేబులు మీదకు చెయ్యి చాపాడు. టెలిఫోన్ రిసీవర్ అందుకొన్నాడు. నంబర్ డయల్ చేశాడు.

అవతల ఇన్‌స్పెక్టర్ కుమార్ పలికాడు.

కుమార్ వైరస్‌లాబ్‌కి తాను వెళ్ళిన సంగతి వివరంగా చెప్పాడు.

"వాచ్‌మాన్ ఏమయాడు?"

"తోటలో స్పృహతప్పివున్నాడు. ఎవరో క్లోరోఫాంతో అతడిని స్పృహతప్పించారు."

"అతడు ఏం చెప్పాడు?"

"ఏమీ చెప్పలేకపోయాడు. గేటుదగ్గర కూర్చున్నాడట. మొహంమీద జల్లు పడిందట. తియ్యటి వాసన! స్పృహ తప్పింది."

"రమణమూర్తిగారి అమ్మాయిని శత్రువులు వెంటా డారు."

"నిజమా? ఎందుకు?"

"క్రిములు శత్రువులకు అందలేదు. శైలజను కిడ్నాప్ చేయాలని వాళ్ళ ఆలోచనేమో తెలియదు!"

"నువ్వూ శైలజా యిటు రాగలరా?"

"బయల్దేరుతున్నాం!" శిరీష్ లేచాడు.

"నా కారులో వెళ్దాం" అంది శైలజ.

ఇంటికి తాళం పెట్టి యిద్దరూ కారులో బయల్దేరారు.

శిరీష్ వెనక్కి చూశాడు. తమని యెవరూ వెంటాడటం లేదు.

శిరీష్ కళ్ళు మెరిశాయి. వెనక సీటులో యేదో కాగితం వుంది.

శైలజ తన మానాన తాను కారు నడుపుతోంది.

శిరీష్ వెనక్కి వాలి కాగితం అందుకొన్నాడు. టైప్ చేసిన కాగితం!

శైలజా! అని సంబోధన వుంది.

శిరీష్ కాగితం ఆమెకు చూపించాడు.

"చదవండి! ఫరవాలేదు!" అంది శైలజ.

"శైలజా!

"మా చేతుల్లోంచి తప్పించుకోలేవు.మీ నాన్నకు చెప్పి ఒప్పించు. టాంక్ బండ్ మీద ఈ సాయంకాలం ఏడు గంటలకు క్రిములను అందించాలి. మశూచి క్రిములు! పోలీసులు వెంటాడినా, మా మాట తప్పి ప్రవర్తించినా నిన్ను ఎత్తుకుపోయి తీరతాం!

శ్రేయోభిలాషులు."

శిరీష్ నిట్టూర్చాడు.

"క్రిములతో వాళ్ళు మానవ నాశనానికి పూనుకొంటారేమో!"

"వాళ్ళూ మిగలరు గదా!" అంది శైలజ.

"భారత ప్రభుత్వానికి ఈ విషయం తెలియపరచాలి. వ్యవహారం అంతర్జాతీయ స్థాయిలో నడుస్తోంది."

శైలజ కారు ఆపింది.

ఇద్దరూ కారు దిగి క్రయింబ్రాంచ్ ఆఫీసులోకి నడిచారు.

శైలజకి వచ్చిన వుత్తరం చూచి యెగిరిపడ్డాడు కుమార్.

"శత్రువులు మరీ బరితెగించారు!" అరిచాడు కుమార్.

"రాత్రి ఏడుగంటలకు గడువుపెట్టారు!" అన్నాడు షి.

"గడువు పెడితే మాత్రం వాళ్ళకు మశూచి క్రిములను అందిస్తామా?"

శైలజ భయంగా చూస్తోంది.

"మశూచి క్రిములతో వాళ్ళు భారతదేశాన్ని పట్టుపెడతారు. నిరోధక చర్యగా వాక్సిన్‌ను తయారు చేయాలన్నా వారం పదిరోజులు పడుతుంది" అంది శైలజ.

"బహుశా శత్రువులు క్రిములను వ్యాపింప చేయరు. వ్యాధి వ్యాపిస్తే వాళ్ళూ మిగలరు గదా!" అన్నాడు కుమార్.

"లిక్విదేషన్ స్క్వాడ్ గురించి నీకు చెప్పనక్కర లేదు. వాళ్ళు నవ్వుతూ మరణిస్తారు. మరణిస్తూనే కావాలనుకొన్న సర్వనాశనం కొనసాగిస్తారు!" అన్నాడు శిరీష్.

"మశూచి క్రిములంటూ గాలిలో వ్యాపించడం జరిగితే ప్రపంచ దేశాలు వ్యాధిగ్రస్త మవుతాయి. మశూచికి మిత్రుడూ శత్రువూ యెవరూ లేరు" నిట్టూర్చింది శైలజ

"క్రిములను ఈ సాయంకాలం శత్రువులకు అందచేయాలి. కాని ఈ విషయం కేంద్ర హోం మంత్రికి తెలియచేయాలి. తగిన వ్యవధిలో ఆదేశాలు వస్తాయో రావో..."

"నీ మాట నిజం కుమార్! అయినా నువ్వు తెలియచేయి — శత్రువులు పెట్టిన గడువుకు క్రిములను అందిస్తాం!"

కుమార్ నిర్ఘాంతపోయి శిరీష్ మొహంలోకి చూస్తూ వుండిపోయాడు.

శిరీష్ సూచనలివ్వసాగాడు.

3

రమణమూర్తి వాచీ చూసుకొన్నాడు.

రాత్రి ఏడూముప్పయి అయింది. చికాకుగా తల విదిలించాడు.

శైలజ టాంక్‌బండ్‌కి వెళ్ళి అరగంట అయింది. శత్రువులకు శోధన నాళికను అందించడానికి వెళ్ళింది.

పోలీసులు టాంక్‌బండ్‌కి అవతల రెండు ఫర్లాంగుల వ్యాసంలో కాపు వేసుకున్నారు. టాంక్‌బండ్ ప్రాంతం నిర్జనంగా వుంది. టాంక్‌బండ్‌కి యెవరైనా వెళ్ళాలనుకున్నా పోలీసులను దాటి వెళ్ళాలి.

శైలజకు శత్రువులు అపకారం చేస్తారేమో!

ఆమెకు యెలాంటి హానీ జరగనివ్వం అని అధికారులూ, డిటెక్టివ్ శిరీష్ చెప్పారు. అయినా తనది తండ్రి హృదయం.

రమణమూర్తి విసురుగా మెట్లు దిగాడు. గారేజి తెరిచాడు.

కారు రోడ్డుమీద వరుగెత్తుతోంది.

టాంక్‌బండ్‌కి రెండు ఫర్లాంగుల యివతల పోలీసులు కారును ఆపారు.

రమణమూర్తి కారు దిగాడు. క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్‌ను సమీపించాడు.

"నా శైలజ....ఇంతసేపు రాకుండా...." వెక్కుతోన్నాడు రమణమూర్తి.

కుమార్ జీపు తీశాడు.

రమణమూర్తి తేరుకొని కారులో బయలుదేరాడు.

టాంక్‌బండ్‌మీద శైలజ లేదు. రమణమూర్తి కారుగా రోడ్డుమీద తిరుగుతోంది. చెట్ల వెనక వెళ్తోంది.

కుమార్ జీపు దిగాడు. టాంక్‌బండ్‌మీద ఒక చోట తెల్లటి కాగితం రెపరెప లాడుతోంది. కాగితంమీద రాయి పెట్టివుంది.

కుమార్ కాగితం తీసుకొన్నాడు. టైప్ చేసివుంది. ఆంగ్లం:

వీధి దీపాల వెలుతురులో టైప్ చేసిన విషయం చదవసాగాడు.

> "మశూచి క్రిముల పేరుతో నకిలీ శోధన నాళికను యిచ్చారు. అందుకే శైలజను ఎత్తుకు పోతున్నాం.
>
> పరిహారంగా యాభై లక్షల రూపాయలు అమెరికన్ కరెన్సీలో యేర్పాటు చేయండి. ఎలా మాకు అందించాలో తర్వాత తెలియచేస్తాం.
>
> —శ్రేయోభిలాషులు."

కుమార్ పిచ్చిగా చూశాడు.

శత్రువులు ఎటునుండి వచ్చారు? శైలజను ఎట్లా ఎత్తుకుపోయారు?

రమణమూర్తి కారు ఆపాడు.

కుమార్‌ను సమీపించాడు. ఉత్తరంవైపు భయంగా చూడసాగాడు.

'నా శైలజ!' గొణుక్కుంటున్నాడు.

కుమార్ విచారంగా చూశాడు.

"రండి వెళ్దాం!" అన్నాడు.

"ఇంతమంది పోలీసులూ.... డిటెక్టివ్ శిరీషూ, మీరూ, ఇంతమంది కలిసి నా శైలజను రక్షించలేక పోయా' అన్నాడు రమణమూర్తి.

"శత్రువులు తప్పించుకోలేరు. నా మాట నమ్మండి. వాళ్ళను పట్టుకుంటాం! మీ అమ్మాయిని తిరిగి.... ఒప్ప చెప్పి...." కుమార్ పూర్తిగా చెప్పలేకపోయాడు. తనలో ఆత్మవిశ్వాసం తగ్గుతోందా? తాను శైలజను తిరిగి రమణ మూర్తికి ఒప్పచెప్పగలడా?

4

శిరీష్ కణతలు రుద్దుకున్నాడు.

మరోమారు ఉత్తరంవైపు చూశాడు. టాంక్‌బండ్ మీద శత్రువు ఉంచిన ఉత్తరం. శైలజకు కారులో అందిన వుత్తరం, ఈ వుత్తరమూ ఒకే టైపు మిషన్‌మీద టైపు చేసినవి.

శత్రువులు అమెరికా దేశస్థులా? అందుకే వాళ్ళు అమెరికన్ కరెన్సీ రూపంలో డబ్బు యివ్వమని కోరారు. వాళ్ళు టాంక్‌బండ్‌కి ఏ మార్గంలో రాగలిగారు? శైలజను ఎలా ఎత్తుకుపోగలిగారు?

ఆలోచించేకొద్దీ మతిపోతోంది.

తన పథకంలో యెక్కడో పొరపాటు జరిగింది.

ఆ పొరపాటువలన శత్రువులకు యాభై లక్షలు పరిహారం యిచ్చుకోవలసి వస్తోంది.

డిటెక్టివ్ శిరీష్ కళ్ళు మెరిశాయి.

శత్రువులు మొదట మణాచి క్రిములకోసం తాపత్రయ పడ్డారు. తరువాత శైలజను ఎత్తుకుపోయారు. శైలజకు బదులుగా యాభై లక్షల రూపాయలు అడిగారు.

పశూచి క్రిములను కేవలం యాభై లక్షల రూపాయిల
డిమాండ్ కోసం ఎత్తుకుపోబోయారన్నమాట!

క్రిములనే ఎత్తుకుపోయి బెదిరించాలన్న ఆలోచన
ఎందుకు వచ్చింది? శత్రువులకూ క్రిములకూ సంబంధం
ఏమిటి?

డిటెక్టివ్ శిరీష్ బయటకు నడిచి రోడ్డుమీద నిలబడ్డాడు.
ఖాళీగా పోతున్న టాక్సీని పిలిచాడు.

క్రయింబ్రాంచ్ ఆఫీస్ ముందు టాక్సీ దిగాడు.

కుమార్ తన ఆఫీస్ గదిలో కూర్చుండి వున్నాడు.

"మనం కోరిన సమాచారం ఎయిర్‌లైన్స్ ఆఫీసు
నుండి వచ్చింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కుమార్.

"చెప్పు" అన్నాడు శిరీష్ కూర్చుండి.

"హైదరాబాదు నుండి బొంబేకు వెళ్తోన్న ప్రయాణీకుల
గురించి రేపటి నుండి ఒక వారం రోజులవరకూ వివరాలు
యిచ్చారు."

"వాళ్ళలో బొంబే-న్యూయార్క్ ఎయిర్ టికెట్ కోసం
రిజర్వ్ చేయించుకున్నవాళ్ళున్నారా?"

"వున్నారు. మొత్తం ఇరవై పంది వరకూ ఈ వారం
రోజుల్లో రిజర్వ్ చేయించుకున్నవాళ్ళు వున్నారు."

"అడ్రస్సులతో సహా సంపాదించావా?"

"ఆహాఁ! అడ్రసులన్నీ ఈ జంట నగరాల్లో నివసించే
వాళ్ళవే. ఒక అడ్రసుమటుకు కరీంనగర్‌ది. టెలెక్స్‌లో
వివరాలు రప్పించుతాను."

"వెరీగుడ్! అడ్రసుల ప్రకారం మనం నిఘా ఏర్పాటు
చేసుకోవచ్చు."

"కాని, మన 'క్రిముల శత్రువులు' ఎయిర్ టిక్కెట్స్
రిజర్వ్ చేసుకొంటేనే యీ యిరవై పందిలో దొరుకుతారు.

లేకపోతే....''

''ఆ విషయం తర్వాత చూద్దాం!''

''కాని, శత్రువులు కోరిన యాభై లక్షలు ఎక్కడన తెచ్చి యివ్వగలం?''

''శత్రువులు రాష్ట్రప్రభుత్వంతో బేరంపెట్టారు. రాష్ట్రప్రభుత్వం యీ విషయంలో కేంద్రాన్ని సంప్రదించాలి....''

''పోలీస్ యిన్‌స్పెక్టర్ జనరల్ ఆ ప్రయత్నంలోనే వున్నారు!''

బల్లమీద టెలిఫోన్ గణగణ లాడింది.

రిసీవర్ ఎత్తాడు కుమార్.

''కుమార్'' పిలిచాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్.

''సార్!'' కుమార్ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు వినయంగా.

''మశూచి క్రిములను బొంబాయి హాఫ్‌కిన్ ఇన్‌స్టిట్యూట్ నుండి ఎత్తుకుపోగలమని శత్రువులు ప్రకటించారు.''

''సార్! ఈజిట్ సార్?''

''అంతేకాదు. దేశంలో వున్న క్రిముల పరిశోధనాగారాల్లోంచి క్రిములను ఎత్తుకుపోతారట. అందుకే హోం మంత్రి నాకు అనుమతి యిచ్చారు. శత్రువులకు యాభై లక్షల రూపాయిలు చెల్లించమన్నారు. రాష్ట్ర హోం మంత్రితో కలిపి చర్చిస్తాం. సాయంత్రం అయిదు గంటలకు హోంమంత్రి నివాసంలో మనం కలుసుకుంటాం!''

''ఎస్ సార్! థాంక్యూ సార్! శిరీష్‌తో కలిపి వస్తాను!''

అవతల రిసీవర్ క్లిక్ మన్న తర్వాత కుమార్ ఫోన్ పెట్టేశాడు.

౯

బల్లమీది టెలిఫోన్ మ్రోగింది. హోంమంత్రి నివాసం నుంచి ఫోన్ అంది.

పోలీస్ యిన్స్పెక్టర్ జనరల్ చిరాకుగా టెలిఫోన్ అందుకున్నాడు.

"ఎస్ ...." అన్నాడు ఐ.జి. గర్వంగా.

కుమార్, శిరీష్ ఆయనవైపు ఓరగా చూశారు.

"శ్రేయోభిలాషులం ఐ.జి.గారూ."

"డామిట్! నాకే ఫోన్ చేయడానికి మీకు ఎంత ధైర్యం?"

"యాభై లక్షల రూపాయలు అమెరికన్ డాలర్స్‌లో ముఖ్యమంత్రి వద్ద సిద్ధంగా వున్నాయి. ఆ డబ్బు తీసుకుని రమణమూర్తి అబిడ్స్ సెంటర్‌లో నిలబడి వుండాలి. చుట్టూ ఒక మైలు పరిధిలో ఎవరూ వుండకూడదు. వుంటే రమణమూర్తిని చంపేస్తాను. అదే సమయంలో వైరస్ లాబ్ పేలిపోతుంది. ఈ రాత్రి పది గంటలకు!" అవతల క్లిక్‌మన్నది.

ఇన్స్పెక్టర్ జనరల్ కోపంగా చూసి రిసీవర్ పెట్టేశాడు. వాచీ చూసుకున్నాడు.

"రాత్రి ఎనిమిదయింది. అంటే యింకా రెండుగంటల వ్యవధి!" అరిచాడు ఐ.జి.

శిరీష్ జేబులోంచి వుత్తరాలు తీశాడు.

ఒకటి శైలజకు కారులో అందించిన వుత్తరం. రెండో వుత్తరం టాంక్‌బండ్‌మీద అందించింది.

"హైదరాబాద్‌నుండి అమెరికా వెళ్ళేవారి జాబితాను మేము అంటే కుమార్, నేనూ పరిశీలించాం. అందరూ ఇండియన్స్. ఇతర దేశాల వాళ్ళు లేరు. శత్రువులు

మనకి యింతకుముందు తెలియచేసినట్టు దేశం విడిచి పెట్టరు. సద్దుమణిగాక దేశం వదలిపోతారు."

ఐ జి., కుమార్ తలలూపారు.

"మాకు మీరు చేసిన ఫోన్ కాల్ శత్రువులకు అంటే

"అంటే.... అంటే .... క్రైంబ్రాంచ్ వారి ఫోన్ శత్రువులు టాప్ చేశారన్నమాట!" ఆవేశంతో వూగిపోయాడు ఐ.జి.

"మరో ముఖ్య విషయం. దేశంలో వున్న క్రిమి ల పరిశోధనాగారాలకు వచ్చిన బెదిరింపు వుత్తరాల ఫోటోలు సంపాదించాలి."

"ఎలా? వ్యవధి చాలదు?"

"ఆటో టెలిప్రింటర్స్‌లో ఫోటోలు వస్తున్నాయి. మీరు తల్చుకుంటే దేశం మొత్తం ఒక్కసారిగా బద్ధకం విరుచుకుంటుంది. కావలసిన సమాచారం క్షణాలలో అందిస్తుంది."

"రైట్! మీ అనుమానం ఎవరిమీద? జంటనగరాల్లో వున్న విదేశీయుల జాబితాను మీరు తీసుకున్నట్టు సెక్రటేరియట్ కార్యాలయం వాళ్ళు చెప్పారు."

"నేను యిప్పట్లో ఏమీ చెప్పలేను. సఫర్‌గంజ్‌లోని వైరస్ లాబ్‌కి ఒకసారి వెళ్తాను. అక్కడవున్న పోలీసు బలగానికి ఉత్తరం రాసి యివ్వండి!"

ఐ జి. క్షణాలలో వుత్తరం రాసి యిచ్చాడు.

"రమణమూర్తిని పదిగంటలకు డబ్బుతో పంపిస్తాం."

"శిరీష్! ఆ మాత్రం దానికి ఈ ప్రయత్నాలు ఎందుకు?"

"శత్రువులు దొరకవచ్చు. రమణమూర్తి కూతురు శైలజకు శత్రువులు హాని తలపెట్టవచ్చు. అందుకే డబ్బుతో రమణమూర్తిని పంపిస్తాం. శత్రువులు రమణమూర్తినే

పంపమనడం ఒక విశేషం!"

"ఆల్‌రైట్. నేను దేశంలోని వైరస్ లాబ్స్‌తో సంప్ర
...." ఐ.జి. కదిలాడు.

...ద్దరూ హోంమంత్రి నివాసంలోంచి బయటపడ్డారు.

6

రాత్రి పదిన్నర.

ఎప్పుడూ రద్దీగా వుండే అబిడ్స్ నిర్మానుష్యంగా వుంది. దూరంగా పేవ్‌మెంట్ ప్రక్కగా కారు ఆగివుంది.

ఐ.జి. కారును సమీపించాడు.

డ్రయివింగ్ సీట్లో వున్న వ్యక్తి స్టీరింగ్ వీల్‌మీద తల వాల్చాడు. ఐ.జి. అతడిని కదిపి చూశాడు.

అతడు కదిలాడు. మెల్లగా కళ్ళు తెరిచాడు.

"ఎవరు సార్?" అడిగాడు అతడు.

"నేను ఐ.జి.ని. మీరెవరు?"

కారులో కూర్చున్న వ్యక్తి వులిక్కిపడి కారు దిగాడు.

"నేను రమణమూర్తిని సార్! వైరస్ లాబ్‌కి సూపర్నెంటును."

"మీరా? శత్రువులకు డబ్బు యిచ్చారా?" అడిగాడు ఐ.జి.

"డబ్బు తెచ్చి యిక్కడ వుంచమన్నార్సార్. కారు ఆపుతోంటే ఎవరో నామీద క్లోరోఫాం జల్లారు. నాకు స్పృహ తప్పింది. డబ్బు నా ప్రక్క లేదు."

ఐ.జి. నిట్టూర్చాడు. "మశూచి క్రిములు యివ్వమని బలవంతపెట్టారు. చివరకు యాభై లక్షల రూపాయలు లాక్కున్నారు."

రమణమూర్తి బొంగురు గొంతుతో అడిగాడు.

"సార్! ఆ విదేశీ విద్రోహులు డబ్బు తీసుకున్నారు.

కాని నా కూతురు శైలజను...."

కారు ప్రక్కనే టాక్సీ వచ్చి ఆగింది.

టాక్సీలోంచి కుమార్, శిరీష్ దిగారు.

రమణమూర్తి టాక్సీలోకి చూచి వులిక్కిపడ్డ చటుక్కున జేబులో చెయ్యిపెట్టి పిస్తోలు తీశాడు.

శిరీష్ చటుక్కున కాలితో తన్ని రమణమూర్తి పిస్తోలు ఎగరకొట్టాడు.

ఐ.జి., కుమార్ ముందుకు వచ్చి రమణమూర్తిని అదుపులోకి తీసుకున్నారు.

"టాక్సీలో శైలజ వుంది. ఆమెవద్ద డబ్బు వుంది!" అన్నాడు శిరీష్.

అద్దాలకు తలవాల్చింది శైలజ.

ఐ.జీ. ప్రశ్నార్థకంగా చూశాడు.

శిరీష్ ఆయనకు శత్రువులు రాసిన వుత్తరాలు అందించాడు.

"ఈ ఉత్తరాలూ, దేశంలోని వైరస్ లాబ్స్‌కి వచ్చిన ఉత్తరాలూ శైలజ టైప్ చేసినవే! ఆమెకు కారులో శత్రువులు అందించిన ఉత్తరమూ, టాంక్‌బండ్ మీద అందించిన ఉత్తరమూ పరిశీలిస్తే క్రింద ఎస్ అక్షరమూ నక్షత్రమూ టైప్‌చేసి కనిపిస్తాయి. టైప్ చేసినవాళ్ళు విషయం క్రింద తమ పేరులోని మొదటి అక్షరంగానీ రెండుమూడు అక్షరాలుగానీ టైప్ చేస్తారు. రెండు వుత్తరాల్లో ఎస్ అక్షరమూ నక్షత్రమూ టైప్‌చేసి వున్నాయి.

దేశంలోని లాబ్స్‌కి వచ్చిన వుత్తరాల నకళ్ళు మీరు తెప్పించారు. వాటిలో కూడా ఎస్ అక్షరమూ నక్షత్రమూ టైప్ చేసివున్నాయి. నేను లాబ్‌కి వెళ్ళకముందు ఈ విషయం తోచింది. మీ అనుమతితో లాబొరేటరీలో శైలజ

సీటు వెతికాను. నా అనుమానం నివృత్తి అయింది. ఆమె
టైప్ చేసిన టైప్ మిషనూ, మిగతా జైప్డు వుత్తరాలూ
దొరికాయి."

అంటే మీకు అంతకు ముందు రమణమూర్తి మీద
న, శైలజ మీదగానీ అనుమానం రాలేదన్న మాట!"

"టాంక్‌బండ్ చుట్టూ బలమైన పహరా వుంది. అయి
నప్పటికీ శైలజ మాయమయింది? తన కూతురిమీది
వాత్సల్యంతో రమణమూర్తి టాంక్‌బండ్ మీదకు వెళ్ళాడు.
కుమార్ దృష్టి టాంక్‌బండ్ మీదవున్న వుత్తరం మీద
వుంది. అప్పుడే చెట్లచాటుకు రమణమూర్తి కారు
వెళ్ళింది.

శైలజ టాంక్‌బండ్ మీద ఉత్తరం వుంచి చెట్ల
చాటున దాక్కుంది. రమణమూర్తి కారు ఆపగానే ఆమె
డిక్కీ తెరచి దాక్కుంది. క్రిములనాశిక నకిలీదని శత్రువు
లకు ఎలా తెలిసింది. శైలజ వల్లనే తెలియాలి గదా!
తెలుసుకున్న తర్వాత లెటర్ అప్పటికప్పుడు టైప్‌చేసి
అక్కడ పడవేసే అవకాశం ఎక్కడిది?

రమణమూర్తి మరొక విషయంలో కూడా పప్పులో
కాలేశాడు.

క్రిములను అందించడానికి శైలజను రమ్మన్నారు
శత్రువులు!

యాభై లక్షలు అందించడానికి రమణమూర్తిని రమ్మ
న్నారు శత్రువులు!

అందుకే శత్రువులకు రమణమూర్తి శైలజల మీద
వున్న ప్రత్యేక నమ్మకం మనకు సంశయం కలిగించింది.

అబిడ్స్‌లో రమణమూర్తి అంతకుముందే శైలజను

సెంటర్‌కి దగ్గరగా వున్న హోటలులో దాచాడు. శైలజ సెంటర్‌కి వచ్చి డబ్బుతో తిరిగి హోటల్‌కి చేరుకు

నేను లాబ్‌లో దర్యాప్తు చేసి అబిడ్స్ చేరుక శైలజ డబ్బుతో వెళ్తూ పట్టుబడింది'' ముగించాడ

''రమణమూర్తి మశూచి క్రిముల పేరు చెప్పి ప గొట్టాడు!'' కుమార్ కళ్ళు ఎరుపెక్కాయి.

''రమణమూర్తి తలలో విదేశీ ప్రయాణం కలలు మశూచి క్రిముల్లాగా క్షణక్షణం వృద్ధిపొందాయి. ఫలితంగా తండ్రీ కూతుళ్ళు పథకం వేశారు'' కదిలాడు శిరీష్.

ఐ. జి. కరచాలనం చేసి, శిరీష్‌ను ఆలింగనం చేసుకున్నాడు. □

''అక్షరాస్యుడే!''

"ప్రజలను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాను. ఏం చదువుకున్నావు?" అడిగాడు.

"ఉస్మానియా యూనివర్సిటీలో డబల్ ఎం. ఏ. చదివాను.లండన్ యూనివర్సిటీలో పి. హెచ్.డి. చేసాను."

"చాలు, చాలు. అయితే నీకు చదవడానికి రాయడానికి వస్తుందని రిపోర్టులో రాసుకుంటాను."

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

సీరియల్



వాణిశ్రీ
కాంచనగ్రహం

(గత సంచిక తరువాయి)

29

రూమ్‌బాయ్ ఇంగ్లీషు పేపరు తెచ్చి టీపాయ్ మీద పెట్టాడు. అరుణతార తను చదువుతున్న నవల మధ్యలో కాగితంపీస్ పెట్టి మడిచి, పేపరు అందుకుంది.

వెండికొండ డామ్ పగులు వెనుక కుట్ర. 'కంట్రాక్టర్ గోవిందరాయుడు ఆరోపణ' అని వున్న హెడ్డింగ్ చూసి

ఆమె ఆదుర్దాగా అదంతా చదివింది. డామ్‌కి పగులు
దని తను చూసిందిగాని, అందులో తన తండ్రి
చేయించిన బ్లాక్‌కి అని ఆమెకు తెలీదు.

అదంతా చదివి ఆమెకు ఆశ్చర్యం వేసింది.
వచ్చిన ఆరోపణ తప్పుకోడానికి నేరం కృష్ణచైతన్య
నెట్టినట్లు ఆమెకు అర్థమైంది.

లేకపోతే ఏమిటిది? తన తండ్రి యిక్కడ నుంచి వెళ్ళి నప్పట్నుంచి చైతన్య తనతో వున్నాడు. కాని తన తండ్రి అతన్ని నేరస్థుడిగా ఆరోపించడం ఏమిటి?

ఆమెకు తండ్రిమీద కోపం ముంచుకొచ్చింది. అతని మీద తండ్రికి కోపం వుండొచ్చుగాక. అంత మాత్రానికి లేని పోని నేరాలు అంటగట్టి ప్రభుత్వం దృష్టిలో ముద్దాయిగా నిలబెట్టడం యెంతవరకూ సమంజసం? ఢిల్లీలో వున్న వ్యక్తి కొన్ని వందలమైళ్ళ దూరంలోవున్న డామ్‌ని పగలగొట్టడానికి అవకాశం ఏది? ఎంత దుర్మార్గుడైనా తనకి కోపంవున్న వ్యక్తిని యిబ్బందిపెట్టడానికి నలుగురికీ అన్నం పెట్టే డామ్‌ని పగులగొట్టగలడా?

ఆలోచించేకొద్దీ ఆమెకు తండ్రిమీద కోపం ఎక్కువైందేగాని తగ్గలేదు. వెంటనే తండ్రిమీద కేకలువేస్తేగాని ఆమెకు కోపం తగ్గేటట్లులేదు. హైదరాబాదులో వున్న తండ్రి పేరున పి. పి. కాల్ బుక్ చేయమని ఆపరేటర్‌కి చెప్పింది.

అరగంట తర్వాత గోవిందరావు ఫోన్‌లో పలికాడు.

"నాన్నా! నువ్వింత దుర్మార్గుడివనుకోలేదు" అంది అరుణతార గట్టిగా.

"ఏమిటమ్మా! నువ్వనేది. ఏ విషయం?" అన్నాడు గోవిందరాయుడు.

...వ్వే ఇచ్చిన పేపర్ స్టేట్‌మెంట్ చదివాను."
...దా!" అన్నాడు.

...నువ్వు వెళ్ళిన దగ్గర్నుంచీ చైతన్య యిక్కడే ... అతను సిక్ అయ్యాడు. బెడ్‌రెస్ట్ తీసుకుంటు... నాకు తెలియకుండా అతను యెక్కడికీ వెళ్ళలేదు. ...పొలిమేరలు దాటలేదు. అటువంటివాడు డామ్ పగల గొట్టడానికి కుట్ర ఎలా చేయగలడు?"

"అయ్యిందా నీ ఉపన్యాసం?"

"నా మాటలు నీకు వుపన్యాసంలా అనిపిస్తున్నాయా?"

"లేకపోతే ఏమిటమ్మా నీ గొడవ. చెప్పిన మాట వినకుండా మొండి శిఖండిలా తయారయ్యావు. స్టేట్స్‌కి వెళ్ళకుండా ఢిల్లీలో కూర్చుని వాడితో షికార్లు కొడుతున్నావు. పైగా నన్ను దబాయిస్తున్నావా? నీకు నేనంటే అసలు గౌరవం వుందా? శత్రువుని వెనకేసుకొస్తున్నావా?"

"అతడు నీకు శత్రువైతే నాకు అప్తుడు నాన్నా!"

"అయితే ఇప్పుడేమంటావు. అతను నీ దగ్గరే వున్నాడంటావ్! అంతేనా? నీ కసలు బుర్రలేదు. అతను సామాన్యుడు కాడనీ, ఎంతో శక్తి సామర్థ్యాలు వున్నవాడనీ నువ్వే అన్నావు. గుర్తుందా? అటువంటివాడు ఢిల్లీలో వుండిగూడా ఏ పనైనా చెయ్యగలడు. ఏది చేసినా స్వయంగా చేస్తేనే చేసినట్లు కాదు చేయించినా సరే! అర్థమైందా?"

అరుణతార ఫోన్ టక్కున పెట్టేసింది.

"ఛీ....ఏం మనిషి?" గొణుక్కుంది విసుగ్గా.

ఇప్పుడామెకు తండ్రి అంటే గౌరవం పోయింది. తను చేసిన నేరం ఇతరులమీదకు నెట్టేవాడిని దుర్మార్గుడనాలా? రాక్షసుడనాలా? తనూ ఇంజనీర్లు లాలూచీ పడి డబ్బు

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 44: కాబరే డాన్సర్ రీటాకు ప్రొప్రయిటర్ నాట్యంచేసినందుకుగాను రు. 500/-లకు ఇచ్చారు. రీటా, డాక్టర్ నళినికి కొంత డబ్బివ్వవలసి వుంది. అందుకని ఆ చెక్కుని నళిని పేరిట ఎండార్స్ చేసి ఇచ్చింది.

అయితే ఖాతాలో డబ్బు లేనందువల్ల బ్యాంకులో ఆ చెక్కు నిరాకరించబడింది. నళిని కోపంతో రీటాపై దావావేసింది. అయితే రీటా ఆ చెక్కును తనకు మరొకరిచ్చేరు గనుక తన బాధ్యత లేదంది.

ఇక్కడ న్యాయ నిర్ణేత మీరే అయితే, మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-5-'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రిక బహుమతిగా పంపుతాము. ఫలితాలు జూలై '82 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 42 (తీర్పు)

రాధ వాదన సరికాదు!

చట్టరీత్యా ఒక్కొక్క కుక్క మొత్తం నష్టాన్నంతటినీ కల్గించినట్లు భావించబడుతుంది. మొత్తం నష్టపరిహారం రాధ, మాధవి ఇద్దరూ కలిసి ఇచ్చుకోవాలి. ఆ మొత్తం ఎలా పంచుకుంటారనేది వారిలో వారు తేల్చుకోవాలి. కోర్టు ఆ విషయంలో కలగజేసుకోదు.

[ఈ నెల సరియైన తీర్పు ఎవరూ ఇవ్వలేదు. అందరూ రాధ వాదన సరియైనదనే వ్రాశారు. అందువలన బహుమతికి ఎవరూ అర్హులు కాలేదని తెలుపుటకు విచారిస్తున్నాము. —ఎడిటర్.]

'దించుకున్నారు. దేశానికి ద్రోహం చేశారు. అది
ఏదేపరికి కుంటిసాకులు చెప్పి ఆ నేరం ఎవరిదో
యన్నారు. భలే పెద్దమనిషి!
ృష్ణచైతన్య నిద్ర లేచాడు.
బాగా తెల్లారిపోయి వుంది.
సూర్యకిరణాలు కిటికీలోనుంచి దూసుకొస్తున్నాయి.
అతను బెడ్ మీద లేచి కూర్చున్నాడు. బద్ధకంగా వళ్ళు
విరుచుకున్నాడు.
"బాగా తెల్లవారిందే!" అన్నాడు.
"కొంచెం తెల్లవారుతుందా మరి" అంటూ దగ్గరగా
వచ్చింది అరుణతార.
"ఎవర్నీ కేకలేస్తున్నావ్?" అన్నాడు.
ఆమె పేపరు చేతికిచ్చి "ఇది చదివితే తెలుస్తుంది"
అంది.
అతను అది చదివాడు. కొంచెంసేపు మౌనంగా వుండి
పోయాడు. ఏదో ఆలోచనలో పడిపోయాడు.
"మా నాన్నని ఫోన్‌లో పిలిచి తిట్టాను" అంది ఆమె.
"ఎందుకూ?" అని ప్రశ్నించాడు చైతన్య.
"ఎందుకేమిటి? చూశావుగా నీ మీద ఎంతటి అభాండం
వేశాడో? నేను ఇక్కడ లేకుండా దూరంగా వున్నట్లయితే
నిజమని నమ్మేదానినేమో!" అంది.
"ఇందులో మీ నాన్న తప్పు ఏమీలేదు" అన్నాడు
అతను.
అరుణతార నివ్వెరపోయింది అతని మాటలు విని.
"ఏమిటి నువ్వనేది?"
"అవును తారా! మీ నాన్నకు నా మీద అనుమానం
వుండడం సహజమే. పరిస్థితులు మనిషితో అలా ఆలో

అపరాధ పరిశోధన పోటీ-,

[ఫలితాలు]

మార్చి '82 నెల "అపరాధ పరిశోధన పోటీ— సరియైన సమాధానాలు:

1. ఐదు.
2. పాము.
3. సావిత్రి.
4. బీదరికం.
5. దోమ.

పై జవాబుల ప్రకారం నలుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జూన్ '82 నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ కె. శ్రీనివాసరావు, ఎల్.ఐ.సి.
4—5—19, పేరమ్మ అగ్రహారం,
అమలాపురం—533203. (తూ. గో. జిల్లా.)

(2) శ్రీ ఆర్. రాజన్న,
ఇంటి నెం. 215, హనుమాన్ స్ట్రీట్,
బెల్లంపల్లి—504251.

(3) శ్రీమతి ఎ. సుందరరత్నం,
w/o ఎ. హరిప్రకాష్,
సి. ఐ. ఇ. ఎఫ్. ఎస్. ఆఫీసు,
నేషనల్ హైవే—5,
విజ్ఞాన నగర్, విశాఖపట్టణం—18

(4) శ్రీమతి ఏ. వి. సుబ్బలక్ష్మి,
6—6—37, కవాడిగూడ,
సికింద్రాబాదు.

్రయి. జరిగిన సంఘటనలనుబట్టి నేను చేసినవి ఇబ్బందిలో పెట్టాయి. ఇదీ అలాగే అనుకున్నాడు.

ర్వు" అన్నాడు అతను నిబ్బరంగా.

మన అనుమానం అలా వుండనీ గవర్నమెంట్ అరెస్ట్ చేస్తే! మరింత బాధకదా! చెయ్యని నేరాన్ని నకు నెత్తిన వేసుకోవాలి" ఆవేశంతో అంది ఆమె.

"గవర్నమెంట్ నన్ను అరెస్ట్ చేసి లాభంలేదు. మీ నాన్న స్టేట్మెంట్ ఆధారంగా నన్ను ఎవరూ నిర్బంధించలేరు. ఇక చెయ్యని నేరం అంటావుగదా! ఇప్పుడు మనం ఏం చెప్పినా లాభంలేదు."

"అలా అని ఊరుకుంటావా?"

"మరేం చెయ్యాలంటావు!"

"ప్రెస్ వాళ్ళని పిలిచి నువ్వొక స్టేట్మెంట్ ఇవ్వు దాన్ని ఖండిస్తూ. నా పెళ్ళి నా యిష్టం అనీ నన్ను ఎవరూ ఆపలేరనీ నేను చెప్తాను" అంది ఆమె.

"అదంతా అనవసరం తారా!"

"చైతన్యా! నువ్విప్పటికే ఇబ్బందుల్లో వున్నావు. ఆరోగ్యం చెడిపోవడం ఒకటి, ప్రభుత్వం నిన్ను విదేశీ గూఢచారి అని అనుమానించడం మరొకటి, ఇప్పుడు విద్రోహచర్యలు అని మరొకటి."

అతను అర్థోక్తిలో అందుకుని "నేను దేనికీ భయపడను తారా! చివరకు మృత్యువుకి గూడా!" అన్నాడు.

ఆమెకు జరిగినదంతా జ్ఞాపకం వచ్చింది

చైతన్యకి అప్పుడు స్పృహతప్పి పడిపోయాక హాస్పటల్లో అడ్మిట్ చేశారు. రెండురోజుల తర్వాత గూడా తెలివి రాలేదు. ఆమె ఆందోళన చెందింది. ఎంత డబ్బు ఖర్చయినా సరే అతన్ని రక్షించమని డాక్టర్లని బ్రతిమాలింది.